ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-8-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 207 పేజీలు: 12 వెల: 6.50

'ఓట్లచోరీ'పై ఇసి ప్రజాభిప్రాయం
ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం
9లో



## శుభాకాంక్షలు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా మా పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు.

-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ &మేనేజింగ్ డైరెక్టర్

**సెలవు** పండుగ సందర్భంగా బుధవారం 'వార్త' కార్యాలయానికి సెలవు. గురువారం సంచిక వెలువడదు. పునర్దర్శనం 29వ తేదీ శుక్రవారం

# సకాలంలో రైతు రుణాలు

## కౌలు రైతుల పట్ల మానవీయ కోణంలో ఆలోచించాలి

### అవసరం తీరిన తర్వాత అప్పు ఇస్తే ఉపయోగం లేదు..

### ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో సిఎం చంద్రబాబు



మంగళవారం ఎస్‌ఎల్‌బిసి సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** రైతుల ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చే దిశలో బ్యాంకర్లు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వ్యవసాయరుణాల మంజూరు విషయంలో జాప్యంచేయడం మంచిది కాదన్నారు. కౌలు రైతుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలన్నారు. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్‌ఎంఇ, ఎస్‌హెచ్‌జి రంగాలకు రుణ వితరణ లక్ష్యాలు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై 232వ సమావేశంలో సమీక్షించారు.ఈ సమావేశంలో 231 ఎస్‌ఎల్‌బిసిలో తీసుకున్న నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టుపై సిఎం ఆరాతీశారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రపెన్యూర్ కార్యక్రమం, 175 నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు అంశంలో బ్యాంకుల సహకారంపై చర్చించారు. ఎస్‌ఎల్‌బిసి సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలనితెలిపారు. ఎస్‌ఎల్‌బిసి సమావేశాలు రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలన్నారు. రివాజు సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు,ఖరీఫ్ తరుణంలో ఇప్పటి వరకు బ్యాంకులు వ్యవసాయ రుణాలు ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సి ఉంది. ఈ పాటికే రైతులకు రుణాలు, ఇన్ పుట్ ఇవ్వాల్సి ఉంది. పెట్టుబడిఅవసరాలకు రైతుకు అవసరమయ్యే బ్యాంకులను ఆశ్రయిస్తారన్నారు. అటువంటి >>2

## వచ్చే యేడాదికల్లా మరో 4 పోర్టులు

### రోడ్డు,రైలు మార్గాలతో అనుసంధానం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల పనులను వేగంగా పూర్తి చేసి 2026 నాటికి వాటిని వినియోగంలోకి తేవాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్య నిర్దేశనం చేసింది. ఇందుకు సంబంధించి సిఎంఒసమగ్ర సమాచారం విడుదల చేసింది.. పోర్టులను అనుసంధానిస్తూ రోడ్డు, రైలు మార్గాల కనెక్టివిటీ ప్రాజెక్టులను ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. పొరుగు రాష్ట్రాలకు కూడా పోర్టు సేవలు విస్తరించేలా ప్రతిపాదనలు రెడీ చేసింది. దీనికోసం తెలంగాణ, ఒడిశాల్లో డ్రైపోర్టులు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి పోర్టులను అనుసంధానించే ప్రతిపాదనలను రూపొందించింది. సముద్ర తీరం వెంట ప్రతి 50 కిలో మీటర్లలకు పోర్టు, ఆధారిత పరిశ్రమల ఏర్పాటు ద్వారా మొత్తంగా 20 పోర్టులను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

**రామాయపట్నం పోర్టు**

రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు 69 పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే, భారీ సైజు నౌకల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం ప్రతిపాదించిన డ్రెడ్జింగ్‌ను 16 నుంచి 18.5 మీటర్లకు పెంచాలంటూ నిర్మాణ సంస్థ ప్రతిపాదన చేసింది. ఈ >>2

## మరో రెండు రోజులు వర్షసూచన

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 2 రోజుల్లో పశ్చిమవాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో రేపు ఉత్తరాంధ్రలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 40-60 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం >>2



వరల్డ్‌బుక్ రికార్డు నిర్వహకులు అందించిన ధృవీకరణ పత్రం,మట్టి వినాయక ప్రతిమలతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్,జిల్లా కలెక్టరు లక్ష్మీశ

# పర్యావరణ 'చవితి' జరుపుకొందాం

### మట్టి గణపతి ప్రతిమలనే పూజించండి

### మండపాలకు ఉచిత కరెంటు, అనుమతులు

### విజయవాడలో 7,730 గణేశ ప్రతిమలతో ప్రపంచ రికార్డు

### రాష్ట్ర ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ హెడ్ క్వార్టర్ జిల్లా ఎన్టీఆర్ డిస్ట్రిక్ మరో ప్రపంచ రికార్డును సాధించింది. పర్యావరణహిత గణేష్ చతుర్థిని జరుపుకునేలా ప్రజలను ప్రోత్సహించేందుకు సరికొత్త ప్రపంచరికార్డును సొంతం చేసుకుంది. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యోగాంధ్ర మాసోత్సవాల్లో రెండు ప్రపంచ రికార్డులను సాధించిన ఘనత ఎన్టీఆర్ జిల్లాది.ఈ క్రమంలో శ్రీవినాయక చవితి ఉత్సవాల్లో ఏకో లార్డ్ గణేష్ ప్రతిమలకు ప్రాధాన్యతను కల్పించే దిశలో వరల్డ్ రికార్డును దక్కించుకుంది.అయిదువేల పర్యావరణహిత మట్టి ప్రతిమల తయారీని లక్ష్యంగా నిర్దేశించుకోగా 7,730 ప్రతిమల తయారీతో రికార్డును కైవసం చేసుకుంది. గతంలో మహారాష్ట్రలో 4,464 ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలతో రికార్డు నమోదు కాగా.. మంగళవారం జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో చేసిన ప్రయత్నం కొత్త రికార్డును లిఖించినట్లు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (డబ్ల్యూబీఆర్‌లండన్) భారత దక్షిణాదిజాయింట్‌సెక్రటరీ డా. యు. ఇలి >>2

## ఆత్మనిర్భరత దిశగా ఐఎన్‌ఎస్ ఉదయగిరి,హిమగిరి

### రెండు దేశీయ యుద్ధ నౌకలను జాతికి అంకితం చేసిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

### ఈ నౌకలతో భద్రతా వ్యవస్థ బలోపేతం

### మన నావికాదళ సామర్థ్యం మరింత పెరిగింది: రాజ్‌నాథ్





మంగళవారం విశాఖపట్నంలో ఐఎన్‌ఎస్ ఉదయగిరి, ఐఎన్‌ఎస్ హిమగిరిని జాతికి అంకితం చేస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

**విశాఖపట్నం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్ ఇంకా మిగిలిలేఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సోమవారం ఐఎన్‌ఎస్ ఉదయగిరి, ఐఎన్‌ఎస్ హిమగిరి జాతికి అంకితం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆయుధాలు, టెక్నాలజీతో కూడిన ఈ నౌకలు, సముద్ర కార్యకలాపాల యొక్క పూర్తిస్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే ఇంకా తయారు చేయబడ్డాయని చెప్పారు. నావికాదళ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి అన్నారు. "ఆత్మనిర్భరత ఇకపై కేవలం నినాదం కాదు అని, అది భూమి వాస్తవికతగా మారుతోంది అని భవిష్యత్ దృక్పథంలో సాయుధ దళాలను బలోపేతం చేస్తామన్నారు. స్వదేశీ ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ కంబాటెంట్‌లను ఒకేసారి ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి అని చెప్పారు. ఈ యుద్ధనౌకలు భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సముద్ర ప్రయోజనాలను కాపాడటమే కాకుండా, మానవతా సహాయం విపత్తు సహాయ కార్యకలాపాలలో కూడా సహాయపడతాయని రక్షణ మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. భారతదేశం యొక్క మహాసాగర్ (ప్రాంతంలోని అందరికీ భద్రత, వృద్ధి కోసం పరస్పర సమగ్ర పురోగతి)విధానాన్ని ఈ కమిషన్ బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. "భారత నావికాదళ సామర్థ్యాన్ని పెంచే ఈ యుద్ధనౌకలు, భారతదేశం తన సముద్ర సరిహద్దులను రక్షించుకోగల పూర్తి సామర్థ్యాన్ని కలిగి ఉందని ఏదైనా పరిస్థితికి వెంటనే స్పందించడానికి సిద్ధంగా ఉందని సందేశాన్ని పంపుతాయి" అని ఆయన అన్నారు. ఆత్మనిర్భర్ నావికాదళం ఐఎన్‌ఎస్ ఉదయగిరి, ఐఎన్‌ఎస్ హిమగిరి ప్రాజెక్ట్ 17 (శివాలిక్ తరగతి) యొక్క సక్సెసర్ క్లాస్ యొక్క లీడ్ షిప్ అయిన ఐఎన్‌ఎస్ నీలగిరిని అనుసరిస్తాయి అని చెప్పారు. అవి మెరుగైన స్టెల్త్ ఫీచర్లు, తగ్గించబడిన రాడార్ సంతకాలు, అధునాతన నిఘా రాడార్లు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌లు, సూపర్‌సోనిక్ ఉపరితలం నుండి ఉపరితలం క్షిపణులు, ఉపరితలం నుండి గాలికి క్షిపణులు, రాపిడ్‌ఫైర్ గన్ సిస్టమ్‌లను కలిగి ఉంటాయి అన్నారు. రెండు నౌకలలో కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్లు అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఉన్నాయి, ఇవి అధిక వేగం మరియు మెరుగైన ఇంధన సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. భారత నావికాదళానికి చెందిన వార్‌షిప్ డిజైన్ బ్యూరోద్వారా అంతర్గతంగారూపొందించిన 100,101వ యుద్ధనౌకలుగా భారతదేశంలో నిర్మించ >>2

## ఐపిఎస్ అధికారి సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఐపిఎస్ అధికారి పివి సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు పొడిగిస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలు నిరూపణ కావడంతో ఆయన్ను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో రెండు రోజుల్లో >>2





## టిడిఆర్ బాండ్ల స్కాంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి హస్తం

### ఆమె వేల కోట్లు దోచుకున్నారు..

### వైఎస్సార్సీ నేత భూమన సంచలన ఆరోపణలు



**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో సీనియర్ ఐఎఎస్ అధికారిణి ప్రమేయం ఉందని, ఆమె వేలకోట్లు దోచుకున్న అవినీతి అనకొండ అంటూ వైఎస్సార్సీ ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి సంచలనవ్యాఖ్యలు చేశారు. టిడిఆర్ బాండ్ల విషయంలో ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు, రెండేళ్లుగా తన మనసులో ఉన్న అభిప్రాయాన్ని ఇప్పుడు బయటపెడుతున్నానని భూమన మంగళావారం స్పష్టం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పనిచేసిన సదరు ఐఎఎస్ అధికారిణికి డబ్బుసంపాదించాలనే ఆశయం తప్ప నైతిక విలువలు లేవని ఆరోపణలు చేశారు. ఆమె శాఖకు సంబంధించిన మంత్రులను సైతం ఆమె >>2

## తిరుపతి నుంచి భూమనను తరిమి కొట్టండి

### శ్రీవారి ధనం కోట్లు దోచేశాడు

### దేవలోక్ స్థలాన్ని వెనక్కి తీసుకుంటాం

### టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఘాటు వ్యాఖ్యలు



**తిరుపతి, ఆగస్టు 26 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడటానికి అంకిత భావంతో, చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, టిటిడిపై దుష్ప్రచారం, బురదజల్లడమే పనిగా పెట్టుకున్న వైఎస్సార్సీ నేత, టిటిడి మాజీచైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని తిరుపతి నుండి తరిమికొట్టాలని టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో టిటిడి చైర్మన్‌గా పని చేసిన భూమన కోట్లాదిరూపాయలు టిటిడి ధనాన్ని దోచేశాడని, పలురకాలుగాకమీషన్లు నొక్కేశారని ఘాటైన వ్యాఖ్యలుచేశారు. ఆధ్యాత్మిక నమూనాల నిర్మాణాలకోసం అలిపిరివద్ద దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించా >>2

## చెవిరెడ్డికి బెయిలు ఇవ్వొద్దు

### కౌంటరు దాఖలు చేసిన సిట్

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణంలో వైఎస్సార్సీనేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి కీలక సూత్రధారిఅని, అతనికి బెయిలు ఇవ్వొద్దని సిట్ పేర్కొంది. మధ్యంతర, రెగ్యులర్ బెయిళ్ల కోసం చెవిరెడ్డి దాఖలు >>2

## లిక్కర్ కుంభకోణం: 12 మంది నిందితులకు రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, ఆగస్టు 26.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో 12 మంది నిందితులకు సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. ఈ మేరకు ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. రిమాండ్ పొడిగించిన నేపథ్యంలో 12 మంది నిందితులను వివిధ జైళ్లకు పోలీసులు తరలిస్తున్నారు. ఈ కేసులో వైసీపీ ఎంపీ పి. మిథున్ రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు. మిగిలిన 9 మంది నిందితులను విజయవాడ జైలుకు పంపించారుఇమరో ఇద్దరు నిందితులను గుంటూరు జైలుకు పోలీసులు తరలించారు. ఇక ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు రాజ్ కసిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తనపై నమోదైన కేసును ఆయన ఖండించారు. కస్టోడియల్ విచారణ అని సిట్ తనను అరెస్ట్ >>2

27-08pg2exHMNWJQE 2nd_27-08pg2exHMNWJQE.qxd 8/27/2025 12:05 AM Page 1





మంగళవారం గుజరాత్‌లోని హన్సాల్‌పూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ప్రధాని మోడీ

# ఐఎఎస్ అధికారిణి హస్తం

>> కనీసం లెక్కచేయలేదని, క్రింది స్థాయి అధికారుల పట్ల తాటకిలా వ్యవహరించారని తీవ్ర విమర్శలు గుప్పించారు. తిరుపతిలో మాస్టర్‌ప్లాన్ రోడ్లు వేస్తున్న సమయంలో టిడిఆర్ బాండ్ల ద్వారా భారీగా దోచుకోవాలని ఆమె ప్రణాళిక వేశారని, అయితే తాము దానిని అడ్డుకున్నామని భూమన వెల్లడించారు. ఈ విషయం తట్టుకోలేక సదరు అధికారిణి నెల్లూరు జిల్లా నేతలకు తప్పుడు సమాచారం అందించి, తాను 2వేల కోట్లు దోచుకున్నాననంటూ అబద్ధపు ప్రచారం చేయించారని భూమన గద్గద స్వరంతో ఆరోపించారు. తాను ఒక్కరూపాయి అవినీతికి పాల్పడినట్లు నిరూపించినా ఎలాంటి శిక్షకైనా సిద్ధమని ఆయన సవాల్‌విసిరారు. ఆమె 35ఏళ్ల సర్వీసులో ఎక్కడ పనిచేసినా వందల, వేలకోట్లు రూపాయలు లూటీ చేశారని, ఆమె అవినీతి గురించి సుప్రీం కోర్టుకు కూడా తెలుసని భూమన వ్యాఖ్యానించడం సంచలనంగా మారింది. ఆ ఐఎఎస్ అధికారిణి రోజూ ధరించే చీర 1.50లక్షలు రూపాయలు విలువ చేస్తుందని, వేలరూపాయలు విలువచేసే 11విగ్గులు ఆమె వద్ద ఉన్నాయని వ్యక్తిగత ఆరోపణలు చేశారు. నీతిగా నిజాయితీగా ఉన్న తనపై కక్షగట్టి కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో 21 మాస్టర్‌ప్లాన్ రోడ్లువేసి అభివృద్ధిచేశామనేది సత్యమని కరుణాకర్‌రెడ్డి గుర్తుచేశారు.

**బిజెపి భాను ఖండన:**

కాగా భూమన వ్యాఖ్యలను టిటిడి బోర్డుసభ్యుడు, బిజెపిరాష్ట్ర అధికారప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి ఖండించారు. మహిళ ఐఎఎస్ అధికారిణిని విమర్శిస్తూ కరుణాకర్‌రెడ్డి వీడియో విడుదల చేయడం దారుణమన్నారు. టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో ఆమె పాత్ర ఉందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. కరుణాకర్‌రెడ్డి రాజకీయ నిరుద్యోగిగా మారారని, ఆయన ఎన్నికల్లో ఓటమిపాలైన తరువాత మానసిక పరిస్థితి సరిగా లేనట్లుందని ఘాటుగా వ్యాఖ్యనించారు. ఆమెపై ఆయన అనుచిత పదజాలంతో విరుచుకుపడటం భాను తీవ్రంగా తప్పుపట్టారు.

# భూమనను తరిమి కొట్టండి

>> రని, తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ఒబేరాయ్ హోటల్‌కు స్థలాన్ని కేటాయించింది గత వైఎస్సార్సీనే అని విమర్శించారు. ముంతాజ్‌హోటల్ వ్యవహారంపై భూమన చేసిన వ్యాఖ్యలపై మంగళవారం సాయంత్రం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాట్లాడుతూ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుపతిలో ఉండే అర్హత లేదని, ఆయన్ను తిరుపతి నుండి తరిమికొట్టాలన్నారు. ప్రతిరోజూ టిటిడిపై బురదజల్లడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. టిటిడిపై బుదరజల్లితే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. ఆధ్యాత్మిక నమూనాల నిర్మాణాల కోసమే దేవలోక్‌కు స్థలాన్ని కేటాయించారన్నారు. 2024 నవంబర్ 18న టిటిడి బోర్డు సమావేశంలో ఒబేరాయ్‌కు కేటాయించిన స్థలాన్ని వెనక్కుతీసుకోవాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఛైర్మన్ తెలిపారు. భూమికి బదులు భూమి ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఒబేరాయ్ హోటల్‌కు ప్రస్తుతం అలిపిరి జూపార్కురోడ్డులో దక్షిణవైపు స్థలాన్ని కేటాయించామని తెలిపారు. ఉత్తరదిక్కున వద్దని సిఎం చెప్పడమేగాక ఆధ్యాత్మికపుణ్యక్షేత్ర పవిత్రతను కాపాడేందుకు చూస్తున్నామన్నారు. ఈ విషయంలో భూమన ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నాడని ఆరోపించారు. సిబిఐ విచారణ అని చెప్పడానికి భూమనకు సిగ్గులేదన్నారు. కోట్లురూపాయలు టిటిడి ధనాన్ని నొక్కేసిన ఘనుడు భూమన అని ఆరోపించారు.దేవలోక్ నిర్మాణం కోసం స్థలాన్ని లీజుకు తీసుకున్న అజయ్‌కుమార్‌ను జగన్ తాడేపల్లికి పిలిపించి గన్‌పెట్టి బెదిరించారని మరో సంచలన వ్యాఖ్యలు చేశారు. దేవలోక్‌కు కేటాయించిన 10 ఎకరాల స్థలాన్నివెనక్కు తీసుకుంటామన్నారు. తిరుమల పవిత్రతకు ఎక్కడా భంగం వాటిల్లకుండా కూటమి ప్రభుత్వం, టిటిడి ధర్మకర్తలమండలి చూస్తుందన్నారు. తిరుమలలో ముంతాజ్ హోటల్ నిర్మాణం సరైంది కాదని సిఎం చంద్రబాబు తెలిపారన్నారు. గత ఏడాదిలో టిటిడిలో అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నామన్నారు.

# సకాలంలో రైతు రుణాలు

>> సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లూ తమ తీరు మార్చుకోవాల్సి ఉంది. జిఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చింది. నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు వచ్చేస్తున్నాయి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించకూడదు. తదుపరి సంస్కరణల దిశగా ప్రోత్సహించాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణల దిశగా ఆలోచనలు చేయాలి. 2047 నాటికి బలమైన ఆర్థిక వ్యవస్థగా భారత్ తయారవుతుంది. ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరు, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. పేదలు ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలనూ చేపట్టాలి.ఆర్థికశాస్త్రం చదివిన విద్యార్థిగా, ప్రజాప్రతినిధిగా పేదల గురించి నేను ఆలోచన చేస్తున్నాను. ఖరీఫ్‌లో ఇప్పటికే సగం గడిచిపోయింది. రోటీన్ సమావేశాలవల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, ఇండికేటర్లు కూడా రోటీన్‌గా మారుతున్నాయని సిఎం వ్యాఖ్యానించారు. వ్యవసాయం స్థానంలో హార్టికల్చర్ సాగు వస్తుందని దీన్ని దృష్టిలో పెట్టుకుని బ్యాంకులు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలని సిఎం అన్నారు. అలాగే ఆర్థికంగా బలోపేతానికి తోడ్పడే వాణిజ్య పంటల్ని సాగుచేసే రైతులకు సాయపడాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న రైతులకు బ్యాంకుకు వచ్చిన 15 నిమిషాల్లోనే రుణం ఇచ్చే పరిస్థితి రావాలన్నారు. కొన్ని సందర్భాల్లో సరైన మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర రాక పంటలు పారబోసే పరిస్థితి వస్తోందని దీన్ని నివారించేందుకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

**ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త**

ఆత్మహత్యల నివారణకు అవసరమైన మార్గాన్ని అన్వేషిస్తున్నామని సీఎం అన్నారు. చనిపోయిన తర్వాత ఇచ్చే పరిహారం కంటే ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం, బ్యాంకర్లు ఏం చేయాలనే దానిపై ప్రత్యేకంగా మేధోమథనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఎస్ఎంఇలకు రుణాలను కేంద్రం సరళతరం చేసిందని, బ్యాంకులు ఈ విషయంలో మరింత చొరవ చూపాలని సీఎం అన్నారు. ఒక కుటుంబం, ఒక పారిశ్రామికవేత్త అనే లక్ష్యంతో పని చేస్తున్నామని ఇది సాకారం కావాలంటే చిరు వ్యాపారులకు రుణాలు సులభతరం కావాలన్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌లో రూ. 1,80,540 కోట్ల రుణ లక్ష్యానికిగానూ జూన్ నాటికి రూ. 94,666 కోట్ల మేర బ్యాంకులు రుణాలను ఇచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ. 985 కోట్ల రుణాల్ని మంజూరు చేశాయి. ఎంఎస్ఎంఈ రంగానికి రూ. 49,831 కోట్లు, విద్యారంగానికి రూ. 252 కోట్లు, హౌసింగ్‌కు రూ. 1,146 కోట్ల రుణాలు మంజూరు చేశాయి. పునరుద్పాదక ఇంధన రంగానికి రూ. 125 కోట్ల మేర రుణ మంజూరు చేశారు. స్వయం సహాయ సంఘాలకు రూ. 5,937 కోట్లు, ముద్రా రుణాల కింద రూ. 3189 కోట్లు బ్యాంకులు మంజూరు చేశాయి. పిఎం సూర్యఘర్ పథకం కింద ఈ ఏడాది 20 లక్షల కుటుంబాలకు సోలార్ విద్యుత్ అందించాలని లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు. ఈ పథకం అమల్లో బ్యాంకులు కూడా భాగస్వామ్యం కావాలనికోరారు. రాష్ట్రంలో పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు రానున్నాయని వాటికి బ్యాంకులు రుణాలు ఇచ్చి సహకరించాలని సిఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎస్ కే.విజయానంద్, ఎస్ఎల్ బిసి ఛైర్మన్ నితీష్ రంజన్, కేంద్ర ఆర్థిక విభాగం, ఆర్బీఐ, నాబార్డు, సిడ్బీ, ఎగ్జిమ్ బ్యాంక్ ఇతర బ్యాంకుల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిందితులకు రిమాండ్ పొడిగింపు

>> చేసిందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో తన పాత్ర ఎక్కడా లేదని పేర్కొన్నారు. తనతప్పు ఎక్కడా లేకపోయినా.. ఆధారాలు సృష్టిం చారని రాజ్ కసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కానీ.. ప్రస్తుతం కానీ ఇప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా లేదని గుర్తుచేశారు. ఈ ఒక్క లిక్కర్ కేసులో తప్పించి.. ఇప్పటి వరకు తాను అరెస్ట్ కాలేదన్నారు. అయితే హైదరాబాద్, శంషాబాద్‌లోని విల్లాలో లభ్యమైన రూ. కోట్లు తనవైతే.. వాటిపై తన వేలిముద్రలు ఉంటాయని వివరించారు. అయినాఅంత సొమ్ము ఒకేవ్యక్తి వద్ద ఉంటుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. ఈ మద్యం కుంభకోణంలో సిట్ విచారించిన 300 మందిలో ఏ ఒక్కరూ తనకు తెలియదన్నారు. ఈ300 మందిలో ఒక ఐదుగురిని విచారించి.. వారికి తాను తెలుసేమో మీరే అడగండని తెలిపారు. ఈ కేసులో చాలామంది పేర్లు తాను తొలిసారిగా వింటునానని రాజ్ కసిరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణంలో కీలక ఆధారాలు లభ్యం కావడంతో.. ప్రధాన నిందితుల్లో ఒకరైన రాజ్ కసిరెడ్డి ఆస్తుల జప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. మద్యం విక్రయాలతో వచ్చిన ఆదాయంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భారీగా భూములను రాజ్ కసిరెడ్డి కొనుగోలు చేసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వాటిని సైతం జప్తు చేసేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది.

## లిక్కర్ స్కాం కేసులో నిందితుల డిఫాల్ట్ బెయిల్ పిటిషన్!

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. డిఫాల్ట్ బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాలని నిందితులు నిర్ణయించారు. 90 రోజుల జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ రోజు ఏ33 బాలాజీ గోవిందప్ప డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ వేయనున్నారు.

**నిందితుల జ్యుడీషియల్ కస్టడీ :** ఏ1 రాజ్ కేసిరెడ్డి 126 రోజులు, ఏ6 సజ్జల శ్రీధర్ రెడ్డి 123 రోజులు, ఏ8 చాణక్య 125 రోజులు, ఏ30 దిలీప్ 117 రోజులు, ఏ31 ధనుంజయ రెడ్డి 102 రోజులు, ఏ32 కృష్ణ మోహన్ రెడ్డి 102 రోజులు, ఏ33 బాలాజీ గోవిందప్ప 105 రోజులు దాటింది.



మంగళవారం లక్నోలో విపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డితో ఎస్పీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్

# ఐఎన్ఎస్ ఉదయగిరి,హిమగిరి

>> బద్ధాయి అని, ఇది స్వదేశీ కంటెంట్ స్వావలంబనను పెంచడానికి నేవీ యొక్క నిరంతర కృషిని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కన్న ఆత్మనిర్భర్ భారత్ కల సాకారం వైపు ఒక పెద్ద ముందడుగు అని చెప్పారు. ప్రభుత్వ దార్శనికత నిబద్ధతకు నిదర్శనంగా రక్షణ మంత్రి అభివర్ణించారు. "ఐఎన్ఎస్ ఉదయగిరి ఐఎన్ఎస్ హిమగిరి ప్రభుత్వ స్వావలంబనపట్ల దృఢసంకల్పానికి ప్రకాశవంత మైనదిగా అభివర్ణించారు. బ్లూ వాటర్ నేవీ మల్టీమిషన్ ఫ్రిగేట్‌లు కీలకమైనకార్యాచరణ సహాయకులు, ఇవి సముద్ర కార్యకలాపాల యొక్క పూర్తి స్పెక్ట్రంలో జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే నావికాదళ సామర్థ్యాన్ని పెంచుతాయి.

## మట్టి గణపతినే పూజించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** గణేశ్ చతుర్థిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పర్యావరణ హితంగా పండుగ జరిగేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. అందులో భాగంగా ప్రత్యేక సందేశాలతో రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసిబి సభ్య కార్యదర్శి శరవణన్, ఛైర్మన్ డా.పి. క్రిష్ణయ్య పాల్గొన్నారు. సందర్భంగా మట్టి గణపతినీ, ఇంటి పెరట్లోనే నిమజ్జనం చేసుకునేలా విత్తన గణపతిని ప్రోత్సహించాలని ఎ తయారు చేసిన విగ్రహాలలో జిప్సమ్, గంధకం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి రసాయనాలు ఉంటాయి. అవి నీటిలో కలిసి జలాశయాలను పెద్ద ఎత్తున కలుషితం చేయడంతో పాటు జల చరాలకు ముప్పును కలగజేస్తాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించి పర్యావరణానికి హాని కలగకుండా చూడాలని సిఎం కోరారు.

అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కూడా పర్యావరణానికి మేలుజరిగేలా గణేశ్ వేడుకలు జరగాలని ఆకాంక్షి.. రాష్ట్రంలోని అన్ని జోనల్, రీజనల్ కార్యాలయాలకు దాదాపు నలభై లక్షల రూపాయల నిధులుకేటాయించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నియమనిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం జరిగేలా అన్ని జిల్లాల కలెక్టరేట్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ రంగులతో తయారు చేసే విగ్రహాలతో భారీగా జరిగే నష్టాన్ని నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా అధికారులతో కలిసి కాలుష్య నియంత్రణ మండలి విజయవాడ ఇందిరా గాంధీమున్సిపల్ స్టేడియంలో ఒకేసారి ఏడున్నర వేల మట్టి గణపతుల్ని తయారు చేయిం చింది. అందుకు గానూ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డునూ సంయుక్తంగా అందుకుంది.

# మరో రెండు రోజులు వర్షసూచన

>> ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్ళారాదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న రెండు రోజులు వాతావరణం క్రింది విధంగా ఉండనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. ఈ నెల 27న అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నాటికి సాలపువానిపాలెంలో 60.2మిమీ, శ్రీకాకుళంలో 58మిమీ, విశాఖ జిల్లా నాతయ్యపాలెంలో 55.7మిమీ అనకాపల్లి జిల్లా గంధవరంలో 55.5మిమీ, లంకేలపాలెంలో 55.2మిమీ, విజయనగరం అర్బన్ 54.7మిమీ చొప్పున వర్షపాతం, 65 ప్రాంతాల్లో 40మిమీకు పైగా వర్షపాతం నమోదైందన్నారు.

# సస్పెన్షన్ పొడిగింపు

>> సస్పెన్షన్ గడువు ముగియనుండటంతో రివ్యూ కమిటీ సమీక్ష నిర్వహించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంపై సునీల్‌కుమార్‌పై ఎసిబి విచారణ కొనసాగుతోంది. మరోవైపు గతంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వేధించిన కేసులోనూ గుంటూరు నగరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్ష్యాధారాలు, దర్యాప్తును ప్రభావితం చేస్తారని రివ్యూకమిటీ నివేదించింది. దర్యాప్తుకీలక దశలో ఉన్నందున సస్పెన్షన్‌పొడిగించాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డిజిపి ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సస్పెన్షన్ ఆదేశాలను పొడిగిస్తూ సిఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

# మరో 4 పోర్టులు

>> ప్రతిపాదనను ప్రభుత్వం అనుమతిస్తే గడువు పొడిగించే అవకాశం ఉంది. మొదటి దశలో 4 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ప్రస్తుతం 1 పూర్తయింది. 3.7 కిలో మీటర్ల దక్షిణ, 1.35 కిలో మీటర్ల మేర ఉత్తర బ్రేక్ వాటర్ పనులు కొనసాగుతున్నాయి. విబీ16తో ఉమ్మడి ప్రకాశం జిల్లా చేవూరు జంక్షన్ దగ్గర అనుసంధానం చేస్తారు.

**మచిలీపట్నం పోర్టు**

2026నవంబరునాటికి మచిలీపట్నం పోర్టును పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. ప్రస్తుతం 45.5 మేర పనులు పూర్తయ్యాయి. మొదటి దశలో 4 బెర్తులు 16 బెర్తులకు విస్తరించనున్నారు. ఈ పోర్టు ద్వారా ఏడాదికి 36 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయవచ్చు. తెలంగాణలో డ్రైపోర్టును ఏర్పాటు చేసి అక్కడినుంచి మచిలీపట్నానికి సరకు చేర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. బీచ్‌రోడ్డును 638 కోట్ల రూపాయలతో 6 లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేసి, ఎన్‌హెచ్ 65కు అనుసంధానం చేసే ప్రతిపాదన ఉంది.

**మూలపేట పోర్టు**

మూలపేట పోర్టు 54.01 నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. 2026 మే నాటికి ఈ పోర్టును వినియోగంలోకి తేనున్నారు. ఈ పోర్టును ఏడాదికి 25 నుంచి 30 మిలియన్ టన్నులు సరకు రవాణా లక్ష్యం. ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో డ్రై పోర్టులు నిర్మించి మూలపేట పోర్టుతో అనుసంధానం చేయనున్నారు.

# లిక్కరు కుంభకోణంలో దారి మళ్లించిన వివరాలు ఇవ్వండి: సిట్‌కు ఎసిబి కోర్టు ఆదేశం

విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో ముడుపుల ద్వారా కొల్లగొట్టిన రూ.3500 కోట్లను ఎలా దారిమళ్ళించారనే అంశంలో పూర్తి వివరాలు క్రమ జాబితాలో ఇవ్వాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానం సిట్‌ను ఆదేశించింది. ఫోరెన్సిక్ నివేదికలూ పొందుపర్చాలని నిర్దేశించింది. నిందితులజాబితాలోని సంస్థలకు సంబంధించిన ప్రతినిధులు, వారి హోదాల వివరాలన్నింటినీ సమగ్రంగా ఇవ్వాలని సూచించింది. ఈ కేసులో ఉలై 19న సిట్ దాఖలు చేసిన ప్రాథమిక అభియోగపత్రం లోని పలు అంశాలపై మరింత స్పష్టత,సమాచారం కోరుతూ,అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏసీబీ కోర్టు సిట్‌కు సోమవారం మెమో జారీ చేసింది. మొత్తం 21 అంశాలను అందులో ప్రస్తావించింది. మూడు రోజుల్లోగా ఈ వివరాలు సమర్పించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది.ఈ కేసులో 1988 నాటి అవినీతి నిరోధక చట్టం సెక్షన్‌లు ఎలా ప్రవర్తిస్తాయి? ఆ చట్టం లోని సెక్షన్ 19 ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం కాంపిటెంట్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ప్రధాన నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేయడం ఎలా అర్థమైంది?వీటిపై వివరణలు ఇవ్వండి?సీఆర్‌పీసీ 161,164 సెక్షన్ల క్రింద ఎంతమంది సాక్షుల్నివిచారించారు? ఆ జాబితా సమర్పించండి. దర్యాప్తు ఇంకా పెండింగ్‌లో ఉందని అభియోగపత్రంలో పేర్కొన్నారు. కానీ, ఇది ప్రాథమిక అభియోగపత్రమా,చివరిదా? అని ఎక్కడా పేర్కొనలేదు.ఆ సమాచామివ్వండి.ఈ కేసులో ముప్పిడి అవినాష్‌రెడ్డి(ఏ-7),బూనేటి చాణక్య (ఎ-8) టి.ఈశ్వర్ కిరణ్‌కుమార్‌రెడ్డి (ఏ-9),షేక్ సైఫ్ అహ్మద్(ఎ-10), ఓల్విక్ మల్టీవెంచర్స్(ఎ-11),క్రిపాట ఎంటర్‌ప్రైజెస్(ఎ-12),నైన్న మల్టీవెంచర్స్(ఎ-33),ట్రిఫ్సెర్ ఎంటర్‌ప్రైజెస్(ఎ-14),వికోస్ ఎంటర్‌ప్రైజెస్ (ఎ-15) వారి ప్రమేయం,పాత్రపై నిర్దిష్టమైన వివరాలు అభియోగపత్రంలో పొందుపర్చండి. వీరిలో కొందరు నిందితుల్ని ఎందుకు అరెస్ట్ చేయలోదే కారణాలు తెలియచేయండి.నిందితుల్లో ఎవరెవరికి ఏ సెక్షన్ వర్తిసు_ందో విడిగాఇవ్వండి.ఇప్పటివరకూ మొత్తం ఎంతమందినిందితులు అరెస్టయ్యారు. ఎవరెవరు ఎప్పటినుంచి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు? అనే సమాధానాన్ని సమర్పించండి.

# పర్యావరణ 'చవితి' జరుపుకొందాం

>> యాజర్ ప్రకటించారు. ఈ రికార్డు సాధనకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొని రికార్డు సాధించినందుకు సర్టిఫికెట్‌ను, పతకాన్ని కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు అందజేశారు.

మెగాఈవెంట్ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటినుంచే పర్యావరణంపట్ల బాధ్యతను గుర్తుచేసేందుకు ఈ కార్య క్రమం దోహదపడుతుందన్నారు. గణేష్ ఉత్స వాల్లో ప్రతి అంశానికీ ఓ ప్రత్యేకత ఉందన్నారు. ప్రజలు ఒకవైపు సంస్కృతి సంప్రదాయా లను కాపాడుకుంటూనే మరోవైపు పండగ లను పర్యావరణహితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మండపాల ఏర్పాటుకు ఉచితంగా అనుమతులతో పాటు ఉచితంగా కరెంటును రాష్ట్ర ప్రభుత్వం అందజేయడం జరుగుతోందని.. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. విజయవాడ అంటేనే వైబ్రెంట్ నగరమని.. చెత్త రహిత నగరం కేటగిరీలో నగరానికి సెవెన్ స్టార్ రేటింగ్ లభించిందని.. ప్రజా చైతన్యం, సమష్టి కృషివల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. పర్యావరణ, ఆధ్యాత్మిక శోభతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకుందామని.. మండపాల వద్ద స్వచ్ఛతకు ప్రాధన్యమివ్వాలని సూచించారు.

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇది పర్యావరణంపట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చే ఓ గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతిమల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు వంటి వాటి వినియోగం బాగా తగ్గిందన్నారు. వీటి వినియోగాన్ని జీరో చేయాల్సిన అవసరముందన్నారు. పర్యావరణ పరిరక్షణపట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాల్సిన అవసరముందని.. పర్యావరణ పరిరక్షణతో నగరాన్ని, రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు.

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ.... జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛతా లక్ష్యాలను చేరుకునేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని.. వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలను పూజించి ప్రకృతి శోభతో ఆధ్యాత్మిక వాతావరణంలో పండగను జరుపుకునేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సీడ్ గణేష్.. క్లే గణేష్ ప్రతిమలతో రికార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ.. వినాయక మండపాల ఏర్పాటుకు ఎలాంటి రుసుము లేకుండా అనుమతులు మంజూరు చేయడం జరుగుతోందని.. ఇందుకు ప్రత్యేక యాప్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. శబ్ద కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని పండగ జరుపుకోవాలని కోరారు.

# చెవిరెడ్డికి బెయిలు ఇవ్వొద్దు

>>చేసిన పిటీషన్లపై సోమవారం ఎసిబి కోర్టులో ఈ మేరకు కౌంటర్ దాఖలు చేసింది. ముడుపులకు సంబంధించి దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, ఈ దశలో నిందితుడికి బెయిలుఇస్తే ఆటంకంకలుగుతుందని అభ్యంతరంతెలిపింది. మధ్యంతర బెయిలు పై మంగళవారానికి, రెగ్యులర్ బెయిలుపై సెప్టెంబరు 2కు న్యాయాధికారి విచారణను వాయిదా వేశారు. వెన్ను నొప్పి తీవ్రతంగా ఉంది ప్రకృతి చికిత్సకోసంఅనుమతించాలని చెవిరెడ్డి మరో పిటీషన్‌ను దాఖలుచేశారు. మంగళవారం విచారణ నిర్వహించింది.రిమాండ్ పొడిగింపు కోసం చెవిరెడ్డిని కోర్టుకు తీసుకొచ్చి,తిరిగి తీసుకెళ్లే సమయాల్లో పోలీసులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని, వర్చువల్ విధానంలో హాజరుపర్చేందుకు అనుమతినివ్వాలని సిట్ అధికారులు మెమో దాఖలుచేశారు. దీనిపై ఆయన ఇబ్బందులకు గురిచేయరని చెవిరెడ్డి తరపున్యాయవాది కోర్టుకుఇచ్చిన హామీపత్రాన్ని న్యాయాధికారి పరిగణనలోకి తీసుకొని, సిట్ మెమోను తోసి పుచ్చారు. హైదరాబాద్‌లో సిట్‌అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11కోట్ల జమకు సంబంధించి నిందితుడు రాజ్ కెసిరెడ్డి పిటీషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 28వ తేదీకి వాయిదా పడింది.

## వారం - వర్జ్యం

27-08-2025, బుధవారం (వినాయక చవితి)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చవితి మ.3.47
హస్త ఉ.6.04
వర్జ్యం : మ.2.57-4.44
దు.ఉ.11.45-12.35
శుభసమయం: ఉ.9.15-10.00,సా.4.45-5.30
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలుఎదురైనా అధిగమిస్తారు. శుభవార్తలు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది. వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:**కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. ఇంటాబయటా ప్రోత్సాహం.

**కర్కాటకం :**అనుకోని అతిథులనుండి శుభవార్తలు అందుకుంటారు. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

**సింహం:** ఒకరికి అప్పు ఇవ్వడం, మీరు మీరొకరి వద్ద అప్పుచేయడం రెండూ వద్దు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**తుల :**వస్తు భద్రత పట్ల విశేషమైన జాగ్రత్తలు తీసుకోవడం చెప్పదగిన సూచన.

**వృశ్చికం:** ఇంటర్వ్యూలలో అతి కష్టంమీద ఉత్తీర్ణులవుతారు. వస్తువులు కొనుగోలు.

**ధనుస్సు:** నాణ్యత లేని వస్తువులు మీకు అంటగట్టే ప్రయత్నాలు జరుగుతాయి. జాగ్రత్త అవసరం.

**మకరం:** అనేకాంశాలలో అనుభవం మిమ్ములను ముందుకు నడుపుతుంది.

**కుంభం:** సంతాన పురోభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. ఒకరికి మీరు సహాయంచేస్తారు.

**మీనం :** కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ప్రయాణాలు లాభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## వారం - వర్జ్యం

28-08-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
పంచమి సా.5.58
చిత్త ఉ.8.44
వర్జ్యం : మ.3.00-4.48
దు.ఉ.10.05-10.55, 2) మ.3.05-3.55
శుభసమయం : ఉ.8.15-9.00,
సా.4.15-4.55
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** దూరపుబంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**వృషభం:** ఆర్థికపరిస్థితి సంతృప్తి కరంగా ఉంటుంది. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి.

**మిథునం:**జీవితభాగస్వామి సలహాలతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** స్థలాలు, భూములు కొనుగోలు వ్యవహారాలు పురోభివృద్ధిలో ఉంటాయి.

**సింహం:**అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. వస్త్రాలు కొనుగోలు.

**కన్య :** కార్యాలయంలో పై అధికారులకు వివరణ ఇచ్చుకోవలసి వస్తుంది.

**తుల :** మీ వైరివర్గం మిమ్ములను బాధించకపోవడం ఊరట కలిగిస్తుంది.

**వృశ్చికం:** పుకారులకు ప్రాధాన్యత నివ్వడం వలన నిజానిజాలు తెలుసు కోవడంలో వైఫల్యంచెందుతారు.

**ధనుస్సు:** ముఖ్యమైన పనులు వాయిదా వేసుకొని సులువుగా జరిగే కార్యక్రమాలను మాత్రమే చేయండి.

**మకరం:** కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలు చేస్తారు. మిత్రుల కలయిక.

**కుంభం:**వృత్తి ఉద్యోగాలపరంగా అదనపు బాధ్యతలు నిర్వహించవలసి వస్తుంది.

**మీనం :** నమ్మి ఎవరికి పనిని అప్పగించవద్దు. మీ పనిని మీరే చేసుకోండి. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

27-08Pg3 GNT af_27-08Pg3 GNT.qxd 8/27/2025 12:45 AM Page 1



## నందమూరి బాలకృష్ణకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందన

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** చలనచిత్ర పరిశ్రమలో 50 ఏళ్ళ సుదీర్ఘ నట జీవితాన్ని పూర్తి చేసుకొని ,ప్రపంచ రికార్డును దక్కించుకున్న నందమూరి బాలకృష్ణకు ఏపీ డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అభినందనలు తెలిపారు ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ చేసిన పోస్టులో తెలుగు చలన చిత్ర రంగం లోనికి స్వర్గీయ నందమూరి తారక రామారావు నట వారసుడిగా అడుగుపెట్టి జానపదాలు,కుటుంబ కుటుంబ కథా చిత్రాలు,యాక్షన్ చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ,చనట జీవితంలో 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణం పూర్తి చేసుకున్న తరుణంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో చోటు సాధించిన ప్రముఖ నటులు,హిందూపురం ఎంఎల్ఏ పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను. ఆయన మరిన్ని సంవత్సరాలు తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ ప్రజాసేవలో క ఒనసాగాలని ఆకాంక్షిస్తున్నాను' అని పేర్కొన్నారు.

## మంత్రి లోకేష్ చొరవతో గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్త ప్రతినిధి:** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గణేష్ ఉత్సవ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వినాయక చవితి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో పందిళ్ళకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలువురు నిర్వాహకులు మంత్రి నారా లోకేష్‌ను కోరారు. దీనిపై స్పందించిన లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గణేష్ ఉత్సవ పందిళ్ళకు ఉచిత విద్యుత్ అందించడానికి రూ.25 కోట్లు ప్రభుత్వం భరించాల్సి ఉంది. రాష్ట్రంలో కోట్లాది గణేష్ భక్తుల సౌలభ్యం దృష్ట్యా ఉచిత విద్యుత్ అందించేలా అలాగే రాబోయే విజయదశమి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే దుర్గాదేవి మండపాలకు కూడ ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.



## మూడేళ్ల క్రితం వచ్చి పదవుల కోసం ఆరాటమా?

### మేం 30 యేళ్లుగా పార్టీలో ప్రశాంతంగా ఉన్నాం

### సెప్టెంబర్6న అనంతలో సూపర్‌సిక్స్ సభను విజయవంతం చేస్తాం

### మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

**అనంతపురం, ఆగస్టు 26, (ప్రభాతవార్త బ్యూరో)** టిడిపి జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటు ప్రభుత్వాన్ని, అటు తెలుగుదేశం పార్టీని నడిపే విషయంలో నిరంతరం కష్టవడుతున్నారు. మంత్రి అమరనాథ్ రెడ్డి, తన తో పాటు చాల మంది ముప్పై ఏళ్ళు పార్టీలో ఉన్నా ప్రశాంతంగా పార్టీలో ఉన్నాం. మూడేళ్ల కిందట పార్టీలోకి వచ్చిన వాళ్ళు పదవుల కోసం ఆరాట పడుతున్నారు అని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ అభిప్రాయపడ్డారు. పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు నిరంతరం పనిచేస్తే పార్టీలో తప్పక గుర్తింపు వస్తుందని ఆయన వెల్లడించారు. అనంతపురంలోని బళ్లారి బైపాస్ వద్ద గల ఎం వై ఆర్ ఫంక్షన్ హాల్ లో అనంతపురం పార్లమెంట్ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. పార్లమెంట్ పార్టీ కమిటీల ఏర్పాటు కోసం నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులైన మంత్రి డోలా వీరాంజనేయ స్వామి , ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి , శాప్ చైర్మన్ అని మిని రవి నాయుడు తో మంత్రి పయ్యావుల కేశవ్ తోపాటు అనంత పురం పార్ల మెంట్ ఎంపీ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా నాయకులు తది తరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ కార్యకర్తలను ఉద్దే శించి మాట్లా డుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిం చేందుకు సీఎం చంద్రబాబు అహర్ని శలు శ్రమిస్తున్నారని, భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ కూడా విజయవంతం అయ్యేందుకు ఆలోచన చేస్తున్నారని,. మూడేళ్ళలో అనంతపురం జిల్లా జిల్లా రూపు రేఖలు మారనున్నాయి అన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేస్తాం.సూపర్ సిక్స్, సూపర్ హిట్ పేరుతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనంత లో సభ జరగనుంది.వచ్చే నెల 6న జరిగే సభను అందరూ విజయవంతం చేయాలని మంత్రి పయ్యావుల కేశవ్ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. కడప లో మహానాడు ఘనంగా నిర్వహించాం. అనంత లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమం నిర్వహించాలని సీఎం చెప్పారు అని,అందరూ పాల్గొని విజయవంతం చేద్దాం ఆయన పిలుపునిచ్చారు. సభలోమంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అందరం కలిసి ఏకాభిప్రాయం తో ముందుకి వెళదాం..పార్టీ లో సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ వినూత్న మార్పులు తీసుకువచ్చారు అని ఆయన వెల్లడించారు. గతం లో లేని విధంగా కష్టపడి పనిచేసిన వారికి మరిన్ని పదవులు రాబోతున్నాయి ఆయన అభిప్రాయపడ్డారు.కడప లో మహానాడు సక్సెస్ అయింది.పక్కనే ఉన్న అనంతపురం లో అంతకు రెట్టించిన ఉత్సాహంతో సెప్టెంబర్ 6న అనంతపురంలో జరిగే సభ ను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు గతం లో కంటే మిన్నగా చేస్తున్నాం. వచ్చే నెల 5న డీఎస్ సీ అభ్యర్థులు ఉద్యోగం లో చేరుతున్నారు. అనంతపురం ను రాష్ట్రంలో నెంబర్ 1 ఆదాయం వచ్చే రాష్ట్రం గా తీర్చిదిద్దుదాం అని ఆయన వెల్లడించారు.



## పర్యావరణ హితవు మట్టి ప్రతిమలు

రేపల్లె(నిజాంపట్నం), ఆగష్టు 26, ప్రభాతవార్తః పర్యావరణానికి హానికలగనివ్వని వినాయకుని ప్రతిమలు ఏరా ్పటు చేసి పూజించి నిమజ్జనం చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితిని ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ , రసాయనిక రంగులతో చేసిన వినాయకుని ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయటం వల్ల నీరు, గాలి కలుషితం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెదెపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముదురునారు వేసేటప్పుడు కొసలు తుంచి నాటువేయాలి

నిజాంపట్నం, ఆగష్టు 26, ప్రభాతవార్త ః ముదురు నారు నాటు వేసే రైతులు కొసలు తుంచి నాటు వేస్తే కాండం తొలుచు పురుగును నివారించవచ్చని మండల ఎఓ విజయరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని బావాజీపాలెం, ఆముదాలపల్లిలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు.

### స్వామిత్ర సర్వేపై సమీక్ష

నిజాంపట్నం, ఆగష్టు 26, ప్రభాతవార్తః స్వామిత్ర సర్వేను నిబంధ నలకు అనుగుణ ంగా నిర్వహిం చాలని డిఎల్‌డిఓ ఎన్ పద్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కారా ్యలయంలో మండలంలోని పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిఎలతో సమీక్ష నిర్వహించారు. ఎవరూ నిబంధనలు అతిక్రమించరాద న్నారు. అనుమా నాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపిడిఓ నాగలక్ష్మీ, ఇఒపిఆర్‌డి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


కెనరా బ్యాంక్ Canara Bank
Syndicate
ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 8331011695, ఇ-మెయిల్ : armvij@canarabank.com

**ఋణగ్రహీత / హామీదారు / తనఖాదారులకు సెక్షన్ 13 (8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు :
**ఋణగ్రహీత/హామీదారులు/తనఖాదారు పేరు & చిరునామా:** మెస్సర్స్ రవీంద్ర కాటన్ ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : మానం రవీంద్రనాథ్, డి.నెం.73/1, ఎస్‌కెఆర్ ఎస్టేట్, ఏటుకూరు రోడ్డు, గుంటూరు - 522003. **శ్రీమతి మానం శివ కుమారి,** భర్త : ఎమ్. రవీంద్రనాథ్, డి.నెం. 4-3-16, 1వ లైన్, రామన్నపేట, గుంటూరు - 522007. **శ్రీ ఎమ్. రవీంద్రనాథ్,** ఇ.నెం.4-3-16, 1వ లైన్, రామన్నపేట, గుంటూరు - 522007, ఆంధ్రప్రదేశ్. **శ్రీ ఆలపాటి ధనుంజయ శివ రాంబాబు,** తండ్రి : ఎ. సాంబశివరావు, డి.నెం. 1-34-258, 3వ లైన్, సత్యనారాయణపురం, పట్టాభిపురం, గుంటూరు. **శ్రీమతి ఎమ్. సునీత,** భర్త : భద్రయ్య (లేటు ఎమ్. హైమావతి గారి చట్టరీత్యా వారసులు), డి.నెం. 4-3-16, 1వ లైన్, రామన్నపేట, గుంటూరు - 522007. **శ్రీ ఎమ్. రవీంద్రనాథ్** (లేటు ఎమ్. హైమావతి గారి లీగల్ వారసులు), ఇ.నెం.4-3-16, 1వ లైన్, రామన్నపేట, గుంటూరు - 522007, ఆంధ్రప్రదేశ్.

**విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం" గా రిఫర్ చేయబడును).**

**కెనరా బ్యాంక్, ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు **(ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్"గా రిఫర్ చేయబడును),** సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "ది యాక్ట్" గా రిఫర్ చేయబడును) లోని రూల్ 8 (6) తో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

**ఋణగ్రహీత/ సంస్థ మెస్సర్స్ రవీంద్ర కాటన్ ట్రేడర్స్, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు)** వారిని బకాయి **రూ.8,75,08,398/-** (అక్షరాల ఎనిమిది కోట్ల డెబ్బై ఐదు లక్షల ఎనిమిది వేల మూడు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే) + వడ్డీతో కలిపి **మెస్సర్స్ రవీంద్ర కాటన్ ట్రేడర్స్** వారి లోను ఖాతా యొక్క బకాయి నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **చట్టంలోని సెక్షన్ 13 (2) క్రింద 01.10.2022 తేదీన మీకు డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో **ఋణగ్రహీతలు/ సంస్థ, తనఖాదారు మరియు హామీదారులు (పైన తెలిపిన పేర్లు)** విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది.16.12.2022న** మీ సెక్యూర్డ్ ఆస్తులను సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద **లాంఛనాత్మక/భౌతికంగా స్వాధీనం తీసుకున్నారు** మరియు చట్ట ప్రకారం సదరు లాంఛనాత్మక/భౌతిక స్వాధీనత నోటీసును రెండు స్థానిక వార్తా పత్రికలు అనగా ఈనాడు (తెలుగు) & న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీషు)లలో **తేది.18.12.2022న** ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు **తేది.19.08.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.13,24,13,287.66** పై (అక్షరాల పదమూడు కోట్ల ఇరవై నాలుగు లక్షల పదమూడు వేల రెండు వందల ఎనభై ఏడు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే) + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు సర్ఫేసీ చట్టం, 2002 నందలి రూల్ 8(6) క్రింద ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారి నుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా (సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

**తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు**

**ఆస్తి నెం.1: ఐటమ్-1:** గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, ప్రస్తుతం కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో, 1వ లైన్, రామన్నపేట, మున్సిపల్ పాత వార్డు నెం.1, ప్రస్తుత వార్డు నెం.10, బ్లాక్ నెం.8, టి.ఎస్.నెం.511, అసెస్మెంట్ నెం.6305-1, డోర్ నెం.4-3-16 లోని 144 చ॥గ॥ల విస్తీర్ణం గల స్థలం మరియు అందు గల ఆర్‌సిసి డాబా ఇల్లు. **హద్దులు: తూర్పు:** చదలవాడ లక్ష్మమ్మ గారి ఆస్తి - 5 అ॥లు, **దక్షిణం :** 1వ లైన్ రామన్నపేట మున్సిపల్ రోడ్డు - 24 అ॥లు, **పడమర :** మాన్నే గోపాలరావు గారి ఆస్తి - 54 అ॥లు, **ఉత్తరం :** మానం నాగేశ్వరరావు గారు అమ్మిన ఇతరులకు చెందిన ఆస్తి - 24 అ॥లు.,

**ఐటమ్-2:** గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధిలో, కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, పాత వార్డు నెం.1, కొత్త వార్డు నెం.2, బ్లాక్ నెం.3, యు.ఎల్.సి. వార్డు నెం.1 ప్రకారం గల టి.ఎస్.నెం.511, బ్లాక్ నెం.8, టి.ఎస్.నెం.509 లోని 56 చ॥గ॥లు విస్తీర్ణం గల స్థలం. **హద్దులు: తూర్పు:** కోటంరాజు విజయ బాబు గారి ఇల్లు- 18.0 అ॥లు, **దక్షిణం :** మున్సిపల్ రోడ్డు - 3.1 అ॥లు, **పడమర :** మానం రవీంద్రనాథ్ గారి ఇల్లు - 18 అ॥లు, **ఉత్తరం :** సల్లా తిరుపతమ్మ గారి ఆస్తి - 3.1 అ॥లు.,

**టైటిల్ హోల్డర్ : శ్రీ మానం రవీంద్రనాథ్, తండ్రి : మానం వెంకటేశ్వర్లు.**

**ఆస్తి నెం.2 :** గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, ఫిరంగిపురం సబ్ డిస్ట్రిక్ట్, మేడికొండూరు గ్రామం మరియు గ్రామ పంచాయితీ ఏరియా పరిధి, డి.నెం.351/బి లోని ఎ.3.27 సెంట్లు మొత్తం విస్తీర్ణంలో, ఎ.2.00 సెంట్లు విస్తీర్ణం గల వ్యవసాయేతర భూమి. **హద్దులు: తూర్పు:** వాగు, **దక్షిణం :** వెలగ రాజా రత్నం గారి భూమి **పడమర :** అడ్డగడ్డ పూర్ణ రామబ్రహ్మం మరియు ఇతరుల భూమి, **ఉత్తరం:** నిమ్మగడ్డ ఆనందరావు మరియు ఇతరుల భూమి.

**టైటిల్ హోల్డర్ : శ్రీమతి వెలగ శివ కుమారి, భర్త : ఎమ్. రవీంద్రనాథ్**

తేది : 20-08-2025, స్థలం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్


## 31న ఉత్తరాంధ్ర సాహితీ , సాంస్కృతిక వేడుకల్లో - డా.గజల్ శ్రీనివాస్ తెలుగు గజల్ గానం

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు విశాఖ సంగీత, నృత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు, అమరావతి లో నందమూరి తారక రామారావు వేదికపై జరుగనున్నట్లు ఆ పరిషత్ కార్యదర్శి రెడ్డప్ప ధవేజి, మహా సభల ముఖ్య సమన్వయ కర్త పి.రామచంద్ర రాజు, కార్యక్రమం సంచాలకులు కోడూరి సుశీల తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 3 వ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 సన్నాహాల్లో భాగంగా 'ఉత్తరాంధ్ర సాహితీ, సాంస్కృతిక వేడుకలు కళా భారతి' , విశాఖపట్నంలో 31 ఆగస్టు ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పంతుల రమ గారిచే శాస్త్రీయ సంగీతం, గురు సహస్రావధాని డా. కడిమిళ్ళ వరప్రసాద్ గారిచే అష్టావధానం, ఉత్తరాంధ్ర కవులచే కవి సమ్మేళనం జరుగుతుందని వివరించారు. జేజి నారాయణ గారిచే శ్రీ భక్త మార్కండేయ హరికథ, సందీప్ బృందం చే శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం, జానపద నృత్యాలు. సన్నిధి రాజ్ సాగి బృందం చే కూచిపూడి నృత్యాలు, కేవలం మహిళలు మాత్రమే ప్రదర్శించే విజయనగం విజయ సూర్య సంస్థ సమర్పణలో ' తన దాకా వస్తే' సాంఘిక లఘు నాటిక, శ్రీకాకుళం కళాకారులచే పౌరాణిక ఏక పాత్రభినయ ప్రదర్శనలు, వైజాగ్ బీట్స్ కరోకె గాయకులచే చలన చిత్ర గీతాలాపన , కళాకారులకు కవులకు సత్కారాలు డా.గజల్ శ్రీనివాస్ గారిచే తెలుగు గజల్ భక్తి గీతాల కార్యక్రమం ఉంటుంది.

## స్మార్ట్ రేషన్ కార్డుతో అక్రమాలకు చెక్ : మంత్రి నారాయణ

### సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం - రాష్ట్రంలో పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

**నెల్లూరు, ఆగష్టు 26, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరులో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి లక్ష ్యంగా కూటమి ప్రభుత్వం యుహాత్మకంగా ముందుకు అడుగులు వేస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 48వ డివిజన్ పొర్లుకట్ట వద్ద మంత్రి నారాయణ మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి స్వయంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు ముందుగా డివిజన్లకు విచ్చేసిన మంత్రి నారాయణ కు టిడిపి శ్రేణులతో పాటు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ మీడియాతో మాట్లాడుతూ సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆ దిశగా చంద్రబాబునాయుడు పాలనసాగుతోందన్నారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పేదలకు ఇచ్చే నిత్యావసర సరుకుల పంపణీలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశ పెట్టిందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల కుటుంబాలకు ఉచిత స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామన్నారు. ముందుగా తొమ్మిది జిల్లాలు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కృష్ణా, ఎన్టీఆర్, తిరుపతి, నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఇస్తున్నామని, త్వరలోనే మిగతా అన్ని జిల్లాల్లో కూడా స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలో 28 వార్డులలో, 69 రేషన్ షాపుల ద్వారా ప్రజలకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశముల ప్రకారం ఆగష్టు నెల 25వ తేది నుండి పాత రేషను కార్డులు స్థానంలోనే స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. 25 వ తేది నుండి 31 వరకు ఇంటింటికి స్మార్ట్ కార్డులు పంపిణీ జరుగుతుందని, సెప్టెంబర్ 1 వ తారీఖు తరువాత రేషన్ షాపుల వద్ద పంపిణీ చేస్తామని చెప్పారు. నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలో 63 వేల 419 కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులకు ఎటువంటి పైకం చెల్లించనవసరం లేదని మంత్రి నారాయణ స్పష్టం చేశారు...ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్,కమిషనర్ నందన్,ఆర్డిఓ అనూష, ఏపీ స్టేట్ సివిల్ సప్లై డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, డిప్యూటీ మేయర్లు రూప్ కుమార్ యాదవ్, తహసీన్, టిడిపి సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు,48వ డివిజన్ ప్రెసెండిట్ పెంచల బాబు,ఇంచార్జ్ కీర్తి,బూత్ కన్వీనర్ హుసేన్ బాషా, గోపి,ఇంతియాజ్, టీడీపీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.




## తిరుమలలో ఎంబిసి ప్రాంతంలో కూలిన భారీ చెట్టు

**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండల్లోని కలియుగవైకుంఠం తిరుమలలో మంగళవారం ఉదయం ఓ భారీ చెట్టు ఉన్నఫళంగా కూలిపోయింది. ఈ సమయంలో ఎంబిసి ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీగార్డు చంద్రశేఖర్‌రెడ్డి తలకు గాయాలయ్యాయి. ఎంబిసి ప్రాంతం నిత్యం యాత్రికులతో ,కాలినడక భక్తులతో రద్దీగా ఉంటుంది. ఎప్పుడూ కిటకిటలాడే ఈ ప్రాంతంలో అదృష్టవశాత్తు చెట్టుకూలిన సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. ప్రాణనష్టం కూడా జరగలేదు. చెట్టుకూలిన సమయంలో భారీగా శబ్ధం రావడంతో సమీపంలోని భక్తులు, సిబ్బంది గందరగోళానికి, భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న టిటిడి ఉద్యోగులు, భద్రత సిబ్బంది అక్కడకు చేరుకుని గాయపడిన సెక్యూరిటీగార్డును అశ్వినీ ఆస్పత్రికి తరలించారు.

### ప్రజలకు శ్రీవారి ఆశీస్సులుండాలి : ప్రముఖులు

**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ప్రజలకు శ్రీవారి ఆశీస్సు ఎల్లప్పుడూ ఉండాలని పలువురు ఆకాంక్షించారు. విఐపి బ్రేక్ దర్శనస మయంలో ఇండియన్ క్రికెటర్ తిలక్‌వర్మ, దర్శకుడు వెంకి కుడుముల, దర్శకుడు మల్లిది వశిష్ట, చిత్రదర్శకుడు గంగైఅమరన్ స్వామివారిని దర్శించుకున్నారు.

### జనసేన నేత కర్రి మహేష్ సస్పెన్షన్

**విజయవాడ,ఆగస్టు26.ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీపట్నంలో హోంగార్డ్‌పై జనసేన నేత కర్రి మహేష్ దాడిచేశాడు. ఈ ఘటనపై జనసేన అధిష్టానం చర్యలు చేపట్టింది. దాడికి పాల్పడిన కర్రి మహేష్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జనసేనలో కర్రి మహేష్ క్రియాశీలక సభ్యత్వాన్ని రద్దు చేసినట్లు మచిలీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ తెలిపారు. బండి రామకృష్ణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిజానిజాలు పూర్తిగా తెలియకపోయినా కేసు నమోదైన నేపథ్యంలో కర్రి మహేశ్ క్రియాశీలక సభ్యత్వాన్ని పార్టీ హైకమాండ్ రద్దు చేసిందని తెలిపారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
NIWAS HOUSING FINANCE
(పూర్వపు ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం-కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093

**సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు చట్టం 2002 సెక్షన్ 13(2) క్రింద ప్రకటన**

NHFPL ఈ క్రింది రుణగ్రహీతలకు నివాసిత గృహాల యొక్క తనఖా పై గృహ రుణం/తనఖా రుణం/నిర్మాణ రుణం మంజూరు చేసింది. నేషనల్ హౌసింగ్ బ్యాంక్ / RBI యొక్క మార్గదర్శకాలు మరియు ఆదేశాలను అనుసరించి సదరు రుణాలు తిరిగి చెల్లింపులు సక్రమంగా లేకపోవడంతో వారి ఖాతాలను ఫైనల్‌గా నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. అందువలన NHFPL సర్ఫాసి చట్టం 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద హక్కులను వినియోగిస్తూ వారికి చట్ట ప్రకారం నోటీస్ జారీ చేస్తూ ఆ రుణగ్రహీతలను రుణ బకాయి మొత్తాలను వారికి ఎదురుగా పేర్కొన్న రుణ బకాయి మొత్తం డిమాండ్ నోటీస్ తేది నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా పిలుపు ఇవ్వడమైనది. ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు ఇందుమూలముగా ఈ ప్రచురణ ద్వారా పిలుపు ఇవ్వనది ఏమనగా వారికి ఎదుటగా పేర్కొన్న రుణ బకాయి మొత్తాలను తదుపరి చార్జీలు మరియు తిరిగి చెల్లింపు వరకు అయిన వడ్డీతో సహా సదరు డిమాండ్ నోటీస్ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా పిలుపు ఇవ్వడమైనది. విఫలమైతే NHFPL చట్టప్రకారం బకాయి మొత్తం రికవరీకి ఆస్తుల స్వాధీనం, డిస్పోజ్/అమ్మకం అన్నీ లేదా ఏదైనా తదుపరి చర్యలకు ఉపక్రమించి చెల్లించవలసిన రుణ బకాయి మొత్తాన్ని రుణ ఒప్పందం యొక్క చట్ట నిబంధనల ప్రకారం తిరిగి వసూలుకు ఉపక్రమిస్తుందని ఇందుమూలముగా హెచ్చరించడమైనది. రుణగ్రహీతలు ఆస్తుల యొక్క ఓనర్‌షిప్‌పై థర్డ్ పార్టీ ఆసక్తి సృష్టించడం లేదా పరాధీనం చేయడం వంటి చర్యలు చేపట్టవద్దని హెచ్చరిస్తూ అదుపు చేయడమైనది.

| క్ర. సం. | స్థానం / రుణ ఖాతా నంబర్ | రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీతలు/ హామీదారు | డిమాండ్ నోటీస్ పంపిన తేది | డిమాండ్ నోటీస్ ప్రకారం మొత్తం |
|---|---|---|---|---|
| 1. | గుంటూరు-అరండల్‌పేట్ LNGUN0HL-12180007466, LNGUN0HL-12180007467 | 1. సావిత్రి తాడికొండ (రుణగ్రహీత) 2. తాడికొండ సురేష్ కుమార్ (సహ-రుణగ్రహీత) | 07-ఆగస్టు-2025 | రూ.734809/- (రూపాయలు ఏడు లక్షల ముప్పై నాలుగు వేల ఎనిమిది వందల తొమ్మిది మాత్రమే) |
| | ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా, తాడికొండ ఉప జిల్లా, తాడికొండ మండలం, తాడికొండ గ్రామపంచాయతీ & తాడికొండ గ్రామంలో కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. W-B: 0-2 సర్వే: 835/1, ఇంటి నెం.270, విస్తీర్ణం: 145 చదరపు గజాలు ఖాళీ స్థలం Rcc భవనం గ్రౌండ్ ఫ్లోర్ 840 చ.అ. మొదటి అంతస్తు 840 అడుగులు కింది సరిహద్దులు ఉత్తరం-పంచాయతీ బజార్, దక్షిణం-ఎదర లక్ష్మీనారాయణ స్థలం, తూర్పు-పంచాయతీ బజార్, పశ్చిమం-పెద్ద కొడుకు గిఫ్ట్‌డ్ ఆస్తి నిర్వహణ. | | | |
| 2. | గుంటూరు-అరండల్‌పేట్ LNGUNLAP-01210015718 | 1. హనుమ వర ప్రసాద్ రామిశెట్టి (రుణగ్రహీత) 2. కృష్ణ కుమారి రామిశెట్టి (సహ-రుణగ్రహీత) | 14-ఆగస్టు-2025 | రూ.870996/- (రూపాయలు ఎనిమిది లక్షల డెబ్బై వేల తొమ్మిది వందల తొంభై ఆరు మాత్రమే) |
| | ఆస్తి వివరణ: గుంటూరు జిల్లా నరసరావు పేట ఆర్.డి., క్రోసూరు సబ్ జిల్లా, క్రోసూరు మండలం, 88 తాళ్లూరు గ్రామపంచాయతీ ప్రాంతం, 88 తాళ్లూరు గ్రామం డోర్ నెం.5-144, డోర్ నెం.309-2, 96.8 చదరపు గజాల విస్తీర్ణంలో R.C.C భవనం కలిగి ఉన్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ క్రింది సరిహద్దులు తూర్పు-మాగంటి సుబ్బమ్మ స్థలం 20 అడుగులు, దక్షిణం-మాగంటి సుబ్బమ్మ ఇంటి స్థలం 43.6 అడుగులు, పశ్చిమం-మాగంటి సాంబయ్య ఇంటి స్థలం 20 అడుగులు, ఉత్తరం-రోడ్డు-43.6 అడుగులు ఈ సరిహద్దుల లోపల 96.8 చదరపు గజాలు లేదా 81.31 చదరపు మీటర్ల విస్తీర్ణంలో RCC భవనం మరియు అన్ని సౌకర్యాలతో RCC భవనం 800 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొదటి అంతస్తు | | | |

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్ సం/ అధీకృత అధికారి
తేదీ : 27.08.2025 నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున


## సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**సచివాలయం,ఆగష్టు 26,ప్రభాతవార్త :** వినాయక చవితిని పురస్కరించుకొని మట్టిగణపతిని పూజిద్దాం.. ఎ ాన్ర్యవరణాని కాపాడుదాం..పర్యావరణ భద్రత. ..మనందరి బాధ్యత అంటూ రాష్ట్ర సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పెద్దఎత్తున పంపిణీ చేశారు. రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్ ,స్టాంప్స్ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ తరపున వారి పేషీ అధికారులు, సిబ్బంది మట్టితో తయారు చేయబడిన అంకుర గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ అంకుల గణపతి ప్రతిమల్లో ఒక విశిష్టత ఉందని, గణపతి పూజానంతరం ఈ విగ్రహాన్ని నీటితో తడిపి నానబెడితే అందులో నుండి మొక్క వస్తుందని తద్వారా పచ్చదనం ఫరిడవిల్లుతుంది అంటున్నారు.

## మట్టివినాయకులనే పూజించాలి - పర్యావరణ హితం కోసం విగ్రహాల పంపిణీ



**తిరుపతి, ఆగష్టు 26ప్రభాతవార్త ప్రతినిధి:** పర్యావరణ హితం కోసం మట్టి తో తయారు చేసిన వినాయకుని ప్రతిమలనే పూజిద్దామని, ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలని ఏకవీరఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్‌స్వామి, రాయలసీమ రంగ స్థలి చైర్మన్ గుండాల గోపీ నాథరెడ్డి కోరారు. నేడు వినాయకచవితి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఏటాలాగే ఈ ఏడాది కూడా ప్రజలకు మట్టితో చేసిన వినాయకవిగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం తాతానగర్‌లో నేరెళ్ళమ్మ ఆలయం వద్ద ప్రతాప్‌స్వామి, గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమ ణ్యంరెడ్డి, కొండే చెంగారెడ్డి, సురేశ్‌స్వామి, చంగల్‌రాయలు, కస్పాపద్మనాభం, కెఎన్ రాజ, హనుమంతరావుతో కలసి 500మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.


ADITYA BIRLA CAPITAL
FINANCE
Regd Office: Indian Rayon Compound, Veraval, Gujarat - 362 266 | (T) +91-22-6723 9101 | (Toll Free) 1800 270 7000 | CIN: L64920GJ2007PLC058890 | www.adityabirlacapital.com

**ఋణ ఖాతాను(లు) మోసపూరితమైనది(వి)గా ప్రకటించడానికి/వర్గీకరించడానికి చిట్టచివరి నిర్దేశాన్ని జారీచేయడానికి నోటీసు**

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లి. వెబ్ సైట్ https://www.adityabirlacapital.com/. పైన అందుబాటులో ఉన్న ఈ తరువాతి లింక్ https://abcf.financial/Final-Order లో తెలియపరచబడిన ఋణగ్రహీతలకు చిట్టచివరి నిర్దేశం జారీచేయబడుతున్నది.

ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ ("ABCL") (ఇంతకు మునుపు ఆదిత్య బిర్లా ఫైనేన్స్ లిమిటెడ్ ("ABFL") గా పిలువబడేది) ద్వారా నిర్వహించబడిన అన్వేషణల సమయంలో, పైన హైపర్ లింక్లో తెలియపరచబడిన పేరులో ఉన్న ఋణగ్రహీతలైన మీరు ABCL నుండి వ్యక్తిగత ఋణాన్ని లభ్యం చేసుకుంటున్నప్పుడు ఋణాన్ని పొందడానికి తప్పుడు మరియు సృష్టించబడిన దస్తావేజులను ఉపయోగించి మోసాన్ని నిర్వర్తించారని వెలుగులోనికి వచ్చింది.

ఋణగ్రహీతలను సంబోధిస్తూ ఇచ్చిన షో కాజ్ నోటీసులు ABCL వారి వెబ్ సైట్ అంటే https://abcf.financial/fraudawareness పైన 17 జూన్ 2025 తేదీ నాడు ప్రచురించబడ్డాయి, దీనికి రిఫరెన్స్ కూడా జాతీయ వార్తా పత్రికలో మరియు మీ ప్రాంతం/రాష్ట్రం యొక్క స్థానిక వార్తా పత్రికలో కూడా 30 జూన్ 2025 తేదీన ప్రచురించబడినది. షో కాజ్ నోటీసులకు ప్రతిస్పందించడానికి 21 రోజుల తగినంత సమయం ప్రదానం చేయబడినా కూడా మీ నుండి ఎలాంటి ప్రతిస్పందన అందుకోబడలేదు.

ఈ తీవ్రమైన ఉల్లంఘనలకు అనుగుణంగా, తక్షణమే అమలయ్యేలా మీ ఋణ ఖాతా మోసపూరితమైనదిగా ప్రకటించడం మాకు తప్పనిసరి అయింది. మీ పేర్కొనబడిన ఖాతా మూసివేతకు పర్యవసానంగా, ఏదైనా కూడబడిన వడ్డీ, ఫీజులు మరియు జరినామాలతో సహా బకాయి ఉన్న గడువుకు వచ్చిన డబ్బులను సంపూర్ణంగా పదిహేను రోజుల లోపల చెల్లించవలసినదిగా మీకు ఇందు మూలంగా తెలియపరచబడుతున్నది. ఈ తిరిగి చెల్లింపు డిమేండుకు అనువర్తన చేయడంలో విఫలమయినట్లయితే, చట్టపరమైన చర్యకు తదుపరి దారితీయవచ్చును, దీనిలో వసూలు చేసే ప్రక్రియలు, క్రెడిట్ బ్యూరోలకు నివేదించడం మరియు సంభావ్య నేరపూరిత ఛార్జీలకు దారితీయడం కూడి ఉండవచ్చును. ఒకసారి పూర్తి చెల్లింపును అందుకున్నట్లయితే, మీ ఋణ ఖాతా చివరకు మూసివేయబడుతుంది మరియు ముగించినట్లుగా ధృవీకరణ మీకు జారీ చేయడం జరుగుతుంది.

న్యాయపరమైన పర్యవసానాలకు గురికాకుండా ఉండడానికి ఈ విషయాన్ని తీవ్రతతో దయచేసి పరిగణించగలరు.

భవదీయుడు,
**ఆదిత్య బిర్లా క్యాపిటల్ లి. తరపున**
**సంతకం/-**
సంతకం చేయడానికి అధీకృతం చేయబడిన వారు

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
ప్రచురించే తేదీ : 27 ఆగస్టు, 2025

వార్త

జీవితం అంటే ఒక సమస్య నుంచి మరొక సమస్యకు ప్రయాణం మాత్రమే. ఏ సమస్యలూ లేని జీవితం ఉండదు.

-వాల్టర్ స్కాట్


# తపాల సేవలకు మంగళం!

అనుకోకుండా ఇప్పుడు తపాల శాఖ మళ్లీ రోడ్డెక్కుతోంది. విమానం ఎక్కలేని తపాలా సంచులు తపాల కార్యాలయాల్లోనూ, విమానాశ్రయాల్లోనూ పడిగాపులు పడి ఎదురుచూస్తున్నాయి. అమెరికాకు పోస్టల్ సేవలను భారత ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపి వేసింది. ఆగస్టు 29 నుంచి 100 డాలర్లకుపైగా విలువున్న బహుమతులు, లేఖలు, డాక్యుమెంట్లపై సేవలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన మేరకు అధిక సుంకాలు వడ్డిస్తాయి. జులై 20న అమెరికా జారీ చేసి కార్య నిర్వాహక ఉత్తర్వు మేరకు అంతర్జాతీయ పోస్టల్ నెట్‌వర్క్, అమెరికా కస్టమ్స్ సరిహద్దు రక్షణ (సిబిపి) విభాగాలు ఆమోదించిన క్వాలిఫైడ్ పార్టీల ద్వారా వస్తువులను రవాణా చేసే సంస్థలే సుంకాలు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ సుంకాల వసూళ్ల ప్రక్రియపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో అమెరికా విమానయాన సంస్థలు భారత్‌వైపు నుంచి తపాల పార్శిళ్లు, లేఖలను స్వీకరించలేదు. ఇప్పుడొచ్చిన తంటా అంతా ట్రంప్ విధానంపై స్పష్టత లేనందునే. ఇదిలా ఉంటే స్వదేశంలో తపాలాశాఖలో సంస్కరణలు కూడా సామాన్య ప్రజలకు అర్థంకాకుండా ఉన్నాయి. నిత్యం తపాలా సేవలు నానాటికీ తీసికట్టు నాగంబొట్లు అన్న చందాన మారి పోస్టాఫీసులవైపు చూసేవారే తక్కువయ్యారు. కేవలం రికార్డుల్లో నమోదవ్వాల్సిన రిజిష్టర్డ్ పోస్టులు, లీగల్ నోటీసులు, రిజిస్టర్ పార్శిల్స్‌కోసం మాత్రమే న్యాయవాది కార్యాయాలు, వివిధ ప్రభుత్వ సంస్థలు మాత్రమే అటువైపు తొంగిచూస్తాయి. అయినా ప్రస్తుత కాలంలో సర్వర్ డౌన్ అన్న పేరిట సర్వీసులు సక్రమంగా అందించలేకపోతుండటం విచారకరం. తాజాగా ఈ మెయిల్, వాట్సాప్‌లు ఫోన్లలోనే అందుబాటులోకి రావడం, యుపిఐ చెల్లింపు సదుపాయం ఉండడంతో మనీ ఆర్డర్లు సేవలు కూడా మటుమాయమయ్యాయి. డబ్బుల చేరవేత, పుస్తకాల అందచేత, వంటి వారికి ప్రత్యామ్నాయ మార్గాలు రావడంతో పోస్టాఫీసు సందర్శకులు చాలా తగ్గిపోయారు. ఈ రీత్యా తపాల సంస్థ తన రూపురేఖలు మార్చుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇకపై ఉత్తరాల పెట్టెలు కనిపించవు.అయితే ఆ శాఖ వివరణలో పోస్టాఫీసుల వద్ద బాగా ప్రాముఖ్యత గలసెంటర్లలో మాత్రమే పోస్ట్‌బాక్స్‌లుంటాయి. ప్రైవేట్ కొరియర్లకు ఛార్జీలు ఎక్కువైనా, రక్షణ చేరవేతలో తపాలా శాఖ వారి సేవలలో పోల్చి చూస్తే కాస్త బెటర్ అనే పరిస్థితి ఉన్నందున జనం దృష్టి అటువైపు పడింది. తాజాగా డిజిటలైజేషన్ అందిపుచ్చుకోవాలనే తపనలో వడివడి అడగులు లేయడానికి బదులు తప్పటడుగులు వేస్తోందని జనం నుంచి విమర్శ కూడా ఉంది. కారణం పోస్టల్ సర్వీసుల పునర్వ్యవస్థీకరణ జరిగినా ఎల్రక్టానిక్స్ వ్యవస్థలో సరైన సదుపాయం లేక రిజిస్టర్డ్ సర్వీసులు కూడా సక్రమంగా చేయలేకపోతున్నాయి. ఒకవేళ ఈసర్వీసుల ఆధునికత కోసం కొత్తగా యువతకు ఉద్యోగాలు ఆస్కారం లభించినా సర్వీసులు మెరుగుపరుచుకోలేకపోతోంది. అక్నాలెడ్జిమెంటు జతపడే రిజిస్టర్ కవర్లు,పార్శిల్స్ పద్ధతి దాదాపు ఎత్తివేసినట్లే. దాదాపు ఈ సర్వీసులు కొత్త రూపం సంతరించుకుంటున్నాయనే చెప్పాలి. దేశ వ్యాప్తంగా ఎక్కడనుంచి ఎక్కడికి వెళ్లాలన్నా ఎంతో భద్రతగా చెక్కులు, డ్రాఫ్టులు, అతిముఖ్యమైన డాక్యుమెంట్లను చేరవేసే సర్వీసుగా రిజిస్టర్ పోస్టులుండేవి. దానికి అనుబంధంగా వచ్చిన 'స్పీడ్‌పోస్టు'ను కూడా ఇప్పుడు రిజిస్టర్ పోస్టును తోసిరాజని దాని స్థానంలో కూర్చొంది. ముద్రణా పుస్తకాలు, పత్రాలను చేరవేసే బుక్‌పోస్ట్‌కు గతేడాది మంగళం పాడారు. సాధారణ పోస్టుకన్నా అత్యవసరంగా చేర్చేందుకని కొన్ని దశాబ్దాల నాడు ప్రవేశపెట్టిన ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఎప్పుడో ఆగిపోయింది. తంతితపాల కలిసి ఉన్నప్పుడు టెలిగ్రామ్‌లంటేనే 'మోర్స్‌'కీ చప్పుడు విన పడితేనే సమాచారం ఇటు నుంచి అటు చేరేవే కాదు. ఎల్రక్టానిక్ విప్లవం వచ్చాక తంతితపాలా శాఖలో ఆధునిక సేవలు మొదలయ్యాయానుకున్నా తపాలా సిబ్బంది వాటిని చేరుకోలేకపోతున్నారనే అపవ్రధ ఉండేది. తంతి శాఖ ఎప్పుడో విడిపోయింది. వినియోగదారునికి సరైన సేవలందించలేక చతికిలపడిపోయింది. దాంతో వారి వేగాన్ని ప్రైవేట్‌సంస్థలు అందుకొని వేగాతివేగంగా సర్వీసు ప్రొవైడర్లుగా మారి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నా. అప్పట్లో బిఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ సర్వీసుల్లో దొంగ కనెక్షన్లు, టెలిఫోన్ వైర్ల దొంగతనం విచ్చలవిడిగా జరిగినా నష్టాలు వచ్చేవికావు.కానీ యాజమాన్య నిర్వహణ లోపంలో టెలిఫోన్ సేవలు చేజార్చుకున్నారు.అలా తంతి తపాలాలు శాశ్వతంగా దూరమయ్యాయి. తపాలా కార్యక్రమాల విస్తరణ, అభివృద్ధి, ప్రక్షాళన, ప్రజలకు మరింత అందుబాటులో ఉంచే విధంగా పునరేకీకరణ లాంటి ప్రయత్నాలలో మళ్లీ ఇప్పుడు పోస్టాఫీసులను భూస్థాపితం చేసిన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. తపాలా బట్వాడా కోసం నియమిత సిబ్బందిని కూడా తగ్గిస్తున్నారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న తపాలా శాఖకు కొత్తరూపం రావడం మంచిదే. అయినా గతంలో అందరికీ అందుబాటులో ఉన్నాయనుకున్న సౌకర్యాల కుదింపు వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. బ్రిటిష్ వారి కాలంలో గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్ 1776 మార్చిలో తంతితపాలా శాఖ ఏర్పడింది. అప్పట్నించి అంచెలంచెలుగా దినదిన ప్రవర్ధమానమై విస్తరించింది. పొదుపు ఖాతాలకు తపాలా శాఖ పెట్టిందిపేరు. డిజిటల్ ఎల్రక్టానిక్ సాంకేతికతతో విస్తరించే ప్రతి సంస్కరణను ఆహ్వానించాల్సిందే. తపాలా సేవలలో ఎన్నో అద్భుతాలు వింటుంటాము. ఇన్ని వైభవాలున్న తపాలా సేవలు అధునాతన సంస్కరణలతో ద్విగుణీకృతం కావాల్సి ఉంది.



అదృష్టం తనంతా తానుగా వచ్చి తలుపు తడుతుందని అందరూ చెప్తుంటారు. అది అవకాశం రూపంలో ఉంటుంది. దాన్ని వెంటాడు. సొంతం చేసుకో!

జాన్ వాట్సన్



ఒక వ్యక్తి పవిత్రమైన ఆలోచనలతో మాట్లాడినా, లేక పనిచేసినా ఎప్పటికీ అతనిని విడువని నీడలాగా ఆనందం అతని వెన్నంటే ఉంటుంది.

గౌతమబుద్ధుడు

## ప్రజావాక్కు



### ప్రయోజనం శూన్యం

ఏ వ్యక్తినైనా నిశితంగా పరిశీలించకుండా భ్రమలో పడి చాలా 'మంచివాడు' అనే ముద్ర వేసినచో, నిజరూపంలో ఆ క్షణం నుండే మంచివాడుగా నటించడం మొదలెడతాడు. మానవ పుట్టుకతో బంధాలు కలుస్తాయి, గిట్టడంతో జ్ఞాపకాలు మిగులుతాయి. మంచి చెడులు కలిగి ఉన్న మనిషి జీవితంలో సిరి సంపదలకంటే పరువు ప్రతిష్టలు శాశ్వతంగా నిలుస్తాయి.ఎదురుచూడని ఇంటికి పిలవకుండా వెళ్ళినా, విలువ లేని చోట మాట్లాడినా, గౌరవం లేని చోట నిలబడినా, ప్రేమలేని చోట ఆశపడినా, నిర్లక్ష్యం ఉన్నచోటఎదురు చూచినా,బంధాలకంటే డబ్బుకు విలువ ఇచ్చేవారితో ఎంతప్రేమగాఉన్నా, నీవెనుక ఒకటి ముందు ఒకటిమాట్లాడేవారికిదగ్గరలోఉన్నా,ప్రయోజనం శూన్యం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

### వినాయక ఉత్సవాలు ఆరంభం

బొంబాయి లాంటి మహానగరాల్లో ప్రజల్ని ఒకటిగా చేయడానికి మన బలాన్ని, బలగాన్ని బ్రిటిష్ వారికి చూపడానికి బాలగంగాధర్ తిలక్ ఈ గణేష్ ఉత్సవాలను ఎంచుకున్నారు.అంతకు ముందురోజుల్లో గ్రామాలలో ఎవరి ఇంటి గణేశుని వారే ఆ ఊరు కోనేటి నుండి కొంత మట్టిని తెచ్చుకుని మట్టి ప్రతిమను తయారుచేసి పిండి వంటలు పెట్టి నవరాత్రులు గడిచాక వాటిని ఆ చెరువులో నిమజ్జనం చేసేవారు.నవరాత్రులు వర్షాలు పడేవి. వర్షాలు వల్ల వచ్చిన నీరు చెరువులో నిలవడానికి చెరువులో మట్టిని ఇంటికి ఇంత అని తీసేవారు. వర్షాలు పడడం తగ్గాక అదే మట్టిని ఆ చెరువులోనే నిమజ్జనం చేయడం వల్ల, నీరు పైకి వచ్చి పొలాలకు సేద్యం చేయడానికి వ్యవసాయం చేయడానికి ఉపయోగపడేది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నోటిఫికేషన్స్ పేపర్‌లో వేయాలి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రకటనను అన్ని ప్రధాన వార్తా పత్రికల్లోవేయాలి.ప్రస్తుతం ఉద్యోగ నియామకాలు అంతర్గతంగాఎప్పుడో జరిగిపోతున్నాయి. ఉద్యోగ నియామ కాలు, ప్రకటనలు నిరుద్యోగులకు, ప్రజలకు తెలియకుండా జరిగిపోతున్నాయి. విద్యార్థులకు అడ్మిషన్స్ సంబంధిత నోటిఫికేషన్స్ కూడా ప్రధాన పత్రికల్లో వేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### రాజకీయ నైతికత

మొన్నటి సమావేశాల్లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడి, ఆనక మరింత లోతు పరిశీలనకై జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపబడ్డ రాజ్యాంగం 130 వ సవరణ బిల్లు ప్రత్యేకమైనది. రాజకీయాల్లో, ముఖ్యంగా పాలనలో పై స్థాయిలో నైతికత ప్రోది చెయ్యడానికి ఉద్దేశించబడింది.దాని ప్రకారం ప్రధాన మంత్రి గానీ,కేంద్ర, రాష్ట్ర మంత్రులు గానీ, ముఖ్యమంత్రి గానీ ఏదైనా క్రిమినల్ కేసులో, అదీ ఐదేళ్లకు పైగా శిక్షార్హమైన కేసులో అరెస్ట్ అయ్యి ముప్పై రోజులు జైలు లేదా కస్టడీ జీవితం గడిపితే వారిని వెంటనే తొలగించాలి అని. అంటే 31 వ రోజుకి ఆటోమేటిక్‌గా పదవి కోల్పోతారు.ఒక వేళ తర్వాత బెయిల్ పొందితే మళ్లీ పదవి చేపట్టవచ్చు. అది వేరే విషయం. ఈ చట్టం స్ఫూర్తి వినడానికి ఎంతో బాగుంది.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పనుల జాతర పల ప్రదంగా కొనసాగుతుంది. ఇందులో రెండు భాగాలున్నాయి. ఒకటి గ్రామీణప్రాంతమౌలిక వసతులు మెరుగుపరచడం. రెండు ప్రజల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి ప్రయత్నం చేయడం. ఇందులో భాగంగా గొర్రెల పాకలు గాని పశువుల కొట్టాలు గాని పండ్ల తోటల పెంపకం గాని చేయడం వల్ల తెలంగాణలో గొర్రెల సంఖ్య పెంచడానికి సాధ్యం అవుతుంది. ఒకప్పుడు వేరే రాష్ట్రాల నుండి గొర్రెలను దిగుమతి చేసుకునే వారు.ఇప్పుడు దానిని స్థిరీకరించి మొదటి స్థానానికి చేరాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ స్థిరీకరణ జరుగుతుంది.

- భారత అవినాశ్, జనగామ

### జనరిక్ మందులపై అవగాహన అవసరం

ఈ రోజు పెరుగుతున్న వైద్య వ్యయాల నేపథ్యంలో జనరిక్ మందుల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరం. ప్రత్యేకించి ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఇది ఎంతో ఉపయుక్తం. వాణిజ్య బ్రాండ్ మందుల ధరలు అధికంగా ఉండటం వల్ల పేద ప్రజలకు చికిత్స అందడం కష్టమవుతోంది. జనరిక్ మందులు తక్కువ ధరలో, అదే నాణ్యతతో, అనుమతించబడిన ప్రమాణాలతో తయారవుతాయి. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, జన ఔషధి కేంద్రాల ద్వారా వీటిని విస్తృతంగా అందుబాటులోకి తేవాలి.వీటిపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శిక్షణ లేకనే నిరుద్యోగులకు కష్టాలు!

**మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సివస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలామంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.**

సోరుపాక అనిల్ కుమార్

విద్య అంటే వెలుగు అని మనం తరతరాలుగా నమ్ముతూ వచ్చాం. చదువుకున్నవాడికి ఉద్యోగం వస్తుంది, గౌరవం వస్తుంది, కుటుంబానికి సంతోషం వస్తుందని ప్రతి ఇంటిలోనూ తల్లిదండ్రులు కలలు కంటారు. కానీ ఈ కాలంలో ఆ కలలు చాలావరకు చీకటిలో కలిసిపోతున్నాయి. చదువుకున్నా కూడా ఉద్యోగం దొరకని పరిస్థితి ప్రతి ఇంటి గడపను తట్టిపోతుంది.ఒకవైపుడిగ్రీలు, పీజీలు, ఎంబీఏలు, ఇంజినీరింగ్, మెడిసిన్, పీహెచ్.డీలు పూర్తిచేసిన యువత ఉత్సాహంగా బయటకు వస్తుంటే, మరోవైపు వారికి తగిన అవకాశాలు లేక నిరుద్యోగుల బాటలో నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఈసమస్య వ్యక్తిగతంగా ఒకరి జీవితాన్ని మాత్రమేకాదు, మొత్తం దేశ ఆర్థికవ్యవస్థను, సమాజాన్ని కూడా కుదిపేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది యువత రాత్రింబవళ్లు కష్టపడతారు. కాని, సంవత్సరాల తరబడి కొత్త నోటిఫికేషన్లు రావడం లేదు. వచ్చినా కూడా కోర్టు కేసులు, సాంకేతిక లోపాలు, అవినీతి కారణంగా ఆ నియామకాలు ఆగిపోతున్నాయి. పరీక్షలు రాసిన యువత ఫలితాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తుంటారు. కొందరికి వయసు పైబడిపోతుంది, మరికొందరు నిరుత్సాహంతో అవకాశాలు వదులుకుంటారు. ప్రభుత్వంలో ఖాళీలున్నా కూడా వాటిని భర్తీ చేయడంలో స్పష్టత లేకపోవడం మరో సమస్య. కొన్నిసార్లు రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు నోటిఫికేషన్లు ఇస్తూ ప్రజలను మోసం చేస్తాయి. పరీక్షలు పూర్తవ్వగానే కొత్త కేసులు రావడంతో ఆ నియామకాలు స్తంభించిపోతాయి. ఈ పరిస్థితి యువత జీవితాలను మాత్రమేకాదు, సమాజంలోని సామర్థ్యాన్ని కూడా వృథాచేస్తుంది. నిరుద్యోగం పెరగడంతో సామాజిక సమస్యలు కూడా ఉధృతమవుతాయి. ప్రభుత్వ నియామకాలు సమయానికి జరిగిఉంటే, వేలాది కుటుంబాలు ఆర్థికంగా బలపడేవి. కానీ ఆలస్యం వల్ల భవిష్యత్తు పాడవుతోందనే అసహనం పెరుగుతోంది. ప్రైవేట్ రంగం యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నా, వాటి నాణ్యత ప్రశ్నార్థకమే. చాలా సంస్థలు ఉద్యోగులను తక్కువ జీతాలతో ఎక్కువ గంటలపాటు పని చేయిస్తాయి. భద్రతా హామీలు లేకుండా కాంట్రాక్టు ఆధారంగా నియమిస్తారు. ఒక ఉద్యోగి తప్పు చేస్తే వెంటనే తొలగిస్తారు. ఎలాంటి రక్షణ ఉండదు. ఆరోగ్య భీమా, పింఛన్ వంటి సదుపాయాలు చాలా అరుదుగా ఉంటాయి. ఇంత తక్కువ జీతాలతో జీవన ఖర్చులు భరించలేక యువత ఋణాల బారిన పడుతున్నారు. కొంతమంది నైపుణ్యానికి తగిన వేతనం పొందక నిరుత్సాహపడుతున్నారు. కార్పొరేట్ కంపెనీలు ఎక్కువ లాభాలు సంపాదించినా ఉద్యోగులకు తగిన వాటా ఇవ్వడం లేదు. అదనంగా,రాత్రి పూటలు,టార్గెట్లు, ఒత్తిడి కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఉద్యోగ భద్రత లేకపోవడం వలన రేపటికి ఏమవుతుందో అన్న భయం ఎప్పుడూ వెంటాడుతోంది. ఈ దోపిడి పరిస్థితి యువతను మరోసారి ప్రభుత్వ ఉద్యోగాలవైపు తిరిగి పరుగెత్తేలా చేస్తోంది. మన విద్యార్థులు పుస్తక చదువులో మెరుగ్గా ఉన్నా, పరిశ్రమలకు కావాల్సిన ప్రాక్టికల్ నైపుణ్యాలు చాలావరకు లోపిస్తున్నాయి. యంత్రాలు, టెక్నాలజీ, ప్రాజెక్టు అనుభవం లాంటివి చాలా మందికి ఉండవు.ఫలితంగా, ఉద్యోగ ఇంటర్వ్యూలలో వెనుకబడిపోతున్నారు. ఇంజనీరింగ్ లేదా డిగ్రీ పూర్తిచేసినప్పటికీ, వర్క్‌ప్లేస్‌లో అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్,



టీమ్‌వర్క్, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యాలు తక్కువగా ఉంటాయి. కొన్ని సంస్థలు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగులను తయారు చేసుకుంటున్నా,అంతవరకు యువతకు అవకాశాలు దొరకడం లేదు. నైపుణ్యలోటు వల్ల చాలా సార్లు బాహ్య రాష్ట్రాల నుండి లేదా విదేశాల నుండి నిపుణులను కంపెనీలు తీసుకువస్తున్నాయి. ఇది మన విద్యా విధానం లోపాలను బయటపెడుతోంది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ అందించకపోవడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతోంది. విద్యార్థులు కూడా తాము నేర్చుకుంటున్న దాన్ని వృత్తిలో ఎలా ఉపయోగించుకోవాలో అన్వయించుకోలేకపోతున్నారు. దీని వలన విద్యాకాలం తర్వాత కూడా వారు తిరిగి కోచింగ్ సెంటర్లకు లేదా ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లకు వెళ్లాల్సి వస్తోంది. మన విద్యా విధానం చాలా వరకు పుస్తకాలకే పరిమితమైపోయింది. కోర్సులు రూపకల్పనలో ఉద్యోగ అవకాశాలను పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థులు మార్కులు తెచ్చుకున్నా, వృత్తిపరమైన అవకాశాలుదొరకడం లేదు. పాత సిలబస్ ఆధారంగా బోధించడం వల్ల కొత్త టెక్నాలజీలు, పరిశ్రమలో జరుగుతున్న మార్పులు విద్యార్థులకు తెలియవు. ఇంతకీ, చాలా మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. కొన్నిసార్లు నిరుపయోగమైన కోర్సులు కూడా నడుస్తూనే ఉన్నాయి. విద్యార్థులకు వృత్తి శిక్షణ,స్టార్టప్ ప్రోత్సాహం, పరిశ్రమలతో అనుసంధానం వంటి అంశాలు చాలా తక్కువ స్థాయిలో మాత్రమే అమలవుతున్నాయి. ఫలితంగా, విద్య పూర్తి చేసినా వారి చేతిలో సరైన పనులు ఉండడం లేదు. మరోవైపు, ప్రభుత్వ విధానాలు కూడా సమయానికి మార్పులు చేయకపోవడం వల్ల ఈ లోపాలు కొనసాగుతున్నాయి. ఒక కోర్సు చదివిన విద్యార్థి ఆ రంగంలో పని దొరకక, వేరే రంగాల్లో తక్కువ వేతనాలతో పని చేయాల్సి వస్తోంది. ఇది విద్యార్థులలో నిరాశను పెంచుతుంది. ప్రభుత్వం ఏ దేశానికైనా ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఆధారం. కానీ, మన రాష్ట్రంలో, దేశంలో వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలు సంవత్సరాల తరబడి భర్తీ చేయకుండా ఉంచడం వలన నిరుద్యోగులలో ఆందోళన పెరిగింది. పాఠశాలలలో ఉపాధ్యాయుల కొరత, ఆసుపత్రుల్లో డాక్టర్ల కొరత, కార్యాలయాల్లో సిబ్బంది కొరత వల్ల ప్రజా సేవలు దెబ్బతిన్నాయి. ఖాళీలు ఉన్నా వాటిని భర్తీ చేయకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్సహించడం వల్ల నాణ్యత తగ్గి, నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి దొరకడం లేదు. పారదర్శకమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ఉండకపోవడం,పరీక్షలలో ఆలస్యం, కోర్టు కేసులు, అవినీతి కారణంగా విద్యార్థుల జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నాయి.ప్రభుత్వం ఖాళీల సంఖ్యను స్పష్టంగా ప్రకటించి, సమయానికి నోటిఫికేషన్లు విడుదల చేసి, పారదర్శకంగా నియామకాలు జరపాలి. అనేకమంది ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్,ఇతరకోర్సులు చదివి ప్రైవేట్‌రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ అక్కడ జీతాలు తక్కువగా, పని గంటలు ఎక్కువగా ఉండటం, ఉద్యోగ భద్రత లేకపోవడం ప్రధాన సమస్య. చాలా కంపెనీలు ఫ్రెషర్స్‌కు కేవలం కొన్ని వేల రూపాయలే ఇస్తాయి. ఇది వారికష్టానికి సరిపోదు.అందువల్ల చాలామంది నిరుత్సాహానికిలోనై, నిరుద్యోగుల్లాగే తిరుగుతున్నారు.ప్రైవేట్‌రంగంకూడా ఉద్యోగులను కేవలం శ్రమ శక్తిగా కాకుండా మానవ వనరులుగా చూడాలి.వారి నైపుణ్యాలకు తగ్గజీతాలు ఇవ్వాలి.సెక్యూరిటీ, పీఎఫ్, ఇన్సూరెన్స్,ప్రమోషన్ అవకాశాలు కల్పించాలి. నేటి నిరుద్యోగ సమస్యలో పెద్ద కారణం మన విద్యావ్యవస్థ. హెల్త్‌కేర్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉద్యోగాలు పెరుగుతున్నాయి.కానీ మన కాలేజీల్లో ఆ కోర్సులు చాలాపరిమితంగా ఉన్నాయి. అందువల్ల విద్యా వ్యవస్థను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్చాలి. యువత కేవలం ఉద్యోగాలకోసం కాకుండాస్వయం ఉపాధి, స్టార్టప్‌లు,నైపుణ్యాభివృద్ధి వైపుదృష్టి సారించాలి. యువతలో చాలా మంది కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడుతున్నారు. కానీ వాస్తవానికి ప్రతిఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం దొరకదు.కాబట్టి యువత తనఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. కొత్త తరహా ఉపాధిఅవకాశాలను అన్వేషించాలి. ●

# మట్టి గణపతే మన పర్యావరణ హితుడు

డాక్టర్ మోటె చిరంజీవి

వినాయక చవితి సందర్భంగా ఇళ్లల్లో కొలువుదీర్చే గణపయ్యలను ముఖ్యంగా విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు మట్టితో చేసిన విగ్రహాలనే కొలువుదీర్చి పూజలు చేస్తున్నారు. అందువల్ల వివిధ రాష్ట్రాలలో, జిల్లాలో, వివిధ ప్రాంతాల్లో కళాకారులు మట్టితో చిన్న విగ్రహాలను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం వినాయక చవితి పండుగకు అతి తక్కువ సమయం ఉండటంతో వ్యాపారులు మట్టితో తయారు చేసిన విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. మట్టితో తయారు చేసే విగ్రహాలకు మంచి డిమాండ్ కూడా ఉంది. మట్టికి, మనిషికి విడదీయరాని బంధం ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే మానవ మనుగడ ప్రకృతితో ముడిపడి వుంది. ప్రకృతి ఆరాధనతో మొదలైన పూజలు ఇప్పుడు విగ్రహ ఆరాధన వరకు వచ్చాయి. సాధారణంగామిగతా దేవతామూర్తుల విగ్రహాలను కళాకారులు రాయితో మలుచుతారు. అయితే వినాయక చవితి ఉత్సవాల అనంతరం స్వామివారి విగ్రహాన్ని నిమజ్జనం చేయాల్సి వున్నందున కళాకారులు సులువుగా విగ్రహాలను తయారు చేసేందుకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో గణపయ్య విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇటీవల కాలంలో విగ్రహాల ఏర్పాటు సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. వేల సంఖ్యల్లో పెద్ద విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ విగ్రహాల వల్ల పర్యావరణానికి పెనుముప్పు సంభవించే ప్రమాదముందని విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన ఎత్తయిన విగ్రహాలు నీటిలో కరిగి దానినుంచి వెలువడే వ్యర్థాలతో ఆయా చెరువులు పూర్తిగా కలుషితం కావడం ఎంతో దారుణం. ఆ నీటిలో ఆవాసాన్ని ఏర్పరచుకున్న చేపలు, చిన్న చిన్న జీవులు, ఆ చెరువు నీటిని తాగేందుకు దిగివచ్చే పక్షులు, ఇలా ఆ నీటితో ప్రత్యక్షంగా సంబంధమున్న జీవుల మనుగడ ప్రశ్నార్థంగా మారుతుంది. దేశ వ్యాప్తంగా ప్రతిష్ఠించిన విగ్రహాలలో దాదాపు ప్లాస్టర్ పారిస్ విగ్రహాల సంఖ్య అధికంగా ఉంది. ఉత్సవాల అనంతరం ఎంతో అట్టహాసంగా సాగిన నిమజ్జనం తర్వాత ఆయా చెరువుల్లో చెత్తను వెలికి తీయడం పెద్ద పని. దాని ప్రకారం గత



ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల కంటే వ్యర్థాలు బాగా పెరిగినట్టుగా చెబుతున్నారు. నిమజ్జనం చేసిన విగ్రహాలతో పాటు పూజలో వినియోగించిన సామగ్రిని కూడా చెరువులోనే వేస్తారు భక్తులు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ అనగా పీఓపీ విగ్రహాల వల్ల నీటి కాలుష్యం, ఆక్సిజన్ స్థాయిలు తగ్గడం, జలచరాలకు హాని, మట్టి ఆరోగ్యం దెబ్బతినడం వంటి పర్యావరణ నష్టాలు ఉన్నాయి. పర్యావరణానికి హాని కలిగించే ఈ పదార్థాన్ని వాడకుండా, సంప్రదాయ మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని అధికారులు, పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. మట్టి గణపతిని పూజించటంలో యోగశాస్త్ర రహస్యాలు కూడా ఉన్నాయి. మానవ శరీరంలో ఉండే షట్చక్రాల్లో మొదటిది మూలాధార చక్రం. ఇది వెన్నుపూస ప్రారంభంలో ఉంటుంది.యోగశాస్త్రం ప్రకారంమూలాధార చక్రానికి అధిష్ఠాన దేవత గణపతి. మూలాధారం పృథ్వీతత్తం కలిగి ఉంటుంది.పృథ్వి అంటే భూమి. కాబట్టి, భూమికి సంకేతంగా మట్టితో విగ్రహం చేసి, మూలాధారానికి అధిదేవుడైన గణపతికి అర్చించాలి. దీనివల్ల గణపతి అనుగ్రహం సత్వరమే కలు గుతుంది. ఇలా మట్టి వినాయకున్ని నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు కలుషితం కావు. పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్టవుతుంది. భగవంతుని పూజకు భక్తి ప్రధానం. భక్తి లేకుండా బంగారు విగ్రహాన్ని పూజించినా ఫలితం ఉండదు. త్రికరణ శుద్ధితో, భక్తి శ్రద్ధలతో చిన్న వినాయకుని పూజించినా ఫలితం ఉంటుంది. అంతేకాని ఆర్భాటాలకు, గొప్పలకు పోయి పెద్దపెద్ద విగ్రహాలను పెట్టి తరువాత వాటిని నిమజ్జనం చేసేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్ద విగ్రహాల తయారీలో వాడే వస్తువులు నీటిలో కరిగిపోవు. నీటి కాలుష్యానికి కారణమయ్యే అనేక రకాల కృతిమ రంగులు,కెమికల్స్ వీటిలో ఉంటాయి. వినాయక చవితిని సింపుల్‌గా చేసు కోవడం వల్ల నష్టమేమీ లేదు.ఎంత భక్తిగా దేవుని పూజి స్తున్నామో ముఖ్యం గానీ, ఎంత ఆడంబరంగా చేస్తున్నా మన్నది ముఖ్యం కాదు. మనచుట్టూ ఉండే ప్రకృతే దైవ స్వరూపం. కనిపించే ప్రకృతిని నాశనం చేస్తూ కనబడని దేవుని పూజిస్తే ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రకృతిని దైవంగా భావిస్తూ మట్టి గణపతి పూజిద్దాం.పర్యావరణాన్ని పరిరక్షిద్దాం. ●

# చిన్నారులపై సోషల్ మీడియా విధ్వంసాన్ని ఆపేదెలా?

సంపతి రమేష్ మహారాజ్

నేటి ఆధునిక యుగంలో సామాజిక మాధ్యమాలు,ఓటిపి వెబ్ సిరీస్ వినియోగం విపరీతంగా పెరుగుతుంది. ఇవీ పిల్లల మనస్తత్వంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. హింసాత్మక ఘటనలకు దారి తీస్తున్నాయి. ఇటీవల కూకట్‌పల్లిలో జరిగిన బాలిక హత్యకేసులో మైనర్ బాలుడు క్రైమ్ వెబ్ సిరీస్‌తో ప్రేరణ పొందినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేయడం ఆన్లైన్ వేదికలలో తెలుసుకొని చేశాడు. చోరీని బాలిక చూడడంతో ఆమెను కిరాతకంగా చంపాడు. బెంగళూరులో ఓ బాలుడు (14) వెబ్ సిరీస్ చూసి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సిరీస్‌లోని ఓ క్యారెక్టర్ బొమ్మను కూడా తన గదిలో గీశాడు. కొందరు యువకులు ఒక బైక్ పై ఎనిమిది మంది ఎక్కి నడపడం వంటి సాహసాలకు ఒడిగడుతున్నారు. పిల్లల్లో ఇలాంటి విపరీత ప్రవర్తనకు స్మార్ట్ ఫోన్ వినియోగం, ఓటీటీ వెబ్ సిరీస్లు ప్రధాన కారణమని పలు అధ్యయనాలు చెప్తున్నాయి. చిన్నారులు ఎదుగుతున్న దశలో సోషల్ మీడియా, ఆన్లైన్ గేమ్స్‌లకు బానిసవడం వలన వారిలో విపరీత ప్రవర్తన, దూకుడు స్వభావం పెచ్చురిల్లుతుంది. పగ, శత్రుత్వం, దాడులకు ఉసిగొలుపుతున్నాయి. తద్వారా నేరాల బారిన పడుతున్నారు. కొన్నిసార్లు ఇవి శాంతిభద్రత సమస్యలుగా మారుతున్నాయి. సామాజిక మాధ్యమాలు తరచూ వీక్షించడం వలన పిలల్లో ఓపిక, సహనం, ఆలోచన శక్తి నశిస్తుంది. విద్య విషయాలలో వెనకబడుతున్నారు. విలువలు పతనమవుతున్నాయి. పిల్లలు పెద్దలపట్ల గౌరవం మర్యాద లేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రస్తుతం వాట్సప్, ఫేస్బుక్, ఎక్స్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్, వంటి ఆన్లైన్ వేదికలు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ సంబంధిత విషయాల తెలుసుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. మారుమూల ప్రాంతాల అణచివేయబడిన వర్గాల గొంతును వినిపిస్తున్నాయి. సామాజిక చైతన్యానికి ఊపిరిలూదుతున్నాయి. వీటి ద్వారానే కొన్నిసార్లు ప్రభుత్వం, అధికారుల స్పందన కూడా ఉంటుంది. ఒకప్పుడు పెద్దలకే పరిమితమైన ఈ ఆన్లైన్ వేదికలు ఇప్పుడు పిల్లల్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఆటపాటలతో సాగే బాల్యం మొబైల్ స్క్రీన్‌ఇరుక్కుపోయింది. వీటినుంచి పిల్లల్ని కట్టడి చేయడం తల్లిదండ్రులకు తల నొప్పిగా మారింది. సామాజిక మాధ్యమాలను నియంత్రించకపోతే భవిష్యత్తు భావి పౌర సమాజం అంధకారమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ నేపథ్యంలో పలు దేశాలు సామాజిక మాధ్యమాలనుంచి పిల్లలను దూరంగా చేయాలని ఆలోచిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తున్నారు. గత ఏడాది ఆస్ట్రేలియా ప్రభుత్వం తమ దేశంలో 16 ఏళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించడంపై నిషేధం విధించింది. ఇప్పుడు ఫ్రాన్స్ కూడా అదే బాటలో నడిచే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల తూర్పు ఫ్రాన్స్‌లోని నోజెంట్ పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థి దాడి ఘటన తర్వాత 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియాను నిషేధించే యోచనలో ప్రభుత్వం ఉందని ఫ్రాన్స్ ప్రధాని పేర్కొన్నారు. ఈ విషయంలో ఈయూ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని లేదా తామే అమలు చేస్తామని ప్రకటించాడు. ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకున్న రెండో దేశంగా ఫ్రాన్స్ నిలిచే అవకాశం ఉంది. చిన్నారులు, యువతపై సామాజిక మాధ్యమాల దుష్ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఫ్రాన్స్ ప్రభుత్వం నిర్ణయంపై చర్చ జరుగుతుంది. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా సామాజిక మాధ్యమాల నియంత్రణపై ప్రపంచ దేశాలు ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా బాల జనాభా గల భారత దేశంలో బాలల్ని సామాజిక మాధ్యమాల వ్యసనం నుంచి దూరం చేయాలి. ప్రభుత్వ పరంగా చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవాలి. 2023లో కర్ణాటక హైకోర్టు పాఠశాల పిల్లలు సామాజిక మాధ్యమాలకు అధికంగా వ్యసనం కావడం పట్ల ఆందోళనల వ్యక్తం చేసింది. ఈ మేరకు కోర్టు వీటిని వినియోగించడానికి 21సంవత్సరాల వయోపరిమితిని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ 2023పిల్లలు సోషల్ మీడియా వినియోగించడంలో కొన్ని షరతులను విధించింది. 18సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఆన్లైన్ డేటాను నిర్వహించడానికి కంపెనీలు తల్లిదండ్రుల సమ్మతి తీసుకోవాలని చెప్పింది. బాలల లక్ష్యంగా ఉండే ప్రకటనలపై పరిమితులు విధించింది. పిల్లల్లో నేర ప్రవృత్తి పెరుగుతున్న నేపథ్యంలో పిల్లలను డిజిటల్ పరికరాలకు దూరం చేయడం ముఖ్యమైన అంశం. అప్పుడప్పుడు విద్యా అవసరాలకు వినియోగిస్తున్నప్పుడు ఏం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలి. వారిలో విపరీత పోకడలను సరిదిద్దాలి. ఇంట్లో కుటుంబ సభ్యులు వారానికి ఒకసారి ఫోన్ హాలిడే పెట్టుకోవాలి. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్నంద్ గావ్ జిల్లా గహిరాబేడీ గ్రామ పంచాయతీలో పిల్లలు ఫోన్ గేములు ఆడితే తల్లిదండ్రులకు రూ.3,000 జరిమానా విధిస్తామని ఆంక్షలు పెట్టారు. దీంతో ఆ గ్రామంలో చాలావరకు మార్పు కనిపించింది.ఇలాంటి కట్టడి ప్రతిగ్రామంలోరావాలి. ఆన్లైన్ మనీ గేమ్‌తో యువత ఆర్థికంగా నష్టపోతుంది. ఈ క్రమంలో ఇటీవల కేంద్రం తీసుకువచ్చిన ఆన్లైన్ గేమ్ నియంత్రణ బిల్లు2025 ను ఆమోదించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు కుటుంబ బంధుత్వాలు, విలువల గురించి బోధించాలి. పిల్లలతో కలిసి ఆడుకోనివ్వాలి. ●

# గుంటూరు వార్త



## కష్టపడి రాణించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అభినందించే సంస్కారం కూడా లేని పెత్తందారు జగన్

### ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 26: దళిత, పేద విద్యార్థుల్లో సంతోషం వెల్లివిరుస్తోందని వారి ఆత్మగౌరవం, భవిష్యత్‌పై కొత్త ఆశలు కలుగుతున్నాయని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు చెప్పిన ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం ప్రభుత్వం విద్యను అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు గురుకుల పాఠశాలల్లో కష్టపడి చదివి ఐఐటీ, నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో రాణించిన 55 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల బహుమతి అందజేశారు. గురుకులాల్లో చదువుతున్న 1,17,600 మంది విద్యార్థులు ఎస్ఎస్సీలో 89.5 , ఇంటర్‌లో 94.2 ఉత్తీర్ణత సాధించారు. అలాగే నీట్ పరీక్షలో 31 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం ఈ విద్యా విధానం ఎంత సమర్థవంతమైందో చూపిస్తుందన్నారు. ఈ ఏడాది 1500 మంది విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్వర్గీయ ఎన్టీఆర్ గారు 1983లో గురుకుల పాఠశాలలను స్థాపించారని, తెలుగుదేశం పాలనలోనే ఈ పాఠశాలలకు అధిక ప్రాధాన్యం లభిస్తోందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, శెట్టి గోపీనాథ్ ఐపీఎస్, గంధం చంద్రుడు ఐఏఎస్ , రాజ్ కుమార్ ఐపీఎస్ ఇలాంటి వారు చాలా మంది ఐఏఎస్ , ఐపీఎస్ లు ఉన్నారు. ఈ పాఠశాలల్లో చదివిన వారు ఈరోజు ఐఏఎస్, ఐపీఎస్ లుగా దేశానికి సేవలందిస్తున్నారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దళిత విద్యార్థుల విజయాలపై ఒక్క ట్వీట్ కూడా చేయలేదు. దళిత పిల్లల చదువు, అభివృద్ధి ఆయనకు ఇష్టం లేదా..? జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పేదల విద్యపై ఎలాంటి శ్రద్ధ చూపలేదు. రాజకీయ ప్రయోజనాల కోసం ఐపీఎస్ అధికారులను వాడుకోని వారిని జైలు మొఖాలు చూసేలా చేశారని విమర్శించారు.



## ప్రజారోగ్య రక్షణలో స్వచ్ఛంధ సంస్థల పాత్ర సమాజానికి ఆదర్శం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,ఆగష్టు 26,ప్రభాతవార్త : స్థానిక పశ్చిమ నియోజకవర్గంలోని 28వ డివిజన్ వేణుగోపాల్ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ గాస్పెల్ మిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించి,ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి,ప్రజలకు సేవలు అందుబాటులో ఉండడం,సమగ్ర వైద్య సదుపాయాలు అందించడం కోసం నిర్వహించిన ఏర్పాట్లను సమీక్షించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధమైన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అత్యంత అభినందనీయమన్నారు.ఈ మెడికల్ క్యాంపులో జనరల్ మెడిసిన్,ఆర్థోపెడిక్,గైనకాలజీ,డెంటల్ తదితర విభాగాల్లో వైద్యసేవలు అందించబడ్డాయి.ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.అలాగే నిరుపేదలకు ఉచితంగా మందుల పంపిణీ చేయడం,ఆరోగ్యంపై అవగాహన కలిగించే ప్రత్యేక హెల్త్ కౌన్సిలింగ్ కూడా ఈ శిబిరంలో ఏర్పాటుచేశారు.కార్యక్రమంలో 28వ డివిజన్ టిడిపి అధ్యక్షులు ఏపి యాదవ్,స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జీవన్,మామిడి రామారావు,నల్లూరి శ్రీనివాసరావు,పగడాల రాము,చిరంజీవి,ప్రసాద్,శ్రీహరి,బుడే తదితరులు పాల్గొన్నారు.



## సుమేధలో మదర్ థెరిస్సాజయంతి వేడుకలు

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : స్థానిక ఎన్జీజీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో నోబుల్ బహుమతి గ్రహీత మధర్ థెరిస్సా జయంతి పురస్కరించుకొని విద్యార్థుల్లో సేవా దృక్పదాన్ని పెంపొందించడం కోసం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెనెన్షియల్ కు చెందిన క్లబ్ ప్రెసిడెంట్ ఆత్కూరి వీర రాఘవ,సెక్రటరీ సంతోష్ కుమార్,పెరుమాళ్ళ గ్రూప్ ఆఫ్ కాలేజీ చైర్మన్ పెరుమాళ్ళు,ఏడుకొండలు,వాసు,మహేంద్రరెడ్డి స్కూల్‌కి విచ్చేసి 8,9తరగతులకు చెందిన విద్యార్థులచే నూతన స్టూడెంట్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశనుండి పిల్లలందరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొని దేశాభివృద్ధిలో భాగం కావడానికి ఈ క్లబ్‌ఎంతో ఉపయోగపడుతుందని మధర్ థెరిస్సా ను ఆదర్శంగా తీసుకొని ఓర్పు,సహనంతో మీ రోజువారి కార్యక్రమాల్లో భాగం కావాలని విద్యార్థులకు తెలియజేశారు.కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు మధర్ థెరిస్సా కు ఘనంగా నివాళులర్పించారు.



## మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

గుంటూరు క్రైమ్,ఆగష్టు 26,ప్రభాతవార్త : స్థానిక ఫినిక్స్ మాల్ వద్ద మట్టి గణపతి విగ్రహాలు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లాస్టిక్ గణపతులను వదిలి,సహజ పదార్థాలతో తయారైన మట్టి విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చని,ప్రతి చిన్న ప్రయత్నం ప్రకృతి కోసం పెద్ద మార్పు తెస్తుందన్నారు.కార్యక్రమంలో జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు,డిప్యూటీ మేయర్ సజీల,తులసీ యోగేష్,దాసరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌వీఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాలలో "ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన మహోత్సవ్"

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : ర్యాగింగ్ అనే పాశవిక చర్యను విడనాడి స్నేహపూరిత వాతావరణంలో విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తూ,భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు.జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ జేసి ఇంజనీరింగ్ కళాశాల్లో కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సే రైటింగ్,ఎలక్యూషన్,పోస్టర్ ప్రెజెంటేషన్,క్విజ్‌లాంటి వివిధ పోటీల్లో విద్యార్థులు ర్యాగింగ్ వల్లజరిగే నష్టాలను వివరించారు.ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను,సర్టిఫికెట్లను అందజేశారు.ప్రతి విద్యార్థి ఫ్రెండ్ నాట్ ఫియర్ అనే భావనతో ముందుకు సాగాలని సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ,ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిర్మూలనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలన్నారు.ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ప్రతిమల తయారీ కళాకారులచే వేయబడుతున్న మట్టి విగ్రహాల తయారీలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు,స్వయంగా తయారు చేసి గొప్ప అనుభూతిని పొందారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.



## ఎన్నికల కమీషనర్ల నియామక నిరంకుశ చట్టాన్ని రద్దుచేయాలి

గుంటూరు కల్చరల్,ఆగష్టు 26,ప్రభాతవార్త : ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న మన దేశంలో ఎన్నికల వ్యవస్థ పాలకుల పంజరంలో చిలుక కావడం దారుణమని ఇందుకు కారణమైన ఎన్నికల కమీషనర్ల నియామక నిరంకుశ చట్టాన్ని రద్దుచేయాలని అవగాహన సంస్థ నిర్వాహకుల సమావేశం డిమాండ్ చేస్తుంది.అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో కేంద్ర పాలకుల చేతిలో కీలుబొమ్మగా మారిపోయిన ఎన్నికల కమీషన్ అంశంపై పాల్గొన్నవారు మాట్లాడారు.సమావేశంలో సీనియర్ అడ్వకేటు సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమీషనర్లను నియమకానికి తగినవారిని సిఫార్సు చేసే కమిటీ నుండి సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిని తొలగిస్తూ పార్లమెంటులో చట్టం చేసిన దగ్గరనుండి ఎన్నికల కమీషన్ భ్రష్టుపట్టి పోయిందన్నారు.విద్యావేత్త చంద్రయ్య మాట్లాడుతూ తమ తాబేదార్లను,మాట వినేవారిని ప్రతిష్టాత్మకమైన ఎన్నికల కమీషనర్ కమీషనర్లుగా నియమించుకొని ఇష్టా_రాజ్యంగా ఎన్నికలు జరిపించి గెలిచేలా వ్యూహం రూపొందించబడిందన్నారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, హరి,తదితరులు ప్రసంగించారు.



## ఎకనామిక్స్ విభాగంలో పీహెచ్‌డి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్26, ప్రభాతవార్త: వర్సిటీలోని ఎకనామిక్స్ విభాగంలో పరిశోధన చేసిన మండది వెంకటేష్ రెడ్డికు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. వెంకటేష్ రెడ్డి గుంటూరు జిల్లాలోని చిన్న, సన్నకారు రైతులపై ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన నిధి పథకం యొక్క ప్రభావం అనే అంశంపై ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కడిమి మధుబాబు పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ రెడ్డిను విభాగం అధ్యాపకులు, పరిశోధకులు అభినందనలు తెలిపారు.



## రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 26:జిల్లాలోని బూత్ లెవల్ అధికారులందరికీ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు ధరఖాస్తులను మరింత మెరుగ్గా పరిష్కారించే విధానంపై శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి సేవా కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి సునీల్



కుమార్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధిఎన్ ఓంకార్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కొరిటిపాటి ప్రేమ్ కుమార్ జనసేన ప్రతినిధి సీహెచ్ త్రినాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఓటరు జాబితాలు మరింత మెరుగ్గా రూపొందించేందుకు నియోజకవర్గాల వారీగా బూత్ లెవల్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం వద్ద శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ తో శిక్షణను నిర్వహించటం జరిగిందన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ పై ఎన్నికల సంఘం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే బీఎల్వోలు డోర్ టూ డోర్ వెళ్ళి ఓటరు జాబితాను వెరిఫికేషన్ చేయటం జరుగుతుందన్నారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులు బదిలీలు జరిగిన నేపథ్యంలో బీఎల్వో మార్పులు, చేర్పులను పూర్తి చేసి ఆన్ లైన్ లో అప్లోడ్ చేయటం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవల్ ఏజెంట్లు నియమించుకొని వివరాలను అందించాలన్నారు. ఈఆర్వోలు బీఎల్వోల మార్పుల చేర్పుల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేసి, సంబంధిత బూత్ ల వద్ద వివరాలను ప్రదర్శించాలన్నారు. ఓటరు ధరఖాస్తులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. మరణించిన వారి ఓట్లు ను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు స్థానిక సంస్థల నుంచి మరణ ధ్రువీకరణ పత్రాలను సేకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలోరెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి ఈఆర్వోలు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ఆర్డీవో శ్రీనివాసరావు, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓబులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

## గీతాంజలి..లో వినాయక చవితి వేడుకలు




వినుకొండ,ఆగస్టు26 ,ప్రభాతవార్త: స్థానిక గీతాంజలి స్కూల్ నందు వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణపతి రూపంలో చేసిన మానవహారం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ప్రిన్సిపల్ టి. కృష్ణవేణి మాట్లాడుతూ చిన్నారులకు ఎంతో ఇష్టమైన పండుగల్లో వినాయక చవితి ప్రత్యేకమైందని చెప్పారు. మట్టి వినాయక విగ్రహాలతో ప్రతి ఒక్కరు పండగను ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్‌డిఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్26, ప్రభాతవార్త: వర్సిటీలో నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌డిఎస్‌ఎఫ్) విద్యార్థి సంఘం 2025-26 విద్యా సంవత్సరానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.దుర్గా ప్రసాద్, ఉపాధ్యక్షునిగా ఎల్.రఘువంశ ప్రసాద్, కార్యదర్శిగా జి.ప్రశాంత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.లోకేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.శ్యాం సుందర్, కోశాధికారిగా ఆర్.కావ్యలతో పాటు మరొక 13మందిని కమిటీలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, విద్యతో పాటుగా నైపుణ్యాలు పెంచుకోనేందుకు ప్రత్యేక సెల్, కోర్సు పూర్తియిన వారికి వెంటనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులతో చర్చించి విద్యార్థుల సంక్షేమం కోసం కృషిచేస్తామని పేర్కొన్నారు.

## మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్26, ప్రభాతవార్త: వర్సిటీ వద్ద సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ అండ్ ఇకలాజికల్ డెవలప్‌మెంట్ (సీడ్), పర్యావరణ శాస్త్ర విభాగంలు సంయుక్తంగా మంగళవారం మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరణలో భాగంగా ప్రతీ ఒక్కరు సమాజహితం కోరాలని అందుకు ఇటువంటి సందర్భాల్లో పర్యావరణ హానీ జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జి వీసి ఆచార్య



కె.గంగాధరరావు పిలుపునిచ్చారు. మద్యాహ్నం వర్సిటీ మెయిన్‌గేట్ వద్ద ఉద్యోగులకు, పరిశోధకులకు, విద్యార్థులకు వీసి గంగాధరరావు, ఆచార్య వివిఎస్.స్వామిలు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు మట్టి ప్రతిమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిఇ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఆచార్య వి.తులసీదాస్, డాక్టర్ కె.శశిధర్, డాక్టర్ యం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలో స్కిల్ సెంటర్ ఏర్పాటుపై ఎంఓయు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్26, ప్రభాతవార్త: వర్సిటీలోని వాణిజ్య, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, నిర్మాణ్ సంస్థల మద్య స్కిల్ సెంటర్ ఏర్పాటుపై మంగళవారం అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. ఇన్‌చార్జి వీసి ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, నిర్మాణ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ హరీష్‌కుమార్ సిరపు, శాంతి కుమార్ చిలుములలు ఎంఓయు పత్రాలు మార్చుకున్నారు. ఈసందర్భంగా వీసి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు, పరిశ్రమలకు అనుగుణంగా ప్రాయోగిక జ్ఞానం, నైపుణ్యాలు అందించేందుకు



వర్సిటీ కట్టుబడి ఉందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలతో విద్యార్థులకు ప్రపంచస్థాయి అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. నిర్మాణ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ హరీష్‌కుమార్ సిరపు, శాంతి కుమార్ చిలుములలు మాట్లాడుతూ ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు పెట్టుబడి రంగంలో కొత్త అవకాశాలు తెరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడులు, ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాల సలహాదారు డాక్టర్ రవి వేమూరు మాట్లాడుతూ గ్లోబల్ పోటీతత్వానికి కావలసిన నైపుణ్యాబివృద్ధి ప్రాధాన్యతలను వివరించారు. విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సాదారణ తరగతులకు అధనంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో శిక్షణ కొనసాగుతుందన్నారు. విద్యా వ్యవస్థ, పరిశ్రమ అవసరాలకు మద్యగల అంతరాన్ని తగ్గించడంలో ఈ తరహాశిక్షణలు కీలకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఆచార్య బట్టు నాగరాజు, ఆచార్య వి.తులసీదాసు, ఆచార్య పూర్ణచంద్రరావు, విభాగం అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## పొగాకు కొనుగోళ్లు నిలిపివేతపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

**-దారి ఆక్రమించి మహిళపై దౌర్జన్యం**

**-అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**

**-ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ పెద్దిబోయిన వాణి వెంకట శివ ప్రసాద్, ఏపీ టైలర్స్ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ ఆకాశపు స్వామి**

గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, ఆగస్టు 26: ప్రకాశం జిల్లా పామూరు మండలం కోడిగుంపుల గ్రామానికి చెందిన కోప్పల్లి నాగేశ్వరరావు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామంలో కౌలుకు నల్ల బర్లీ పొగాకు సాగు చేశాను. ప్రైవేటు కంపెనీ వారు ధర తగ్గించి తక్కువకు కొనుగోలు చేసి మోసం చేశారు. పొగాకు అమ్మకం జరిగి దాదాపు రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు తమకు రావాల్సిన డబ్బును ఇవ్వలేదు. తనతో పాటు తమ గ్రామంలో అనేక మంది



రైతులది ఇదే పరిస్థితి. పామూరు మండలంలో దాదాపు వెయ్యి క్వింటాల వరకు పొగాకు నిల్వలు ఉన్నాయి. కావున తమయందు దయవుంచి పొగాకు నిల్వలు కొనుగోలు చేయాలని అలాగే కొనుగోలు అయినా వాటికి నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని నేతలు ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ పెద్దిబోయిన వాణి వెంకట శివ ప్రసాద్, ఏపీ టైలర్స్ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ ఆకాశపు స్వామిలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం వీరారఘవునికోట గ్రామానికి చెందిన పుటికలపూడి జ్యోతి గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తన తండ్రి కుంభగిరి పోలయ్యకు ఖాతా నం.773, సర్వే నం.243/1లో 0.94 సెంట్ల భూమి నివాస స్థలంగా ఉంది. అందులో పాటిబండ్ల రవీంద్రబాబు అనువారికి 2008వ సంవత్సరంలో రూ.0.87 1/2 సెంట్లు స్థలం అమ్మాడు. మిగిలిన స్థలాన్ని ఇరువురికి జాయింట్ హక్కుగా ఉమ్మడి దారి వదులుకోవాలని లిఖితపూర్వకంగా నిర్ణయించుకున్నారు. మిగిలిన స్థలాన్ని 2024లో పంగా చెన్నపనాయుడు కొనుగోలు చేశాడు. ఆ ఉమ్మడి దారికి అతనికి సంబంధం లేదు. మార్చి 2025లో పంగా చెన్నపనాయుడు 30 40 ట్రక్కుల మట్టి వేసి దారిని మూసివేశారు.

ఈ విషయమై తహశీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేయగా ఏప్రిల్ 23, 2025న సర్వే సిబ్బంది కొలతలకు వచ్చినప్పుడు వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో చెన్నపనాయుడు, అతని అన్న చిన బ్రహ్మయ్యలు గొడవకు దిగారు. తన తండ్రిపై దాడి చేసేందుకు యత్నించారు. తనను అసభ్యకరంగా తాకి దుర్భాషలాడుతూ బెదిరించారు. వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం పెనుగుదురుపాడు గ్రామానికి చెందిన బడుగు మానస గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామానికి చెందిన జొన్నలగడ్డ మేసయ్య పెద్ద కుమారుడితో 25.02.2022న వివాహం జరిగింది. రూ.1.80 లక్షల నగదు కట్నం, ఉంగరం, విలువైన సామాన్లు ఇచ్చాం. పెళ్లి తర్వాత కేవలం మూడు నెలలు మాత్రమే కలిసి నివసించాక తన భర్త మరో మహిళతో ఫోన్ ద్వారా పరిచయం పెంచుకుని ఆమె దగ్గరే ఉంటున్నాడు. అత్తమామలు దీనిని సమర్థిస్తూ తన భర్తకు వత్తాసు పలుకుతున్నారు.

గ్రామ పెద్దలకు వివరించినా వారిని కూడా ఎదిరించారు. తమ సమస్యపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదు. తమయందు దయవుంచి వారిపై చర్యలు తీసుకొని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మెగా డీఎస్సీతో యువత కల నిజం చేసిన కూటమి ప్రభుత్వం

ఔగుంటూరు క్రైమ్,ఆగష్టు 26,ప్రభాతవార్త : ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి,యువత కలలను నిజం చేసిందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేని 16,347టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి వేలాది మంది యువతకు ఉపాధి కల్పించామన్నారు.ఎసీ ్స,ఎస్టీ,బిసి,ఈడబ్ల్యూఎస్,దివ్యాంగులకు వయస్సు మినహాయింపు ఇచ్చి అండగా నిలిచామని,జగన్‌రెడ్డి పాలనలో 5ఏళ్ళు ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వకపోగా,చివర్లో కేవలం 6,100పోస్టులతో యువతను మోసం చేశాడు.టెట్,డిఎస్సీ ్స కలపి నోటిఫికేషన్ ఇచ్చి గందరగోళం సృష్టించాడు.ఆయన పాలనలో నాణ్యమైన విద్యలో రాష్ట్రం 3వ స్థానం నుంచి 19వ స్థానానికి పడిపోయిందన్నారు.ఇక ఉపాధ్యాయులపై జగన్ చేసిన అన్యాయాలు మర్చిపోలేనివని,పీఆర్సీ కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించడం,మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించడం,మరుగుదొడ్లు శుభ్రం చేయించడం వంటి అవమానకర నిర్ణయాలు తీసుకున్నాడని,పెయింట్లు,యాడ్స్‌తో విద్యారంగం మారదని,నిజమైన మార్పు ఉపాధ్యాయ నియామకాలతోనే సాధ్యమని,కూటమి ప్రభుత్వం నిరూపిస్తుందన్నారు.యువత కల నిజం చేస్తున్న నాయకుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు.



## శ్రీపూజితలో పర్యావరణహిత "వినాయక చవితి"

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : శ్రీపూజిత స్కూల్ విద్యార్థులు పర్యావరణ హిత వినాయక చవితిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.స్కూల్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని ప్రజలకు చైతన్యం కల్పించారు.ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ మన సంస్కృతిలో వినాయక చవితి పవిత్రమైన పండుగ,కానీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు



నీటిలో కరగక పర్యావరణాన్ని కలుషితం చేస్తాయని,మన ఆరోగ్యంపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు.విద్యార్థులు పాఠశాల్లో మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా తయారు చేశారు.విద్యార్థులు నినాదాలు చేస్తూ,బోర్డులు ప్రదర్శిస్తూ ముందుకు సాగగా ప్రజలు వారిని అభినందించారు.

## మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కళాశాల్లో జరిగిన కార్యక్రమానికి బాపూజి విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు అధ్యక్షత వహించి మాట్లాడుతూ భూమి మానవులకే కాకుండా లక్షలాది జీవరాశులకు నిలయం,కానీ మానవులు తమ స్వేచ్ఛా సంతోషాలకు ఆనందానికై భూమికి అనేక విధాలుగా హాని కల్పిస్తున్నారు.తద్వారా వరదలు,కాలుష్యం,వాతావరణంలో పెనుమార్పులు,గ్లోబల్ వార్మింగ్ వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాము.చవితి రోజు




మట్టితో చేసిన ప్రతిమలను విద్యార్థులకు అందించాలని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం తీసుకున్న నిర్ణయం ఎంతో హర్షించదగినదని అన్నారు.ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మీరు మాత్రే కాక మీ ఇంటి చుట్టు ప్రక్కల వారు కూడా మట్టి ప్రతిమలను ఉపయోగించేటట్లు చూడటం ద్వారా పర్యావరణాన్ని కాపాడేవారుగా ఉండాలన్నారు.బాపూజి విద్యాసంస్థల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు చేతుల మీదుగా విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను అందించారు.కార్యక్రమం సజావుగా సాగునట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీధర్,వై.చంద్రశేఖర్లు పర్యవేక్షించారు.కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వినాయక చవితి అందరి జీవితాల్లో ఆరోగ్యం, సంపద నింపాలి

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : వినాయక చవితి పండుగ అందరి జీవితాల్లో ఆరోగ్యం సంపద నింపాలని,శాంతి,సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆధ్యాత్మిక,సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలంతా ఐకమత్యం,ఆనందంతో గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏసుబాబు మాదిగ ఆకాంక్షించారు.మన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తూ,ప్రతి వ్యక్తి,ప్రతిరైతు,ప్రతి కూలీ,ప్రతి కుటుంబం సంతోషంగా జీవించేలా ఆ విఘ్నేశ్వరుడి దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు.

## "యూరేకా ఆర్‌విఆర్ జేసి" పోటీలు

గుంటూరు విద్య,ఆగష్టు 26,ప్రభాతవార్త : భారతదేశాన్ని ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వాములవ్వాలని ప్రముఖ సాంకేతిక రంగ నిపుణులు పవన్‌కుమార్ రాయవరపు సూచించారు.త్వరలో ఐఐటి బొంబాయిలో జరగనున్న యూరేకా-2025 నేషనల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ చాలెంజ్ పోటీలకు



విద్యార్థులను సిద్ధం చేయడానికి కళాశాల ఈడి సెల్ మరియు ఆర్‌విఆర్ జేసి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ కొత్త స్టార్టప్ ఆలోచనలను,వాటి ఆచరణాత్మక ప్రయోజనాలను,సమాజంపై ప్రభావాన్ని వివరించారు.ఉత్తమ ప్రదర్శన చేసిన జట్లకు బహుమతులు అందజేశారు.సాంకేతికత,సృజనాత్మక ఆలోచనలు,స్టార్టప్‌లు దేశాభివృద్ధికి నాంది పలికే మార్గం అని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ కె. ప్రకటన ద్వారా పేర్కొన్నారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్,కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు,ఐటిబిఐ ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం.వి.పి.చంద్రశేఖరరావు,ఆర్‌జేఈ నెస్ట్ సీఈవో ఆర్.హాఫీజ్ భాషా,కళాశాల ఈడి సెల్ కన్వీనర్ డాక్టర్ సజ్జా రాధికా,అధ్యాపకబృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజకీయ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలు జగన్‌కు లేవు : రాజమండ్రి సమావేశంలో ప్రత్తిపాటి

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: రాజమండ్రి పార్లమెంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సహా, అనుబంధ సంఘాలు, ఇతర కీలక పదవుల భర్తీపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.



పార్టీ అధినాయకత్వం నియమించిన త్రిసభ్య కమిటిలో సభ్యుడైన మంత్రి కె పార్ధసారధి, ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ప్రత్తిపాటి మంగళవారం రాజమండ్రి పార్టీ కార్యాలయంలో టిడిపి శ్రేణులతో కీలక సమావేశం నిర్వహించారు. వినాయక చవితి తరువాత పార్టీ అధిష్టానం తన నిర్ణయాలు వెలువరిస్తుందని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 17 అనుబంధ సంఘాలు, 54 కులసంఘాలకు నూతన నియామకాలు ఉంటాయని అన్నారు. పార్టీ కోసం కష్టపడినవారికి న్యాయం చేస్తూ, పదవులకు వన్నె తెచ్చేవారిని పార్టీ గౌరవం పెంచి ప్రజలతో సేవాభావంతో వ్యవహరించి పార్టీ ప్రతిష్ట పెంచేవారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రత్తిపాటి తెలిపారు.

**ప్రభుత్వ పథకాలపై ప్రజలలో దురభిప్రాయం కలిగించాలన్నదే జగన్ ఆలోచన**

జగన్ అధికారంలోకి వస్తూనే కార్యకలాపాలు నిర్వహించే ప్రజావేదికను కూల్చేసి, విధ్వంస పాలనకు శ్రీకారం చుట్టాడని ప్రత్తిపాటి తెలిపారు. తన అనాలోచన విధానాలతో రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసాడని అన్నారు. మోదీ, పవన్‌కళ్యాణ్‌లు చంద్రబాబుకు అండగా ఉండి రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తుంటే, జగన్, వైసిపి నేతలు నష్టం చేయడంపై ఆలోచిస్తున్నారు. చంద్రబాబు తనకున్న విశ్వసనీయత, అనుభవం, దూరదృష్టి, పట్టుదలతో కేంద్ర ప్రభుత్వం, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సహాయసహకారాలతో సూపర్-6ను విజయవంతంగా అమలు చేశారని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రజలకు శుభం కలగాలి

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: గణనాధుని, పార్వతీపుత్రుడు, విఘ్నాలను హరించే విఘ్నేశ్వరుని అనుగ్రహం, చల్లని చూపులతో ప్రజలకు శుభం కలగాలని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వినాయకచవితి పర్వదినం మనందరికి సుదినం, ఏడాదిలో అతి ప్రధాన పండుగైన వినాయకచవితిని ప్రజలందరూ పర్యావరణహితంగా జరుపుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పాలవెల్లితో అలంకరించిన పార్వతి సుతిని పూజావిధానంలో ఏన్నో ఆరోగ్య రహస్యాలున్నాయని, ఔషదగుణాలున్న పత్రికతో సంకటహరమూర్తిని పూజించడం వల్ల ఆరోగ్యంతోపాటు ఐశ్వర్యసిద్ధి కలుగుతాయని ప్రత్తిపాటి అన్నారు. గణేషుని మండపాలకు ఉచిత విద్యుత్ అందచేయాలన్న నిర్ణయంతో వినాయకుని మందిరాలతోపాటు ఊరూర ఏర్పాటుచేసిన వినాయక విగ్రహ పందిళ్లు, చుట్టుపక్కల పరిసరాలు, విద్యుత్ వెలుగులతో కళకళలాడుతాయని అన్నారు. శృతిమించిన ధ్వని, ధ్వని కాలుష్యం, బాణాసంచా కాల్పులతో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో లంబోదరుని పూజించి, తాము చేపట్టే ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆ గణేషుని ప్రార్థిస్తూ, నియోజకవర్గప్రజలకు, టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులకు, అభిమానులకు భక్తిపూర్వక వినాయక చతుర్ది శుభాకంక్షలు ప్రత్తిపాటి తెలియచేశారు.

## నియోజకవర్గంలోని అన్ని వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ : విద్యుత్‌శాఖ ఈఈ

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: వినాయకచవితి పండుగ పురస్కరించుకొని పట్టణంలో, గ్రామాలలో భక్తులు ఏర్పాటుచేసుకున్న వినాయక మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వనుందని విద్యుత్‌శాఖ ఈఈ వై ఏడుకొండలు మంగళవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు.



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ఉచిత విద్యుత్‌ను కమిటి నిర్వాహకులు నడుచుకోవాలన్నారు. పందిళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చేటువంటి సూర్యాఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పట్టణంలో ఏర్పాటుచేస్తున్న స్మార్ట్‌మీటర్లు చాలా పారదర్శకంగా పనిచేస్తాయని, మీటర్ రీడింగ్‌లో ఎటువంటి తేడా ఉండదని, విద్యుత్ వినియోగదారులు అనవసరమైన అపోహలకు తావివ్వకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటులో విద్యుత్ శాఖకు సహకారం అందించాలని ఆయన తెలిపారు. గృహవిద్యుత్ అదనపు లోడుకు సంబందించి 50శాతం రాయితీతో డిసెంబర్ 31వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని అన్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి 50 కనెక్షన్‌లకు ఒక ట్రాన్స్‌ఫారమ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ ఏడుకొండలు తెలిపారు. వినియోగదారులు సకాలంలో బకాయిలు చెల్లించిన యెడల మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఎడిఈ ఆర్ అశోక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: మండలంలోని రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మరియు డిఎటిసి కో ఆర్డినేటర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కంది మరియు మొక్కజొన్న వేసే రైతులు ట్రైకోడెర్మాతో విత్తనశుద్ధి చేసుకున్నట్లయితే వేరుకుళ్ళు, తెగులును నివారించవచ్చునని తెలిపారు. చివరి దుక్కిలోనే భాస్వరం వేయాలని, తరువాత వేసినా పంట తీసుకోదని, ఖర్చులవ్వు ఏమీ ఉపయోగం ఉండదని తెలిపారు. రైతులందరూ కూడా పంట నమోదు చేయించుకోవాలని, అప్పుడే ప్రభుత్వం ఇచ్చే పథకాలకు అర్హులవుతారని తెలిపారు. కౌలు చేయు రైతులు కూడా కౌలు గుర్తింపు కార్డులు పొందాలని, ఆ పంటలను నమోదు చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్ తెలిపారు. మండలంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, పిఏసిఎస్ ద్వారా కూడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి సిహెచ్ సరిత తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో తహసీల్దార్, వ్యవసాయ అధికారి, ఎస్‌హెచ్‌ఓ టీమ్‌గా ఏర్పడి ప్రైవేటు ఎరువుల దుకాణాలు, గొడౌన్లను తనిఖీ చేసి ఎరువులను రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. ఎవరైనా ఎరువుల యందుకొరత కలిగే అధిక ధరకు అమ్మినట్లయితే అలా చేసినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ షేక్ మహ్మద్ హుస్సేన్ తెలిపారు. రైతులు కూడా ఆలోచించి తమ పంటకు అవసరమైన మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు.



## గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో షరాబ్ బజారులో రూ50లక్షల అమెరికన్ డైమండ్స్‌తో తీర్చి దిద్దిన గణపతి విగ్రహం

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: పట్టణంలోని షరాబ్‌బజార్ గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ఎంతో ఘనంగా గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం గణపతి విగ్రహాన్ని రూ 50లక్షల స్వరోస్కి అమెరికన్ డైమండ్స్‌తో సర్వాంగ సుందరంగా 11 అడుగుల ఎత్తున హైదరాబాద్, కలకత్తా, తంజావూరు శిల్పులతో 15 రోజులు, 9మంది నైపుణ్యం కలిగిన కళాకారులతో తీర్చిదిద్దారు. ప్రతి సంవత్సరం విన్నూత్నంగా స్వామివారికి గోల్డెన్ యూత్ స్వామివారి సేవ చేసుకుంటున్నారు. స్వామివారి పందిరిలో భక్తుల కోసం రూ 200 రూపాయిల టికెట్టు మొదటి బహుమతిగా మారుతీ ఆల్టోకారు. రెండవ బహుమతిగా ఎలక్ట్రిక్ బైక్, మూడవ బహుమతిగా శ్యాంసంగ్ రిఫ్రిజిరేటర్ అందచేయనున్నట్లు కమిటి తెలిపింది. ఈ కార్యక్రమాలను మొదటినుండి పొట్టి వెంకట శివ రత్నబాబు కన్వీనర్‌గా ఉంటూ, మట్టా హరి, చిన్నివాసు, పొట్టి బదరీనారాయణ, అర్వపల్లి వీరాంజనేయులు, పవన్, సాయి, సురేష్, రాఘవ, సీతారామయ్య, ఊటుకూరి శ్రీను, గ్రంధి సందీప్, మరియు ఎంతోమంది భక్తుల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నారు. సుమారు 9నుంచి 10లక్షల రూపాయల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు నిర్వహిస్తున్నారు.



## వైయంసిపి ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదానం

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: వైయంసిపి ఆధ్వర్యంలో మంగళవారం వీరారోడ్‌లో ఉన్న బాపూజీ వృద్ధుల ఆశ్రమంలో మదర్‌థెరిస్సా జయంతిని పురస్కరించుకొని ఆదివిధంగా ఆ సంస్థ జిల్లా ప్రతినిధి చుక్కా విన్సెంట్‌పాల్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్‌సియం చర్చి ఫాదర్ థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న అన్న మదర్‌థెరిస్సా సూక్తి ప్రకారం మానవసేవే పరమావధిగా వైయంసిపి పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విన్సెంట్‌పాల్ కుటుంబసభ్యులతో పాటు కె రామ్మోహన్, న్యాయవాది దాసరి చిట్టిబాబు, పోలిశెట్టి నాగేశ్వరరావు, ఎ ఫణికుమార్, దార్ల బుజ్జిబాబు, ఆశ్రమ నిర్వాహకులు మురికిపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మెగా డిఎస్సీని కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించింది : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం పారదర్శకంగా మెగా డిఎస్సీని నిర్వహించిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.



పారదర్శకంగా 16,347 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. వైకాపా మాత్రం కుట్రలు చేస్తుందన్నారు. ప్రభుత్వ విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి జరుగుతుందన్నారు. 14 ఏళ్ళ పాటు ముఖ్యమంత్రి హోదాలో ఒక లక్షా 80 వేల మందికి చంద్రబాబునాయుడు డిఎస్సీ పోస్టులు ఇచ్చారన్నారు. జూనియర్ కళాశాలలో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరించామన్నారు. 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలో రెండు లక్షల 30 వేల ఉద్యోగాలు ఉండగా వైకాపా నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఎటువంటి ఉద్యోగాలు ఇవ్వలేదని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలియజేశారు.

## టెంకాయలతో గణనాధుని అలంకరణ

సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : పట్టణంలోని 22వ వార్డులో 1600 టెంకాలతో సర్వసిద్ధి వినాయకుని విగ్రహాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. నాగన్నకుంట యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గణనాధుని విగ్రహం 21 అడుగుల ఎత్తు ఉన్నట్లు అధ్యక్షులు వీరాంజనేయులు తెలిపారు. కమిటీ సభ్యులు పులిబండ్ల వెంకటనారాయణ, సయ్యద్ ముస్తఫా, ఒగిబోయిన నీలేంద్ర, ఆముదాల శ్రీకాంత్, మల్లెం శివశంకర్, నరసింహస్వామి, హనుమంతు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.



## న్యాయవాదుల నిరసన



సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : బాపట్ల న్యాయవాది టి.విజయ్‌కుమార్‌ను బాపట్ల పోలీసులు ధూషించడం, అక్రమంగా నిర్బంధించడాన్ని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మంగళవారం ఖండించింది. ఈ సందర్భంగా నాయకులు గంగూరి అజయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయదేవత విగ్రహం వద్ద తమ నిరసనను తెలియజేశారు. విధులను బహిష్కరించి విజయ్‌కుమార్‌కు సంఘీభావం తెలిపారు. బాపట్ల సి.ఐ.రాంబాబు, ఎస్.ఐ.విజయ్‌కుమార్‌లు న్యాయవాదిని అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు చిన్నం మణిబాబు, ఎం.కోటేశ్వరమ్మ, దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, సయ్యద్ అబ్దుల్లా, దివ్వెల శ్రీనివాసరావు, శేషయ్య, విజయ్‌కుమార్, సురేష్, ఏడుకొండలు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో మండపాల కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు

సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డిఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో మంగళవారం వినాయకచవితి మండపాల నిర్వహణ కమిటీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సి.ఐ. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పట్టణంలో గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నామన్నారు.




12 అడుగులకు మించి విగ్రహాలను పెట్టవద్దన్నారు. మైనర్లు మండపాల వద్ద తల్లిదండ్రుల సమక్షంలో ఉండాలన్నారు. విద్యుత్ ను ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. డిజే సౌండ్ ఎక్కువగా పెట్టవద్దన్నారు. తొమ్మిది గంటల తర్వాత కార్యక్రమాలు నిలిపి వేయాలన్నారు. పోలీస్, రెవిన్యూ, మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.


## ముప్పాళ్లలో రామలింగారెడ్డి ఆత్మహత్యపై కలెక్టర్ వివరణ



సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన రామలింగారెడ్డి ఆత్మహత్యకు కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలే కారణమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పింఛన్ నిలిపివేయడం వలన ఆయన చనిపోయాడనేది అవాస్తవం అన్నారు. పింఛన్ అర్హతపై కేవలం నోటీసు మాత్రమే ఇచ్చామన్నారు. వ్యక్తిగతంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో ఆయనకు నోటీసు ఇచ్చామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సూచనతో ఎంపిడివో వద్ద ఆయన తిరిగి అప్పీలు కూడా చేసుకున్నారని తెలియజేశారు.

## న్యాయ విచారణ జరపాలని వైకాపా నాయకుల వినతి

సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పల్నాడు జిల్లా వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిలు రామలింగారెడ్డి మృతిపై న్యాయ విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. పెన్షన్ తొలగించారని మనస్థాపంతో తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో చెట్టుకు ఉరి వేసుకొని రామలింగారెడ్డి మృతిచెందారన్నారు. మృతుని భార్య రామలింగమ్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ పెన్షన్ తొలగించడంతో భోజనం కూడా సరిగా చేయడం లేదన్నారు. ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్ళి తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో బలవన్మరణానికి పాల్పడ్డారన్నారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డిలు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రామలింగారెడ్డి పెన్షన్ తీసుకుంటున్నట్లు తెలిపారు. కక్ష్యసాధింపులో భాగంగానే పెన్షన్ నిలిపివేశారని తెలిపారు.



## ఎరువుల దుకాణాలలో తనిఖీలు

సత్తెనపల్లి, ఆగస్టు 26 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి వి.శ్రీనివాసరెడ్డి, తహశీల్దార్ చక్రవర్తి, ఎస్.ఐ. శ్రీనివాసరావులు ఎరువుల దుకాణాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. డీలర్లు అందరూ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. కృత్రియ కొరతను సృష్టించవద్దన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పక బిల్లులు ఇవ్వాలన్నారు. ఈపాస్ మిషన్ ద్వారా అమ్మకాలు జరపాలని సూచించారు. స్టాక్ రికార్డుల్లోనూ, షాపులలోనూ సక్రమంగా ఉండాలని అధికారులు వ్యాపారులకు సూచించారు.

## సేవే మార్గంగా విశ్వమాతగా మదర్ థెరిస్సా



పెదకూరపాడు, ఆగస్టు 26 ప్రభాతవార్త : ప్రేమ త్యాగం అనురాగం సేవకు ప్రతి రూపం మదర్ థెరిస్సా అని హెచ్ఎం కె.వి.రమణ అన్నారు. మదర్‌థెరిస్సా పుట్టినరోజు సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్‌కత్తా దేశంలో మురికివాడలో కుష్ఠు రోగులకు, హెచ్ఐవి రోగులకు ఆమె ఎంతో సేవలు అందించారని కొనియాడారు. విశ్వమాతగా పేరుపొందిన సేవ మూర్తి మదర్‌థెరిస్సా అని కొనియాడారు.

## మదర్‌థెరిస్సా సేవలు ప్రపంచానికే ఆదర్శం : జాస్తి వీరాంజనేయులు

అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త : పేదవారి పట్ల ప్రేమ, కరుణ, దయ, జాలి చూపిన గొప్ప మానవతామూర్తి నోబెల్ అవార్డు గ్రహీత, భారతరత్న మదర్‌థెరిస్సా 115వ జయంతి వేడుకలను గుంటూరులోని భరతపేట 3వ లైన్‌లోని సదన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అఖిలభారత పంచాయితీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, సేవ సదన్ అధ్యక్షులు, అన్నదాన సమాజం మాజీ ఛైర్మన్ మిరియాల గోపికుమార్‌లు మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచానికే ఆదర్శవంతురాలైన మదర్‌థెరిస్సాని స్మరణకు తెచ్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఎటువంటి తారతమ్యాలు, వ్యత్యాసాలు లేకుండా ప్రజలకు సేవలందించారని కొనియాడారు. పేదవాళ్ళు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నవారు, ఎయిడ్స్, కుష్టు రోగులు మంచానికే పరిమితమైన రోగులకు మదర్‌థెరిస్సా మానవతా దృక్పథంతో నిస్వార్థ సేవలందించారని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు మిరియాల గోపికుమార్, భారతి సంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు, యం.వెంకటస్వామి, కంబాల బాబురావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, శివప్రసాద్, అబ్దుల్ ఖాదర్, గోలి సత్యనారాయణ, డి.రాజశేఖర్, వివిబి ఆచారి, అన్నం రమేష్, చింతా వాసు, కొండ కోటిరెడ్డి, ఆవుల రాము తదితరులు మాతృమూర్తి మదర్‌థెరిస్సాకు ఘన నివాళులర్పించారు.



## జలజీవన్ మిషన్ పనులను పరిశీలించిన అధికారులు

అమరావతి, ఆగస్టు 26 ప్రభాతవార్త : జలజీవన్ మిషన్ కింద జరిగిన పనులను సోమవారం డిపిఓ నాగేశ్వరరావు నాయక్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జల జీవన్ మిషన్ మానిటరింగ్ కమిటీ టీములోని డిపిఓ, ఎండివో, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ తనిఖీ చేశారు. పెదకూరపాడులోని పనులను తనిఖీ చేశారు. నీరు వస్తుందా లేదా అని గృహాలకు వెళ్ళి పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎండివో సోమయాజులు, డి.ఈ.శ్రీనివాసరావు, ఈవోపిఆర్‌డి శరత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## 30న జరగనున్న సంచారజాతుల బహిరంగసభ ఏర్పాట్లును పరిశీలించిన బిజెపి నాయకుడు అన్నం శ్రీనివాసరావు

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: ఈనెల 30వ తేదిన విజయవాడ పట్టణంలోని నోవాటెల్ పక్కన ఉన్న సంచారజాతుల బహిరంగసభ సభా ప్రాంగణాన్ని, అక్కడ జరుగుతున్న పనులను రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు అన్నం శ్రీనివాసరావు, బిట్రా శివన్నారాయణ, పట్నాయక్ ఓబిసి ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్రకుమార్ యాదవ్, తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జాతీయ బీసి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ



చిలకలూరిపేటటౌన్,ఆగస్టు26,ప్రభాతవార్త: పట్టణంలోని పాటిమీద ఉన్న అంకమ్మతల్లీ పోతురాజు దేవస్థానంలో మంగళవారం వినాయక చవితి పండుగ పురస్కరించుకొని 500 మట్టి విగ్రహాలను జాతీయ బీసి సంక్షేమ సంఘం జిల్లా లీగల్ సర్వీస్ ఛైర్మన్ పమిడి రాజకుమార్, టార్గెట్ బాయ్స్ ఆధ్వర్యంలో నక్కా నరసింహ అధ్యక్షతన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు మాదాసు పృధ్విరాజ్‌సాయి, వి పోతురాజు, కె వాసు, నక్కా వెంకటేష్, చొప్పా వీరనారాయణ, గంజినబోయిన ఈశ్వర్, పూజారి అన్నపరెడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్‌లో సింగిల్ యూసేజీ కవర్ల స్వాధీనం

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణలో బాగంగా ప్లాస్టిక్ వాడకం నిరోదకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలను అమలుపరిచేదానిలో బాగంగా మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు ఆదేశాల మేరకు మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ రమణరావు, మున్సిపల్ సిబ్బంది ప్లాసిక్ వాడకం నిరోధకానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తొలుత రైతు బజారులో సింగిల్ యూసేజి ప్లాస్టిక్ కవర్లను, ప్లాసిక్ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అవి వినియోగిస్తున్న వ్యాపారాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణరావు మాట్లాడుతూ ప్లాసిక్ కవర్లు అమ్మకం నిర్వహించే హోల్‌సెల్, రిటైల్ వ్యాపారులు జ్యూట్‌బ్యాగ్‌లు అమ్మకం జరపాలని తద్వారి ప్లాస్టిక్ వాడకం నివారణకు మార్గం సఫలం అవుతుందని సూచించారు. పండ్లు, కూరగాయాలు, మాంసం హోటళ్లు, టిఫిన్ హోటల్ నిర్వాహకులు కూడా ప్లాస్లిక్ బ్యాగులు వాడటాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ అధికారి షేక్ ఖాజా, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## పాతబ్యారన్ నగర్ వ్యాపారస్తులతో చర్చలు జరిపిన మున్సిపల్, యార్డు ఛైర్మన్‌లో రఫాని, కరిముల్లా

చిలకలూరిపేట,ఆగస్టు26,ప్రభాతవార్త: మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని సిఆర్ కాలనీ మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత బ్యార్ని నగర్ వ్యాపారస్తులతో రోడ్డు వెడల్పు చేయటానికి, మున్సిపల్ కాలువల వెనుక దుకాణాలు ఉండేటట్టు చేయడానికి వారితో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లాలు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు తమ సమస్యలను ఛైర్మన్ల దృష్టికి తీసుకువచ్చారు. ఛైర్మన్‌లు ఇద్దరూ శాసనసభ్యుడు ప్రత్తిపాటితో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.



## గ్రామాలలో గణపతి నవరాత్రుల సందడి

యడ్లపాడు, అగస్టు 26, ప్రభాతవార్త : గణపతి నవరాత్రుల సందడి గ్రామాలలో ప్రారంభం అయింది. ఇప్పటికే ఏర్పాటు చేయదలచిన ప్రాంతాలను గుర్తించి ఎవరికివారు అధునాతన పద్దతిలో వర్షం వచ్చినా గణనాధులు తడవకుండా పాలిధిన్ పేపర్లతో కొట్టదిట్టమైన విధంగా ఏర్పాటుచేస్తున్నారు. బుధవారం గణపతి మహోత్సవాలకు సిద్దంగా ఇప్పటికే పలు గ్రామాలలో పందిర్లు పూర్తిచేసి వారికి కావలసిన సైజు అడుగులలో విగ్రహాల కొనుగోలు కార్యక్రమం నిర్వహించుతున్నారు. వీరి సందడిని బట్టే అమ్మకందారులు విగ్రహాల ధరలు కూడా భారీగానే పలుకుతున్నారని అంటున్నారు కొనుగోలుదారులు. ఎంతున్నా తప్పనిసరిగా ఏర్పాటుకు సిద్దపడ్డారు కాబట్టి వారికితగిన విధంగా విగ్రహాలను ఎంచుకొని ఉదయం నుండి గ్రామాలకు తరలించుతున్నారు. మంగళవారం రాత్రికి పూర్తిస్దాయిలో విగ్రహాల ఏర్పాటుచేసి బుధవారం పూజకు వీరు సిద్దంగా ఉండేవిధంగా పనులు నిర్వహిస్తున్నారు. అయితే విగ్రహాల ఏర్పాటుకు స్దానిక పోలీసు ఉన్నతాధికారుల అనుమతులు కావాలంటూ తెలిపటంతో అనుమతులకోసం అర్జీలు అందజేస్తున్నారు.





## మిట్టపల్లిలో మొదటి సంవత్సరం ప్రారంభోత్సవ వేడుకలు

యడ్లపాడు, అగస్టు 26, ప్రభాతవార్త : మండల పరిధి బోయపాలెం గ్రామ సమీపంలో ఉన్న శ్రీ మిట్టపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో 2025=26విద్యా సంవత్సరానికి సంబంధించిన మొదటి సంవత్సరం ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ మరియు వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి కిశోర్ ముఖ్య అతిధులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్దులకు వారి తల్లి తండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్దులందరూ ఉన్నతమైన లక్ష్యాలను కలిగి ఉండాలని అందుకు కాలేజి పూర్తిగా సహకరిస్తుందన్నారు. ప్రతి విద్యార్ది క్రమం తప్పకుండా కళాశాలకు విచ్చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ట ఎన్ఎస్‌కె ప్రసాదరావు, వివిధ విభాగాధి పతులు, ఎవో శ్రీనివాసరావు, విద్యార్దిని, విద్యార్దులు పాల్గొన్నారు.




## తహశీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

రాజుపాలెం, ఆగస్టు 26 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మంగళవారం రాజుపాలెం మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయ భవనాన్ని, పరిసరాలను పరిశీలించారు. భవనం శిధిలావస్థకు చేరడంతో పాటు వర్షం కురిసిన సందర్భంలో నీరు కార్యాలయంలోకి వస్తుందనే సమాచారంతో పరిశీలించామన్నారు. త్వరలోనే భవనానికి నిధులు కేటాయించి మరమ్మత్తులు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహశీల్దార్ సరోజ, ఎంపిడివో సత్యనారాయణ ఉన్నారు.



## డిలైట్ ఫ్యూచర్ ఆర్గనైజేషన్ ద్వారా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

పెదకూరపాడు, ఆగస్టు 26 ప్రభాతవార్త : మండలంలోని బలుసుపాడు పాఠశాల నందు మంగళవారం విద్యార్థులకు "డిలైట్ ఫ్యూచర్ ఆర్గనైజేషన్" ద్వారా వేమవరపు రమేష్ - నినీషాలు 23 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, నోట్ బుక్స్, జామంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఆర్గనైజేషన్ ద్వారా ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ నల్లమేకల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులకు సేవా కార్యక్రమం నిర్వహించిన ఆర్గనైజేషన్ వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘంటా ప్రతాప్, మద్దినేని చెన్నారావు, నీటిపారుదల సంఘం సెక్రటరీ, 75 తాళ్ళూరు క్లస్టర్ సిఆర్‌ఎంటి శివ పాల్గొన్నారు.



## కౌలు రైతులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులును తీసుకోవాలి

కాకుమాను ఆగస్టు 26 (ప్రభాతవార్త): కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు రైతు గుర్తింపు కార్డులును తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.సుధాకర్ అన్నారు.మండల పరిధి కొండపాటూరు, బికే పాలెం,గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి నట్లు మండల వ్యవసాయ అధికారి వి.సుధాకర్ మంగళవారం తెలిపారు.



## నిర్మల ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవం

మంగళగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో ..ఉమెన్ సెల్, ఎన్ఎస్ఎస్ సెల్.. సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 26న అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు ..డాక్టర్ బొల్లినేని కీర్తి పాల్గొని విద్యార్థినీలకు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఆమె తన ప్రసంగంలో, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అపూర్వమని, మహిళా విద్యా విస్తరణతోనే సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వావలంబనతో పాటు కెరీర్ క్లారిటీ, కమిట్మెంట్, కాన్ఫిడెన్స్ అనే నాలుగు మూల సూత్రాలను ఆచరిస్తూ అబ్బాయిలు – అమ్మాయిలు ఇద్దరూ సమానంగా ఎదగాలని సూచించారు. సమానత్వ సమాజమే సౌహార్దం, సమతుల్యం మరియు అభివృద్ధికి బాటలు వేస్తుందని వివరించారు.కార్యక్రమాన్ని ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ రత్న మంజుల అధ్యక్షత వహించారు. ఈ ఈ కార్యక్రమంలో జ్యోతి,కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ..రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, అధ్యాపకులు, బి.ఫార్మసీ, ఫార్మాడి, డి.ఫార్మసీ విద్యార్థులు, అలాగే ఎన్ ఎస్ స్ జెండర్ ఈక్వాలిటీ క్లబ్ స్టూడెంట్ కోఆర్డినేటర్లు అక్సా సాత్విక, కె. హర్షవర్ధన, బి.సంజన, జి కీర్తి , కే కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యాసంస్థలకు ఐడీబీఐ బ్యాంక్ ఫర్నిచర్ వితరణ

మంగళగిరి, ఆగస్టు 26, ప్రభాతవార్త :మంగళగిరి న్యూ బ్యాంక్ కాలనీ కాండ్రు కమల మున్సిపల్ హైస్కూల్లో ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ సామాజిక భద్రత( సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాండ్రు కమల హైస్కూల్ తో పాటు వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్, వెంకటరెడ్డి పాలెం ఎంపీపీ పాఠశాలలకు సుమారు లక్షా 75 వేల రూపాయలు విలువైన బీరువాలు, టేబుళ్ళు, ర్యాకులు, కుర్చీలు అందజేశారు. ముఖ్య అతిథులుగా ఐడీబీఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సాయి కృష్ణ, మంగళగిరి, తాడేపల్లి మండలాల విద్యాశాఖ అధికారులు ఉషారాణి, నాగేశ్వరరావు హాజరయ్యారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ సాయి కృష్ణ చేతుల మీదుగా బీరువాలు, ఫర్నిచర్ ను ఆయా విద్యాసంస్థ ప్రతినిధులకు అందజేశారు. అనంతరం సాయి కృష్ణ మాట్లాడారు. బ్యాంక్ సామాజిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల భవిష్యత్తులను తీర్చిదిద్దే విద్యాలయాలకు ఉపయోగపడే ఫర్నిచర్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎంఈఓ లు ఉషారాణి, నాగేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంక్ అందించిన ఫర్నిచర్ తో విద్యాసంస్థలలో ఉన్న ఫర్నిచర్ కొరత కొంత వరకు తగ్గిందన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులకు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం నాగార్జున, బ్యాంక్ బ్రాంచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## పెదవడ్లపూడిలో రూ. 4,50,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మంగళగిరి, ఆగష్టు 26, ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి మండలం, పెదవడ్లపూడి కి చెందిన మునునూరి గోపాలరావు కు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) మంజురైంది. టీడీపీ నాయకులు బాధితుని ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఎల్వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్ కు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మాదల రమేష్ బాబు, అన్నే చంద్రశేఖర్,జాలాది సందీప్, మొద్దుకూరి రమేష్, బొర్రా శ్రీకాంత్,కొప్పాక ఓంకార్, గుంటూరు లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు



## కెఎల్‌యు లో స్కిల్ పలావర్ ప్రాజెక్టు ఆదారిత అభ్యాస హ్యాకథాన్

తాడేపల్లి,ఆగష్టు 26,ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని నైపుణ్యాభివృద్ధి విభాగం ద్వారా సిఎస్ఈ,ఈసిఈ,ఏఐ డిఎస్,సిఎస్ ఐటి,ఐటి విభాగాల్లోని బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం రూపొందించబడిన ప్రాజెక్టు ఆధారిత అభ్యాస చొరవ స్కిల్ పలావర్ కార్యక్రమం మొదటి దశను విజయవంతంగా ప్రారంభించినట్లు డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ తెలిపారు.స్కిల్ పలావరణ అనేది విద్యార్థుల్లో సీ వ్యయ-నిర్దేశిత అభ్యాసమన్నారు.కార్యక్రమాన్ని మూడు దశల విధానం ద్వారా రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు.మొదటిది లెర్నాథాన్-వాస్తవ ప్రపంచ సమస్య ప్రకటనలపై పరిశ్రమ నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్‌లు కాగా,రెండోది వర్చువల్ సమీక్షా-డొమైన్ నిపుణుల చేత ఇన్‌సెమిస్టర్ మూల్యాంకనం అని అన్నారు.మూడోది హ్యాకథాన్ ఓపెన్ హౌస్,తుది ఆన్‌సైట్ మూల్యాంకనంతోపాటు పరిష్కారాల ప్రదర్శన అని స్పష్టం చేశారు.ఈ హాకథాన్‌కు పరిశ్రమ నిపుణులు క్లౌడ్ క్యూ హాక్ థాన్ నిపుణులు రెస్మెడ్ బెంగళూరు నుండి సీనియర్ దెవఆప్స్ ఇంజనీర్ రుషికేశ్వర్‌రెడ్డి,సైబర్ సెక్యూరిటీ ఎథికల్ హ్యాకింగ్ హ్యాకథాన్ నిపుణులు ఇండియన్ సర్వర్స్ సీఈఓ,ఎయిమర్ సొసైటీ అధ్యక్షుడు డి.సాయి సతీష్,డేటా ఆధారిత భావోద్వేగాల హాక్‌థాన్ నిపుణులు న్యూఢిల్లీలోని మాంగోడిబి సినియర్ కన్సల్టింగ్ ఇంజనీర్ ఆదిత్య దువా,గేమ్‌ఫోర్జ్ హాక్‌థాన్ నిపుణులు తాలా ఎలెక్సీ టీమ్ లీడ్ శివకిశోర్ ఎం.ఐటి ఫ్యూజన్ హ్యాకథాన్ నిపుణులు కేఫిట్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీనియర్ టెక్నికల్ లీడ్ ఎం ప్రవీణ్‌కుమార్ తదితరులు హ్యాకథాన్ లోపాల్గొని విద్యార్థులకు ఆయా రకాల టెక్నాలజీలపైన అవగాహన కల్పించడంతోపాటు వినియోగ కేసులు,సాంకేతిక అడ్డంకులు,అభివృద్ధి వ్యూహాలపై వారి అనుభవాలను పంచుకున్నారు.కార్యక్రమానికి కెఎల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజేష్ కన్వీనర్‌గా నాయకత్వం వహించారు.విభాగాధిపతులు,స్పాక్‌ల బృందంతో కలసి కార్యక్రమాన్ని నిర్వహించారు.లెర్నాథాన్‌లోరాత్రి సమయంలో అత్యంత విలువైన విషయాల పట్ల అవగాహన కల్పించారు.కార్యమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జిపిఎస్ వర్మ,ప్రొఫెసర్ విసిలు డాక్టర్ వెంకట్రామ్,డాక్టర్ కె.రాజశేఖరరావు లు కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహించారు.



## ఉచితంగా వినాయక ప్రతిమల పంపిణీ

పెదనందిపాడు ఆగస్టు 26 (ప్రభాతవార్త) కాలుష్య నివారణ కొరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత 13 సంవత్సరాల నుండి ప్రతి వినాయక చవితి పండుగకు తమ ముత్తూట్ ఫిన్ కార్ప్. బ్రాంచి ద్వారా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేస్తున్నామని బి.ఎం.. జి మార్కు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఏబీ ఎం సుశీల. వరలక్ష్మి. ఆంజనేయులు. రాజేష్. వంశీ. రమాదేవి .సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## పత్తి పైరుపై రసం పీల్చే పురుగుల నివారణకు చర్యలు

పెదనందిపాడు ఆగస్టు 26 (ప్రభాతవార్త)మండలంలోని రాజుపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం నిర్వహించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన పచ్చ దోమ ఫేను బంక అక్కడక్కడ కొన్ని పొలాల్లో కనిపిస్తుందని నివారణకు రైతులు ప్రొపెనోపాస్ అనే మందును లీటరు నీటికి 2 మి. లీ వంతున కలిపి పైరుపై పిచ్చికారి చేసుకోవాలని అని సూచించారు. అదేవిధంగా రైతులకు అవసరమైన డిఏపి యూరియా కూడా అవసరానికి సరిపడా తెప్పిస్తున్నామని ఎరువులు కొరత మండలంలో లేదని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మన గ్రోమోర్ సెంటర్ ప్రైవేట్ డీలర్స్ మరియు జి డి సి ఎం ఎస్ లో కూడా ఎరువులు నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి నరేష్.రైతులు అధిక పాల్గొన్నారు.




## ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పెదనందిపాడు ఆగస్టు 26 ( ప్రభాతవార్త) పెదనందిపాడులో మన గ్రోమోర్ సెంటర్ ఫర్టిలైజర్ ను మంగళవారం జాయింట్ ఇన్స్పెక్షన్ లో భాగంగా మండల తహసిల్దార్ హేనాప్రియ. మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం. ఆకస్మిక తనిఖీ చేశారు రికార్డులు ఎరువుల స్టాకు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ హేనాప్రియ మాట్లాడుతూ మండలంలోని ఎరువుల షాపుల యజమానులు ఎమ్మార్పీ రేట్లు కంటే ఎక్కువ రేట్లు కు ఎరువులు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా తాము తీసుకున్న ఎరువులకు పురుగుమందులకు ఆయా షాపుల నుండి కొనుగోలు చేసినప్పుడు ఖచ్చితమైన రసీదులను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిదంగా అవసరం మేరకు ఎరువులు తీసుకోవాలని. రైతులకు సూచించారు.



## సహకార వ్యవస్థ బ్యాంకు సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి




తెనాలి, ఆగస్టు 26 (ప్రభాతవార్త) : సహకార వ్యవస్థను బలోపేతం చేయడానికి ది.విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ బ్రాంచ్‌ను ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ జనరల్ మేనేజర్ ఆర్కె మోహన్ చేతుల మీదుగా ఈ నెల28వ తేదిన తెనాలిలో ప్రారంభించడం జరుగుతుందని ఛైర్మన్ జె.వి.సత్యనారాయణమూర్తి తెలియజేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖపట్నం కోపరేటివ్ 57వ బ్రాంచ్ని తెనాలిలో ప్రారంభించడం ప్రజలకు సహకార బ్యాంకు వ్యవస్థను మరింత చెరువు చేయడమేనని ఆయన తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం కార్యకలాపాల లక్ష్యం 8600కోట్లు నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఐదేళ్ళ కాలంలో తెనాలి బ్రాంచ్ ద్వారా వంద కోట్లు లావాదేవీలు భావిస్తున్నాయని ఆయన అన్నారు. తెనాలి పరిసర ప్రాంత ప్రజలు ది.విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఉపయోగించుకోవాలని సత్యనారాయణమూర్తి కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ది.విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ అందిస్తున్న సేవలను ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో పాలకవర్గం డైరెక్టర్లు సిహెచ్ రామారావు, పి.మల్లిఖార్జునరావు, చిన్న కోటేశ్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

## చవితి కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్:



తెనాలి టౌన్ ఆగస్ట 26 (ప్రభాతవార్త): వినాయకచవితి పండుగ సందర్భంగా పట్టణంలోని మార్కెట్ ఏరియా కొనుగోలుదార్లతో సందడి వాతావరణం నెలకొంది. పండుగకు అన్నిరకాల పూలు,పండ్లు ఎక్కువగా అమ్మకాలు జరిగాయని,మంగళవారం ఒక్కరోజే వేలల్లో వ్యాపారం జరిగిందని వ్యాపారులు తెలిపారు.ఎక్కువగా మట్టివినాయక విగ్రహాలు అమ్ముడుపోయాయన్నారు. సమీపగ్రామాల నుంచి వ్యాపారులు పట్టణానికివచ్చి పూజకు కావలసిన వస్తు సామాగ్రితో పాటు వినాయక ప్రతిమలు,పత్రి,పండ్ల అమ్మకాలు ప్రారంభించారు.మధ్యాహ్నం నుండే కొనుగోలుదార్లతో మార్కెట్ సెంటర్తో పాటు శివాజీ చౌక్,బోసురోడ్డు,ప్రాంతాల్లో అమ్మకాలు జరిగాయి.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

తెనాలి టౌన్ ఆగస్ట 26 (ప్రభాతవార్త): పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో రెండు వేల మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వల్లూరు లక్ష్మీ మ్రపతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం రోటరీ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని అట్లాగే చేతి పనివార్లకు వారు ఇస్తున్న చేయూత,మరియు స్కూలు విద్యార్థిని విద్యార్థులకు స్కాలర్షిప్లు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయటం లాంటి కార్యక్రమాలు హర్షనీయమని తెలియజేశారు, క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు , రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద్ ,క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులు గుత్తా వెంకటరత్నం,కన్నెగంటి మురళి, పావులూరు రాంబాబు, ఐపిపి ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, అర్జున,రాజేంద్రప్రసాద్ కిరణ్, శ్రీధర్,సుబ్బారావు,కీట్స్ శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు



## వినాయకమండపాల వద్ద విద్యుత్ జాగ్రత్తలు పాటించాలి,విద్యుత్ డిఈ



తెనాలి టౌన్ ఆగస్ట 26 (ప్రభాతవార్త):వినాయకచవితి మండపాల వద్ద నిర్వాహకులు విద్యుత్ భద్రతా జాగ్రత్తలు పాటించాలని ఏపిసీపిడిసీఎల్, డిఈఈ బీ.అశోక్ కుమార్ సూచించారు. మండపాలకు విద్యుత్ సరఫరాకోసం అధికారిక తాత్కాలిక కనెక్షన్లు మాత్రమే తీసుకోవాలని తెలిపారు.అలాగే విద్యుత్ పనులను నిపుణుల ద్వారా మాత్రమే చేయించాలని,దానివల్ల ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని అయన పేర్కొన్నారు.అంతేకాకుండా నిమజ్జనం రోజున,ఊరేగింపు సమయాల్లో,విద్యుత్ లైన్లకు తగలకుండా జాగ్రత్తలు పాటించి,విద్యుత్శాఖ వారికి సహకరించాలన్నారు.

## గణేషుని మట్టి ప్రతిమలు పంపిణీ



కొల్లిపర, ఆగస్టు 26 (ప్రభాతవార్త) : బ్రాహ్మణ ఐక్యవేదిక, బ్రాహ్మణ భవన్ ఆధ్వర్యంలో కొల్లిపరలోని శివాలయం ప్రక్కన గల బ్రాహ్మణ భవన్లో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు 500మంది మట్టి విగ్రహాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 4వ తేదిన నిమజ్జన ఉత్సవం ఉంటుందని తెలిపారు. బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు పోగుల రామలింగేశ్వర శర్మ, జగన్నాధ ఆచార్యులు, సూర్యనారాయణ శాస్త్రి, ఉదయభాస్కర్, పోగుల రామలింగేశ్వరశర్మ, జగన్నాధ ఆచార్యులు, సూర్యనారాయణశాస్త్రి, ఉదయభాస్కర్, రాంబాబు, నిరంజన్‌కుమార్, వీరభద్రరావు, రమణశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ మట్టి ప్రతిమల వితరణ కార్యక్రమంలో నాయకులు భీమవరపు కోటిరెడ్డి, బొంతు కిషోర్‌రెడ్డి, భీమవరపు చినకోటిరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, ఎంపీపీ పద్మావతి, సంజీవరెడ్డి, పూస చౌడేశ్వరరావు, మునగాల కృష్ణమూర్తి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు తహసిల్దార్ కార్యాలయం వద్ద నల్లబర్లీ రైతుల ఆందోళన

### - ఎట్టకేలకు దిగివచ్చిన జిల్లా అధికారులు: చర్చలకోసం రైతులకు ఆహ్వానం

పెదనందిపాడు ఆగస్టు 26 (ప్రభాతవార్త). రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు చివర కాడవరకు కొంటామని చెప్పిన ప్రభుత్వం. రైతుల వద్ద ఉన్న పొగాకును పూర్తిగా కొనుగోలు చేయకుండా రైతుల ను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నదని తమకు న్యాయం జరిగే వరకూ ఇక్కడ నుంచి కదిలేది లేదని పెదనందిపాడుకి చెందిన పొగాకు రైతులు నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు ఆధ్వర్యంలో పెదనందిపాడు తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. రైతులు వద్ద ఉన్న పొగాకును అధికారులు నాణ్యత పేరుతో వంకలు పెడుతూ రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 20. పొగాకు చెక్కులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే అందులో నాలుగు చెక్కులకు ధర వేసి. 14 చెక్కులు వెనక్కి పంపుతున్నారని. రాను పోను బాడుగల ఖర్చుతో రైతుల పరిస్థితి గోరు జట్టపై రోకలి పోట్లు లాగా ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దిక్కులేని రైతులు ఆత్మహత్యలకు పూనుకొ ంటున్నారని. డాక్టర్ కొల్లా రాజమోహన్రావు ఆవేదన వ్యక్తం చేస్తూ తాడోపేడు తేలే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఎర్రని ఎండలో తహసిల్దార్ కార్యాలయం ముందు భీష్మించుకొని కూర్చున్నారు. పొగాకు ఉత్పత్తు లైన సిగరెట్లు ధర రోజురోజుకు పెంచుతూ పొగాకు పండించే రైతుల కడుపులు కొడుతున్నారని ఇది ఎంతవరకు సమంజసం అన్నారు. పెదనందిపాడు లోనే పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని. రైతులు వద్ద ఉన్న పొగాకు మొత్తం కొనుగోలు చేసి పొగాకు రైతులను ఆదుకోవాలని. మళ్లీ పంటలు వేసే కాలం వచ్చిందని ప్రభుత్వం రైతులను ఆదుకోకపోతే వారి పరిస్థితి మరింత దిగజారి పోతుందని ప్రభుత్వం కలుగజేసుకొని రైతుల ఆవేదనను తీర్చాలని రాజమోహన్రావు డిమాండ్ చేశారు. ఎండలో కూర్చుని ధర్నా చేస్తున్న రైతుల పరిస్థితి గమనించిన తహసిల్దార్ హేనా ప్రియ. మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం. పెదనందిపాడు ఎస్. ఐ మధు పవన్ లు ఫోన్లు ద్వారా పై అధికారులకు ఇక్కడ పరిస్థితులను వివరించారు. రేపు కలెక్టరేట్ లో జరిగే మీటింగ్లో ఈ ప్రాంత రైతులు పాల్గొని తమ ఇబ్బందుల పై చర్చించాలని ఫోన్ ద్వారా తమ సందేశాన్ని రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్రావు కు వివరించారు. మార్క్ ఫేడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి వ్యవసాయ అధికారి ఫోన్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో 2.800. మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 2. 200. మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు చేశామని ఇంకా 600 మెట్రిక్ టన్నులు పొగాకు కొనుగోలుకు రైతులకు షెడ్యూల్ ఇచ్చామని పేర్కొన్నారు. ఏది ఏమైనా తహసిల్దారు. వ్యవసాయఅధికారులు తమపై అధికారులతో మాట్లాడి ఈ ప్రాంత రైతులను గుంటూరు రమన్న సందర్భంగా. ఈ ప్రాంత రైతులు కమిటీగా ఏర్పడి గుంటూరు వెళ్లి అధికారులు కలుసుకునేందుకు నిర్ణయం తీసుకొని ధర్నాను విరమింప చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో పొగాకు రైతులు గద్దె నాగేశ్వరరావు . పానుబోతుల ప్రసాదు. కాపు అప్పారావు .పుసులూరు రమేషు. కాకుమాను రమేషు. కాకుమాను మస్తాన్. నామ చిన్న. కట్టా కోటేశ్వరరావు. జాజి రామారావు. తదితరులు పాల్గొన్నారు.





## పత్తిపాడు అభివృద్ధి సమీక్ష సమావేశం

ప్రత్తిపాడు ఆగస్టు 26(ప్రభాతవార్త): నియోజకవర్గ కేంద్రం మైన ర్ ప్రత్తిపాడు గ్రామపంచాయతీలో యంజి ఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ గ్రామసభ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాకా సురేష్ అధ్యక్షత వహించారు. సభ లో 202324 సం జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు మరియు పెన్షన్ల పంపిణీ అంశముల పై గత వారం నుండి గ్రామంలో చేసిన సామాజిక తనిఖీ బృందం తయారు చేసిన నివేదికను గ్రామ సభలో అధికారులు చదివి వినిపించారు. సభలో ఇండిపెండెంట్ అబ్సర్వర్ పంచాయతీ రాజ్ శాఖ పిఆర్ ఇంజనీర్ రమేష్, ప్రత్తిపాడు మండలం పిఆర్ ఇంజనీర్ రాంబాబు,సామాజిక తనిఖీ డిఆర్పి రమేష్ కుమార్,పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజావలి,వార్డ్ సభ్యులు డి.వెంకటేశ్వరరావు, సచివాలయం సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఎస్ఏటిఎస్ ఆచార్యకు జాతీయ ప్రతిభా అవార్డు

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్, కెవిఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ప్రతిభా అవార్డులను అందజేయనున్నట్లు స్పెల్టో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. ఈ నెల 31వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వ విజ్ఞాన మందిరంలోఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రతిభా అవార్డుకు తెలంగాణా రాష్ట్రానికి చెందిన వేదాంతు విజ్ఞాన్ కళాశాల అధ్యాపకుడు, మధురకవి, ఆధ్యాత్మిక ప్రవచకులు ఎస్ఏటిఎస్ ఆచార్య ఎంపికైనట్లు నాగయ్య తెలిపారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ స్పెల్టో ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో అవార్డులను అందజేస్తున్నామన్నారు. ప్రైవేట్ రంగంలోని అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఆచార్యులు తదితరులను ప్రోత్సహించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. అవార్డులకు ఎంపికైన వారికి ఇప్పటికే ఎంపిక పత్రాలను పంపినట్లు చెప్పారు. ఈ నెల 31వ తేదీన జరిగే కార్యక్రమానికి ఎంపికైన ప్రతి ఒక్కరూ వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగయ్య కోరారు.



## పర్యావరణ పరరక్షణే లయన్స్‌క్లబ్‌ల ధ్యేయం

### -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరాణి

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా లయన్స్‌క్లబ్‌లు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నాయని లయన్స్ క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ వద్ద మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇప్పటికే పర్యావరణలో వచ్చిన మార్పుల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ వంతుగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు స్వర్ణపురి మహిళ క్లబ్ విశేషంగా కృషి చేస్తుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలుపుదల చేసేందుకు కూడా ఇటీవల కాలంలో తమ క్లబ్ తరపున ప్రజల్లో చైతన్యం తెచ్చామన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు వద్దని, మట్టి వినాయకులే ముద్దని చెప్పారు. రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, మాజీ అధ్యక్షురాలు మన్నవ అనసూయాదేవి, జి.కృష్ణకుమారి, పి.శేషుకుమారి, పి.లక్ష్మీకుమారి, పి.మోహనలక్ష్మి, కె.నరసింహాచారి, టి.శ్రీలక్ష్మి, పి.నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.



## తొలగించిన దివ్యాంగుల ఫించన్లు పునరుద్ధరించాలి



పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: ఇటీవల తొలగించిన దివ్యాంగుల ఫించన్లను పునరుద్ధరించాలని కోరుతూ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. తగ్గించిన దివ్యాంగుల సదరం పర్సంటేజ్, తొలగించిన పెన్షన్లు పునరుద్ధరించాలని కోరారు. దివ్యాంగుల పర్సంటేజీ ఆధారంగానే పెన్షన్ అనేది మంజూరు చేస్తారన్నారు. ఇటీవల ప్రభుత్వం తొలగించిన పెన్షన్లలో అర్హత కలిగివారి పెన్షన్లు కూడా తీసేయడం జరిగిందన్నారు. 2009నుంచి 2019 వరకు దివ్యాంగులకు వైకల్యాన్ని బట్టి సదరం పర్సంటేజీలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ రీ వెరిఫికేషన్‌లో 90శాతం ఉన్నవారికి కూడా తక్కువ శాతంతో సర్టిఫికెట్ల ఇచ్చి తొలగించారన్నారు. పుట్టుకతో పోలియో వచ్చిన వారికి వారి వైకల్యంలో ఎలాంటి మార్పు ఉండదు. అలాంటప్పుడు పర్సేంటేజీలు ఎలా మారుతాయన్నారు. ప్రభుత్వం వికలాంగులపై దయయుంచి తీసేసిన పెన్షన్లను మరలా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా అల్లాభక్షు, పూల రాజు, షేక్ బాషీద్‌బాబా, గోపి, మాడావత్ రాంబాబునాయక్, మురుగుల సాంబశివరావు, షేక్ బాజ్జి తదితరులున్నారు.

## రైతులకు ఎరువులను సకాలంలో అందించాలి

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు పట్టణ, మండల పరిధిలోని ఎరవుల దుకాణాలను, సొసైటీలను తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలు, రికార్డు ప్రకారం సరిగ్గా ఉన్నాయా లేదా.?అనే విషయాలను పరిశీలించారు. ఎరువులు అసరమైన రైతులకు ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు కొరత లేకుండా అందించాలన్నారు. రైతులకు కూడా కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగుమందులకు, విత్తనాలకు రశీదులు అడిగి తీసుకోవాలన్నారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ఈ తనిఖీలలో మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ తదితరులున్నారు.



## విధి వంచితులపై చంద్రబాబు క్రూరంగా వ్యవహరిస్తున్నారు

### -వైకాపా జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకటసుబ్బయ్య

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: విధి వంచితులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్రూరంగా వ్యవహరిస్తున్నారని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి ఎందేటి వెంకట సుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అహంకార ధోరణితో విధి వంచితులైన దివ్యాంగుల ఫించన్ పట్ల క్రూరంగా ప్రవర్తిస్తూ వారి చావులకు కారణమవుతోందన్నారు. మానవతా దృక్పథంతో ఉండాల్సిన ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన సాగిస్తుందన్నారు. వైకల్యాన్ని ధృవీకరిస్తూ గతంలో ఇదే వైద్యులిచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడెందుకు పనికిరావడం లేదని, వాటిని కాదనం అంటే డాక్టర్లను అవమానించడమేనన్నారు. ఫ్రీ వెరిఫికేషన్ పేరుతో మీరు చేస్తున్న దారుణానికి వీల్‌చైర్లలో, కాళ్ళపై దేక్కొంటూ ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరగాలో చెప్పాలన్నారు. మీరు తగ్గిస్తున్న శాతం వల్ల ఒక్క పింఛన్లకే కాదు ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. త్రి నెలా అందుకున్న పింఛన్ ఇకపై ఆగిపోతోందని తీవ్ర మనస్తాపానికి గురైన దివ్యాంగుడు మారూరి రామలింగారెడ్డి, అలాగే శ్రీకాకుళంలో దివ్యాంగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని వెంకటసుబ్బయ్యఆవేదన వ్యక్తం చేశారు.



## డంపింగ్‌యార్డు నిర్వహణ సక్రమంగా ఉండాలి

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: డంపింగ్‌యార్డు నిర్వహణను సక్రమంగా చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు సిబ్బందికి సూచించారు. నిడుబ్రోలు వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలోని డంపింగ్‌యార్డును ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందికి సూచనలు చేశారు. ఎరువు తయారీని పరిశీలించారు. డంపింగ్‌యార్డు నిర్వహణలో చిత్తశుద్ధిగా పనిచేయకపోతే చర్యలు తీసుకొంటామన్నారు. చెత్త నుండి సంపద సృష్టించే కేంద్రాలను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇత్తడి శ్రీనివాసులు తదితరులున్నారు.



## ప్రతి పంటకు ఈక్రాప్ తప్పనిసరి




పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: ప్రతి రైతు వేసిన ప్రతి పంటకు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి .ప్రియదర్శని సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శని మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరువేల ఎకరాల్లో వివిద పంటలు సాగుచేయడం జరిగిందన్నారు. రైతు సోదరులకు ఇప్పటి వరకు దాదాపు 928మెట్రిక్ టన్నుల యూరియా, 300మెట్రిక్ టన్నుల డిఏపి సరఫరా చేయడం జరిగిందన్నారు. అన్నీ రైతు సేవా కేంద్రాలలో ఎరువుల నిల్వలు ఉన్నాయన్నారు. రాబోయే కాలంలో అవసరమైన ఎరువులను కూడా ఆయా సమాయాల్లో అందించడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు ఇప్పుడు అవసరమైన ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. ఎరువుల సరఫరాలో ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. ఎక్కడైనా ఎరువులను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. సచివాలయాల వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా జీవిత చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

### -లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళా అధ్యక్షురాలు ఝాన్సీరాణి

పొన్నూరు, ఆగస్టు 26,ప్రభాతవార్త: మదర్ థెరిస్సా జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ అధ్యక్షురాలు బేతాళ ఝాన్సీరాణి అన్నారు. స్థానిక లయన్స్‌పాలీ సర్వీస్ సెంటర్‌లో మంగళవారం మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి మాట్లాడుతూ మదర్ థెరిస్సా మానవతా వాదిగా పేద ప్రజలు, నిస్సహాయులకు అనుకూలిరాలిగా అంతర్జాతీయంగా కీర్తి పొందారన్నారు. మదర్ థెరిస్సా మానవ సేవను గుర్తించిన ప్రభుత్వం ఆమెకు 1979లో నోబెల్ శాంతి పురస్కారాన్ని అందించిందన్నారు. ఆమె ఎంతో మందికి సేవలు అందించారన్నారు. భారతదేశంలో, ప్రపంచంలోని ఇతర దేశాలలో ఆమె పేదలకు, రోగగ్రస్తులకు, అనాథలకు,మరణశయ్యపై ఉన్నవారికి పరిచర్యలు చేసిందన్నారు. మదర్ థెరిస్సా సేవలను చిరస్మరణీయమన్నారు. మదర్ థెరిస్సా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తొలుత మదర్ థెరిస్సా చిత్రపటానికిపూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ల రీజినల్ ఛైర్మన్ పరాశరం రంగవల్లి, సహ కార్యదర్శి టి.శ్రీలక్ష్మి, కోశాధికారి పి.నిర్మలాదేవి, కె.నరసింహాచారి, జి.కృష్ణకుమారి, పి.శేషుకుమారి, మన్నవ అనసూయాదేవి, పి.మోహనలక్ష్మి, పి.లక్ష్మీకుమారి, పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## భక్తి శ్రద్ధలతో వినాయకచవితి వేడుకలు జరుపుకోండి : ఎస్పీ



నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాలో వినాయకచవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో పూర్తి శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం కోరారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలకు స్థానం కల్పించవద్దన్నారు. వినాయకచవితి పర్వదినం అందరి జీవితాల్లో మంచి వెలుగులు తీసుకురావాలన్నారు. మండపాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పబ్లిక్ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విలువైన వస్తువులను మండపాలలో రాత్రి సమయాలలో ఉంచవద్దన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట అసభ్యకర నృత్య ప్రదర్శనలు చేయవద్దన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే 100, 112 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు కోరారు.

## 13 సార్లు డీఎస్సీ నిర్వహించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది: యాగంటి

మాచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త: 14 సంవత్సరాల ముఖ్యమంత్రి హోదాలో 13 సార్లు డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలో దాదాపు 1,85,000 మందికి ప్రభుత్వ టీచర్స్ నియామకాలు చేపట్టి విద్యారంగాన్ని బలోపేతం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1984లోనే తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయిన వెంటనే అప్పటి వరకు అధికార పార్టీ రాజకీయ నాయకుల రికమండేషన్‌తో ఇస్తున్న ప్రభుత్వ టీచరు ఉద్యోగాలు నిలిపివేసి సమాజంలో కులమతాలకు, అధికార రాజకీయ నాయకులకు అతీతంగా అర్హత ఉన్న నిరుద్యోగులకు డీఎస్సీ మెరిట్ ద్వారా ఉద్యోగాలు నియమించిఇ విద్యారంగంలో నూతన విధానానికి నాంది పలికారన్నారు. 2024 ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే విజయవంతంగా మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 టీచర్లను నియమించి విద్యారంగానికి పూర్వవైభవం తెచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రి లోకేష్‌దేనని కొనియాడారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా 2025 సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1వ తేదీనే జీతాలు ఇస్తూ, ఆత్మాభిమానంతో, ఆత్మగౌరవంతో జీవించేలా పూర్వవైభవం తీసుకువచ్చిందన్నారు.



## ఘనంగా విశ్వమాత మదర్‌థెరిస్సా 116వ జయంతి వేడుకలు

మాచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త: విశ్వమాత మదర్‌థెరిస్సా 116వ జయంతి వేడుకలు స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక స్వామి వివేకానంద సేవాశ్రమంలో మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ జి.దాక్షాయణి హాజరై మాట్లాడారు. మదర్‌థెరిస్సా భారతదేశానికి చేసిన సేవలు ఎనలేనివని, కుష్ఠ రోగులకు, అనాథలకు, రోగ పీడితులకు ఆమె చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఎక్కడో విదేశాల్లో పుట్టి భారతదేశానికి వచ్చి అనాథపిల్లలను చేరదీసి వారిని తమ సొంత పిల్లల్లాగా చూసుకొని జీవితాన్ని త్యాగం చేసిన మాతృమూర్తి థెరిస్సా అని అన్నారు. మదర్‌థెరిస్సా బాటలోనే నడుస్తున్న మెట్టు గోవిందరెడ్డి సేవలను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. మాచర్ల నియోజకవర్గంలో ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు అందిస్తున్న మెట్టు గోవిందరెడ్డిని కొనియాడారు. స్వామి వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్, ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్న ఆమె సూక్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని అదే బాటలో నడవాలని పిలుపునిచ్చారు. గుడి, చర్చి, మసీదుల్లో ఎన్ని ప్రార్థనలు చేసినా, వాటిని నిజజీవితంలో అమలు చేసి చూపించినప్పుడే మోక్షానికి అర్హులమన్నారు. అనంతరం వృద్ధులకు, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం ముత్యాల పాపిరెడ్డి, శ్రీహరి, గుంటూరు ప్రభావతి, ఇందిరాదేవి, ఆర్టీసీ శ్రీనివాసరావు, యోగా సభ్యులు, వృద్ధులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కూడా విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చు

మాచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త: బుధవారం వినాయకచవితి సెలవు రోజున కూడా విద్యుత్తు వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు విద్యుత్తు కార్యాలయంలోని ఈఆర్ఓ కౌంటర్ తెరిచే ఉంటుందని విద్యుత్తుశాఖ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత బిల్లులు, పాత బకాయిలు ఉన్నవారు వెంటనే బిల్లులు చెల్లించి విద్యుత్తుశాఖకు సహకరించాలని కోరారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మాచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మాచర్లలో జరిగింది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో షేక్ నాగుల (30) మోటార్ సైకిల్ మెకానిక్ షెడ్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రింగురోడ్డు సమీపంలోని పాతరైలుకట్ట ప్రాంతంలో ఉన్న ఇంటిలో ఉరివేసుకొని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగులకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య, పిల్లలు కొద్దిరోజులక్రితం పుట్టింటికి వెళ్లారు. నాగుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలి: గురజాల ఆర్డీవో మురళీకృష్ణ

గురజాల, ఆగస్టు 26 ప్రభాతవార్త: వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరగాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. మంగళవార పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పారిశుధ్య కార్మికులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయక చవితి మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విద్యుత్ శాఖ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను శుభ్రం చేయాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం రోజు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు.



## సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట సంజీవని:ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త: సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట సంజీవని అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతఊా అనారోగ్య కారణాలతో హాస్పిటల్‌లో చేయించుకొని, ఆర్థిక స్థోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో సీఎం సహాయనిధి పేదలకు బాసటగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా 57 మంది లబ్ధిదారులకు రూ. 49,37,105 విలువ గల చెక్కులను అందజేశారు.



## స్త్రీశక్తి భారీ బహిరంగ సభను విజయవంతం చేయండి: ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

కారంపూడి, ఆగస్టు 26 ప్రభాతవార్త: సూపర్‌సిక్స్ హామీల్లో కిలక పథకం స్త్రీశక్తి పథకాన్ని విజయవంతమైన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ కారంపూడిలో ఈ నెల 29న జరగనున్న మహిళలచే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సభా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎమ్మెల్యే



మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు 90శాతం అమలయ్యాయన్నారు. ఏడాది కాలంలోనే ప్రజలకు సంతృప్తికరమైన సంక్షేమాన్ని సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందించిందన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటు చేస్తున్న ఈ భారీ బహిరంగ సభకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు నాయకులు హాజరవుతారని వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకులు పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య, ఉన్నం లక్ష్మీనారాయణ, గోళ్ల సురేష్‌యాదవ్, చప్పిడి రాము, తండా మస్తాన్‌జానీ, బొల్నేడి శ్రీనివాసరావు, నాగారపు రామకృష్ణ, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, బాణావత్ బాలునాయక్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాలతో పర్యావరణానికి మేలు : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : మట్టి గణపతి విగ్రహాలతో పర్యావర్ణానికి మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక కోటప్పకొండరోడ్డులో విజయగణపతి ఫౌండేషన్ ఛైర్మన్ అల్లంశెట్టి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్ళుగా కుల, మతాలకు అతీతంగా గణపతి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు అల్లంశెట్టి కిషోర్ తదితరులను ప్రత్యేకంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అభినందించారు. మట్టి విగ్రహాలు, ప్రతిమలు నీటిలో తేలికగా కరిగిపోతాయని, నీటి కాలుష్యం ప్రమాదం లేదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## మదర్‌థెరిస్సా హాస్పటల్లో ఘనంగా థెరిస్సా జయంతి

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : మదర్‌థెరిస్సా మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఛైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ ఆధ్వర్యంలో మంగళవారం మదర్‌థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా పేరుపై 20 సంవత్సరాలకు పైగా వైద్యశాలను నిర్వహిస్తున్న డాక్టర్ ప్రకాష్‌ను అభినందించారు. వైద్యం వ్యాపారం కాదని, సేవా భావంతో నిర్వహించాలని మదర్‌థెరిస్సా హాస్పటల్ నిరూపించిందన్నారు. హాస్పటల్‌కు మదర్‌థెరిస్సా పేరు పెట్టడంతో పాటు ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొలుత మదర్‌థెరిస్సా చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబుతో పాటు డాక్టర్ నాగోతు ప్రకాష్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## చిరంజీవి యువత ఆధ్వర్యంలో మదర్‌థెరిసా జయంతి

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : పట్టణంలోని లాల్‌బహదూర్ కూరగాయల మార్కెట్ సెంటర్‌లో మంగళవారం జనసేన, చిరంజీవి యువత ఆధ్వర్యంలో భారతరత్న మదర్‌థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, నాగరాజు, అడపా శ్రీను, వినయ్‌కుమార్, వేములయ్య, కొండా, మాధవరావు పాల్గొని మాట్లాడారు. పేదల కోసం మిషనరీ ఆఫ్ ఛారిటీ పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలను మదర్‌థెరిస్సా చేశారని తెలిపారు. భారతరత్న అవార్డుతో ఆమెను సత్కరించడం దేశానికే గర్వకారణం అన్నారు. నిరుపేద రోగులకు, ముఖ్యంగా కుష్ఠ రోగులకు వారు అందించిన సేవలు వెలకట్టలేనివని తెలిపారు. ఆమె స్ఫూర్తితో మెగాస్టార్ చిరంజీవి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సమాజ సేవలో ముందుకు వెళ్తున్నారని, వారి మార్గంలో తాము ప్రయాణిస్తున్నట్లు తెలియజేశారు. తొలుత మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## సేవకు ప్రతి రూపం మదర్‌థెరిస్సా : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నకరికల్లు, ఆగస్టు 26 ప్రభాతవార్త : సేవకు ప్రతి రూపం మదర్‌థెరిస్సా అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. పల్నాడురోడ్డులోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవింద్‌బాబుతో పాటు రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, విగ్రహ కమిటీ సభ్యులు బాదుగున్నల శ్రీనివాసరావు, పూనూరి కృష్ణకుమారి, రంగిశెట్టి రామకృష్ణ, డాక్టర్ నాగోతు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మదర్‌థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నోబుల్ శాంతి బహుమతి గ్రహీత మదర్‌థెరిస్సా అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మానవ సేవలకు చిహ్నంగా మదర్‌థెరిస్సా నిలిచారని తెలిపారు. రోగులు, అనాథలైన లక్షల మందికి 123 దేశాలలో ఆమె సేవలు అందించడం జరిగిందని, వారి మార్గంలో తాము నడుస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు.





## మూడు రోజులు ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : దివ్య రూమటాలజీ సెంటర్‌లో మూడు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ యనమదల దివ్య మంగళవారం తెలియజేశారు. ఈ నెల 27,28,29 తేదీలలో నిర్వహించే శిబిరంలో ఉచిత కన్సల్టేషన్‌తో పాటు రూ.3500లు విలువ చేసే ఆర్థరైటీస్ ప్రొఫైల్ పరీక్షలను 50 శాతం రాయితీతో చేయడం జరుగుతుందని తెలియజేశారు. ముఖ్యంగా అంతుపట్టనటువంటి అనేక రకాలైన వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలను నిర్వహిస్తామన్నారు. కీళ్ళ నొప్పులు, వాపులు, నడుము నొప్పి, తొంటి నొప్పి, సోరియాటిక్ ఆర్థరైటీస్, సీతాకోక చిలుక దద్దుర్లు తదితర అనారోగ్య సమస్యలకు వైద్య సేవలను అందించడం జరుగుతుందని డాక్టర్ దివ్య తెలియజేశారు.

## వశిష్ఠ జూనియర్ కళాశాలలో పి.డి.కి అభినందన

రొంపిచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని వశిష్ఠ జూనియర్ కళాశాలలో పి.డి. ఏనుగంటి సురేష్‌ను మంళవారం కళాశాల యాజమాన్యం సత్కరించింది. కళాశాల ఛైర్మన్ మద్దుల కోటేశ్వరరావు, నర్రా శేషగిరి, మద్దుల నరేష్‌కుమార్, భవిరిశెట్టి రాజారావు, నల్లపాటి శ్రీకాంత్‌లు పి.డి.అభినందన కార్యక్రమంలో పాల్గొన్నారు. డైరెక్టర్ మద్దుల నరేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులను, కోచ్‌లను తమ కళాశాల ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఉంటూ అమరావతి క్రషర్స్ కబడ్డీ టీమ్‌కు సైతం కోచ్‌గా వ్యవహరిస్తున్న సురేష్‌కు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. విజయవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు 11 రోజుల పాటు జరిగాయని, ఎనిమిది టీములు పాల్గొనగా పల్నాడు జిల్లాను ప్రథమస్థాయిలో నిలిపిన ఘనత సురేష్‌కే దక్కుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.



## ఎమ్మార్పీయస్ పల్నాడు జిల్లా నూతన కమిటీలు

రొంపిచర్ల, ఆగస్టు 26 ప్రభాతవార్త : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో నూతన కమిటీలను ప్రకటించారు. పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి రెడ్డిబోయిన ప్రసన్నకుమార్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుజ్జర్లపూడి అశోక్, నియోజకవర్గ ఇన్‌చార్జిగా పలుకూరి రామారావు, వినుకొండ నియోజకవర్గ అధ్యక్షునిగా కె.ఏసురత్నం, రాష్ట్ర కో కన్వీనర్‌గా గూండాల ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధిగా కోట సుబ్బు, జిల్లా మహిళా అధ్యక్షులుగా సుమతి, జిల్లా కో కన్వీనర్‌గా నగేష్, జిల్లా అధికార ప్రతినిధిగా జార్జి, నియోజకవర్గ అధ్యక్షునిగా రావినూతల కోటేశ్వరరావు, చిలకలూరిపేట అధ్యక్షులుగా కోట రాజేష్, ముప్పాళ్ళ మండల అధ్యక్షునిగా దేవదానం, నాగేంద్రబాబు, పట్టణ ఉపాధ్యక్షునిగా మిట్టా మహేష్ తదితరులు నియమితులయ్యారు.

## ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మట్టి గణపతి ప్రతిమలను విద్యార్థులకు కళాశాల యాజమాన్యం మంగళవారం పంపిణీ చేసింది. 457 మంది విద్యార్థులకు, సిబ్బందికి మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. ఛైర్మన్ షేక్.మీరావలి, కార్యదర్శి కరీమ్, డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్‌లు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన మట్టితో తయారు చేసిన గణనాథుని ప్రతిమలను పూజకు వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ వంటి రసాయనాలతో తయారు చేసిన ప్రతిమలను వినియోగించవద్దన్నారు. దాని వలన కలిగే నష్టాలను ఈ సందర్భంగా తెలియజేశారు. రసాయనాల విగ్రహాల వలన భూమి, నీరు కలుషితం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గంగాధర్ పాల్గొన్నారు.

## ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ, మక్కెన





వినుకొండ, ఆగస్టు26, ప్రభాతవార్త: వినాయక చవితి పండగ పురస్కరించుకొని పల్నాడు, వినుకొండ నియోజకవర్గ ప్రజానీకానికి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నాయకులకు ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మకె ్కన మల్లికార్జునరావులు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని అడ్డంకులు తొలగిపోయి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.

## అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

వినుకొండ, ఆగస్టు26, ప్రభాతవార్త: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమం వద్ద మృతి చెందిన అనాథ మృతదేహానికి ఆదర్శ ఫౌండేషన్, మానవసేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఇటువంటి పుణ్య కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంటుందని మానవ సేవాసమితి గౌరవాధ్యక్షులు పి.వి సురేష్‌బాబు అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పువ్వాడ కృష్ణ, ఆదర్శ ఫౌండేషన్ సభ్యులు గుంటకల అంజి, నరగాయపాలెం అంజి, గుంటకల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చీకటీగలపాలెం,శివాపురంలో పొలం పిలుస్తోంది...



వినుకొండ, ఆగస్టు26, ప్రభాతవార్త: వ్యవసాయ శాఖ ఆధ్వర యంలో మండలంలోని చీకటీగలపాలెం, శివాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి. వరలక్ష్మి పంట పొలాలను పరిశీలించి చీడపీడల నివారణకు తగిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులు పొగాకు పంట సాగు చేయవద్దని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెప్పారు. కౌలు రైతులు సీసీఆర్ కార్డులు తీసుకొని పంట నమోదు చేయించుకొనిన యెడల రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్‌లో పెట్టి అన ్నదాత సుఖీభవ పథకం లబ్ధి పొందవచ్చు అని పేర్కొన్నారు.

## హౌసింగ్ కాలనీని పరిశీలించిన ఎంపిడివో ఉమాదేవి

నూజెండ్ల, ఆగస్టు26, ప్రభాతవార్త: మండలకేంద్రమైన నూజెండ్ల గ్రామం నందు హౌసింగ్ కాలనీని మండల అభివృది ్ధ అధికారి పావులూరి ఉమాదేవి మంగళవారం పరిశీలించారు. ఇంకా పూర్తి కానీ గృహాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించాలని హౌసింగ్ ఏఈ యలమందను ఆదేశించారు. అలాగే కాలనీలో పిచ్చి మొక్కలను తొలగించి నీడనిచ్చే మొక్కలను నాటించాలని ఏపీవో ఆంజనేయరాజుకు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్స్ భాస్కర్‌రెడ్డి, సతీష్, హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ ముక్కంటేశ్వరరావు, ఉపాధిహామీ సిబ్బంది గురువారావు పాల్గొన్నారు.



## ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వినుకొండ, ఆగస్టు26, ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల తహశీల్దార్ సురేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి మంగళవారం తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ మిషన్, గోడౌన్ నిల్వలు, స్టాక్ బోర్డులు పరిశీలించారు. రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు

నూజెండ్ల, ఆగస్టు25, ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఎరువుల దుకాణాలను మండల తహశీల్దార్ రమేష్ కుమార్, మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, మండల ఎస్సై బి.వి కృష్ణారావులు మంగళవారం తనిఖీలు చేశారు. పాత నాగిరెడ్డిపల్లి, కొత్తనాగిరెడ్డిపల్లి, లింగముక్కపల్లి, ఐనవోలు గ్రామాల్లోని దుకాణాలను, పీఏసిఎస్ సొసైటీలను తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, ఈ పాస్ మిషన్, గోడౌన్ నిల్వలు, స్టాక్ బోర్డులు, బిల్ బుక్స్ పరిశీలించారు. రైతులకు ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మోతాదుకు మించి ఎరువులు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను రైతులకు తెలిసే విధంగా షాపుల వద్ద అవగాహన కల్పించాలని చెప్పారు.



## పిఎన్‌సి అండ్ కెఆర్ కళాశాలలో ఎథికల్ హ్యాకింగ్ పై వర్క్‌షాప్

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : పిఎన్‌సి అండ్ కెఆర్ కళాశాలలో ఎథికల్ హ్యాకింగ్ పై వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. డిగ్రీ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించి సెక్యూరిటీ నిపుణులు గాయం భరత్‌కుమార్‌రెడ్డి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఎథికల్ హ్యాకింగ్ ప్రాముఖ్యతను, సైబర్ దాడులను, పాస్‌వర్డ్ మేనేజ్‌మెంట్‌ను, డేటా ప్రొటెక్షన్‌ను, మొబైల్ యాప్ సెక్యూరిటీని తెలియజేశారు. అదే విధంగా హ్యాకింగ్ నివారణ చర్యలను ప్రాక్టికల్‌గా చేసి చూపారు. హెథికల్ హ్యాకింగ్‌లో ఉద్యోగ అవకాశాలను వివరించారు. కళాశాల సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాప్‌లతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి హరికృష్ణ సదస్సు పర్యవేక్షించారు.

## నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా

నరసరావుపేట, ఆగస్టు 26 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని కార్మికశాఖ కార్యాలయ ప్రాంగణంలో జాబ్ డ్రైవ్‌ను మంగళవారం నిర్వహించారు. వివరాలను జిల్లా అధికారి తమ్మాజీరావు తెలియజేశారు. మొత్తం జాబ్‌డ్రైవ్‌ను పది కంపెనీలు నిర్వహించగా 273 మంది అభ్యర్థులు హాజరు కావడం జరిగిందన్నారు. అందులో 117 మందికి ఉద్యోగాలు లభించాయన్నారు. ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జి మేరీజోత ్స్న మాట్లాడుతూ నియామకపత్రాలు అందుకున్న యువతకు అభినందనలు తెలిపారు. ఉద్యోగ కల్పన అధికారి రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరాంజనేయులు, ఎ.రమ్య, సురేష్, ఆయా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సు రద్దు: మండల వ్యవసాయాధికారి

కారంపూడి, ఆగస్టు 26 ప్రభాతవార్త: ఎరువులను అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించిన వారి లైసెన్సులు రద్దు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడుతూ మండలంలో యూరియా, డీఏపీ నిల్వలు తగినంత ఉన్నాయని, ఇంకా వస్తున్నాయని తెలిపారు. రైతు సేవా కేంద్రాలకు, సొసైటీలకు కూడా తెప్పిస్తున్నామన్నారు. రైతులు మీ పొలం పాసుపుస్తకాలు చూపించి తగినంత ఎరువులు తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు కొనవద్దని సూచించారు. డీలర్లు అవకతవకలను పాల్పడితే మా దృష్టికి తెస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



## ఎరువుల దుకాణాలలో తనిఖీలు

రాజుపాలెం, ఆగస్టు 26 ప్రభాతవార్త : మండలంలోని గణపవరం, ఉప్పలపాడు గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల ప్రత్యేక అధికారి నారదముని, తహశీల్దార్ సరోజ, ఎస్.ఐ. వేణుగోపాల్, మండల వ్యవసాయ అధికారి వెంకటనరసయ్యలు ఎరువుల దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్స్ సైతం రద్దు చేస్తామన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో బిల్లులను తప్పక తీసుకోవాలన్నారు. రైతులు ప్రస్తుతానికి అవసరమైన ఎరువులు మాత్రమే తీసుకెళ్ళాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు పుష్కలంగా ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు.



## గిరిజన గూడెంను సందర్శించిన అధికారులు

రాజుపాలెం, ఆగస్టు 26 ప్రభాతవార్త : మండలంలోని అంచులవారిపాలెం గ్రామ పంచాయితీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గిరిజన గూడెంను మంగళవారం ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహశీల్దార్ సరోజ, ఎంపిడివో సత్యనారాయణలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను తెలుసుకునేందుకు ఇక్కడకు రావడం జరిగిందన్నారు. గిరిజన దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇచ్చిన హామీ మేరకు గిరిజనులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. గూడెంలో మౌలిక వసతులకు ప్రాధాన్యతను ఇస్తామని తెలియజేశారు. మండల టిడిపి అధ్యక్షులు అంచుల నరసింహారావు, సెక్రటరీ గోపి, వ్యవసాయ అధికారి వెంకటనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

27-8Pg5 9th_27-8Pg5.qxd 8/26/2025 11:12 PM Page 1



# 'ఓట్ల చోరీ'పై ప్రజాభిప్రాయం

## • ఇసి కీలక నిర్ణయం • ఐదు ప్రశ్నలను సంధిస్తున్న ఇసి • గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని విపక్షాల ఆరోపణ




**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఎ సర్కార్ ఎన్నికల సంఘంతో కుమ్మక్కై బీహార్ ప్రజల ఓట్లను దొంగిలించే ప్రయత్నాలు చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము చేపట్టిన బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన వివిధ అంశాలపై తమ అభిప్రాయం తెలపాలని రాష్ట్ర ప్రజలను కోరేందుకు పోల్‌ప్యానల్ అయిదు ప్రశ్నలను సిద్ధం చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

– ఓటర్ల జాబితాలను సవరించి, విస్తృతంగా పరిశీలించాలా?

– చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలా?

– రెండు ప్రాంతాల్లో నమోదైన ఓటర్ల పేర్లను ఒకదగ్గరి నుంచి తొలగించాలా?

– ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన ఓటర్లను జాబితా నుంచి మినహాయించాలా?

– విదేశీయులు, ఇతర రాష్ట్రాల ప్రజలు ఓటు హక్కును తిరస్కరించాలా?

ఈ ప్రశ్నల ఆధారంగా బీహార్ వ్యాప్తంగా సర్వే చేసి ఓటర్ల జాబితా సవరణపై ప్రజలు ఏమనుకుంటున్నారనే విషయాన్ని స్వయంగా తెలుసుకోవడానికి ఎన్నికలకమిషన్ ఈచర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బీహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఇసి ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి.

గుజరాత్ వ్యక్తులు బీహార్‌లో ఓటర్లుగా మారుతున్నారని, ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లుగా పేర్కొంటూ వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారని పేర్కొన్నాయి. తొలగించిన ఓటర్ల పేర్లను వెల్లడించాలని డిమాండ్‌చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టులో పిటి షన్లు వేశాయి. వీటిపై విచారణచేపట్టిన న్యాయ స్థానం ఎస్ఐఆర్ కింద తొలగించిన 65 లక్షల మంది పేర్లను వెల్లడించాలని ఇసికి సూచించింది.



# జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలు

**శ్రీనగర్, ఆగస్టు 26:** జమ్మూ కాశ్మీర్‌లో కురిసిన అతివృష్టి, వరదలు, కొండచరియల విరిగిపడటం తీవ్ర విషాదానికి దారితీసింది. దోడా జిల్లాలో మేఘవిస్ఫోటం, వరదల కారణంగా కనీసం ఐదుగురు ప్రాణాలుకోల్పోగా, అనేక ఇళ్లు, రహదారులు ధ్వంసమయ్యాయి. అర్ధక్వారి లోని వైష్ణోదేవి ఆలయం మార్గంలో జరిగిన భారీ కొండచరియ ప్రమాదంలో పలువురు భక్తులు గాయపడి, మరికొందరు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. దోడా జిల్లాలో ఒక ఇల్లు కూలిపోవడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు ఆకస్మిక వరదల్లో కొట్టుకుపోయారు. ప్రధాన నదులు ఉప్పొంగి పోతుండటంతో ప్రజలు నది తీరాలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. జోజిలా పాస్‌వద్ద కురిసిన భారీ మంచుకారణంగా శ్రీనగర్‌లేహ్ హైవే నిలిచిపోయింది. అలాగే, వందే భారత్ ఎక్స్‌ప్రెస్, శ్రీశక్తి ఎక్స్‌ప్రెస్, హేమకుంట్ ఎక్స్‌ప్రెస్‌తో సహా అనేక రైళ్లు రద్దు చేశారు.

# గాంధీ కుటుంబమే నా దైవం

## కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, ఆగస్టు 26:** బిజెపిని విమర్శించేందుకే నేను ఆ పాటపాడాను. కానీ కొందరు దీని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నాను. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదుఅని డికె వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని అని స్పష్టంచేశారు.

# చైనా విద్యార్థులకు యుఎస్‌లో గేట్లు ఎత్తేస్తాం

## డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో గందరగోళం



**వాషింగ్టన్, ఆగస్టు 26:** చైనా విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ద్వంద్వ వైఖరి ఆశ్చర్యపరుస్తోంది. ఓ వైపు టారిఫ్‌లపై బీజింగ్‌కు వార్నింగ్ ఇస్తూ వాణిజ్య యుద్ధానికి కాలు దువ్వుతూనే.. చైనా విద్యార్థులకు అమెరికా తలుపులు తెరుస్తున్నారు. ఏకంగా ఆరు లక్షల మంది చైనీస్ విద్యార్థులను అగ్రరాజ్యానికి ఆహ్వానిస్తున్నారు. ట్రంప్ తీరు సొంత పార్టీ నేతలను అసహనానికి గురిచేస్తోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులు, విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన నిబంధలను అమలుచేస్తోన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా చైనాలో కమ్యూనిస్టు పార్టీకి చెందిన వారు, పరిశోధన రంగంలో ఉన్న వారికి వీసాలు రద్దు చేస్తామని బహిరంగంగానే హెచ్చరికలు చేశారు. భారత్ సహా ఇతర దేశాల విద్యార్థుల వీసాల ప్రక్రియను కూడా కఠినతరం చేశారు. ఈ క్రమంలోనే తాజాగా చైనా విషయంలో ట్రంప్ యూటర్న్ తీసుకోవడం గమనార్హం.

తాజాగా వైట్‌హైస్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'చైనీస్ విద్యార్థులను అమెరికాలోకి మేం అనుమతించబోమంటూ వచ్చిన వార్తలను విన్నాం. కానీ, మేం వారికి మన విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలనుకుంటున్నాం. మనకు అది చాలా ముఖ్యం కూడా. 6 లక్షల మంది చైనా విద్యార్థులు అమెరికాకు వచ్చేందుకు అనుమతిస్తాం. ఆ దేశంతో సంబంధాలు మెరుగుపరుచుకోవాలనుకుంటున్నాం'అని ట్రంప్ వెల్లడించారు. ప్రస్తుతం అమెరికా వర్సిటీల్లో దాదాపు 2.70 లక్షల మంది చైనీస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. ట్రంప్ తాజా ప్రకటన రాజకీయ వివాదానికి దారితీసింది.

ఆయన నిర్ణయాన్ని సొంత పార్టీ నేతలు, మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) మద్దతుదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా విద్యార్థులకు అవకాశం కల్పించడం అంటే.. 'అమెరికా ఫస్ట్' అజెండాకు ద్రోహం చేసినట్టేనని మండిపడుతున్నారు. అమెరికా విద్యార్థులకు రావాల్సిన అవకాశాలను చైనీయులకు ఎలా కల్పిస్తారని ప్రశ్నిస్తున్నారు. అయితే, ట్రంప్ నిర్ణయాన్ని అధ్యక్షుడి యంత్రాంగం సమర్థించింది. 'చైనీస్ విద్యార్థులను అనుమతించకపోతే.. అమెరికాలో 15 శాతం యూనివర్సిటీలకు పని లేకుండా పోతుంది. ఆర్థిక విధానాలను పరిగణనలోకి తీసుకునే ట్రంప్ హేతుబద్ధంగా వ్యవహరించారు' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు.

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు

## పాకిస్థాన్‌కు సిడిఎస్ పరోక్ష హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. అది ఇప్పటికీ కొనసాగుతోంది. త్రివిధ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీవార్ కాలేజీలో ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్తాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, భారత్ ఎల్లప్పుడూ శాంతివైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్లం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు అని అన్నారు.

గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనావేసేవారు. కానీ ఇప్పుడు ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి అని ఆయన తెలిపారు. వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం సశస్త్ర, సురక్షిత్, ఆత్మనిర్భర్‌గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ రణ్‌సంవాద్ సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగించారు.

# అమెరికా టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చు

## భారత్, యుఎస్ వాణిజ్య చర్చలు సఫలం అయ్యే అవకాశం

## ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆశాభావం



**ముంబై, ఆగస్టు 26:** భారత్‌అమెరికా మధ్య వాణిజ్య ప్రతినిధుల చర్చలు సఫలం కాగలవన్న ఆశాభావాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు కొనుగోళ్లకుగాను దేశీయ ఎగుమతులపై 25 శాతం జరిమానాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నుంచే ఇవి అమల్లోకి రానున్నాయి. దీంతో అగ్రరాజ్యంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై సుంకాల భారం 50 శాతానికి చేరబోతున్నది. ఇప్పటికే ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం ఆలస్యానికిగాను వేసిన 25 శాతం టారిఫ్‌లు అమల్లో ఉన్నాయి మరి. ఈ క్రమంలోనే ఇరు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆకాంక్షను సోమవారం ఇక్కడ ఫిక్కి, ఐబీఏ (ఫిబక్) నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ కనబర్చారు. వాణిజ్య చర్చలు సఫలమైతే భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావం తగ్గొచ్చన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. అమెరికా టారిఫ్‌లు భారత్‌పై 50 శాతానికి పెరిగితే వస్త్ర, రొయ్యల ఎగుమతులు ఖరీదెక్కనున్నాయి. ఇదే జరిగితే దేశంలో ఆయా రంగాలపై ఆధారపడ్డ వ్యాపారాలు, పరిశ్రమలు, ఉద్యోగులు, రైతులు ఇబ్బందుల్లో పడ్డట్టేనన్న ఆందోళనలు కనిపిస్తున్నాయి.

**ద్రవ్య విధానంపై..**

దేశంలో ద్రవ్యోల్బణం, జిడిపి వృద్ధిరేటు రెండింటిపైనా ఆర్బీఐ దృష్టి పెడుతుందని, వాటికి అనుగుణంగానే తమ ద్రవ్య విధానం కొనసాగుతుందని ఈ సందర్భంగా మల్హోత్రా స్పష్టం చేశారు. ఈ ఏడాది మొదలు ద్రవ్య సమీక్షల్లో కీలక వడ్డీరేటైన రెపో రేటును ఆర్బీఐ క్రమేణా తగ్గిస్తూ వస్తున్న సంగతి విదితమే. ఇప్పటిదాకా 4 ద్రవ్య సమీక్షలు జరుగగా.. మూడింటిలో 1 శాతం రెపో రేటు దిగింది. ఈ నెల సమీక్షలో మాత్రం యథాతథంగానే ఉంచింది. ఈ నేపథ్యంలో ఇక రాబోయే ద్రవ్య సమీక్షల్లో కేవలం జిడిపి బలోపేతంపైనేగాక, ధరల అదుపు కోణంలోనూ ఆలోచించి నిర్ణయాలుంటాయని ఆర్బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులకుతోడు ద్రవ్యోల్బణం అంశాలూ ఆర్బీఐ ముందు కీలకంగా ఉన్నాయంటున్నారు.

**పెట్టుబడులకు కలిసి..**

వృద్ధి లక్ష్యాలను ఆర్బీఐ విస్మరించట్లేదన్న మల్హోత్రా.. టారిఫ్‌లు, భౌగోళికరాజకీయ ఆందోళనల నుంచి సవాళ్లు ఎదురవుతున్న దృష్ట్యా కార్పొరేట్లు, బ్యాంకులు కలిసి పెట్టుబడులకు ఊతమివ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశ ఆర్థికాభివృద్ధికున్న అవకాశాలను వదులుకోలేమని, ఆర్థిక విస్తరణకున్న అన్ని మార్గాలనూ మరింత పెంచుకోవాలని సూచించారు. అందుకే బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు, కార్పొరేట్ల పనితీరు అత్యుత్తమంగా కనిపిస్తున్న ప్రస్తుత తరుణంలో ఆయా రంగాల్లో పెట్టుబడులకు దన్నుగా నిలవాలని చెప్పారు.

**క్రెడిట్ డిమాండ్ తగ్గింది: శెట్టి**

కార్పొరేట్ల నుంచి రుణాల డిమాండ్ తగ్గిందని ప్రభుత్వ రంగ ఎస్బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి అన్నారు. నేడు మెజారిటీ కార్పొరేట్ సంస్థలు ప్రైవేట్ క్రెడిట్ పట్ల ఆసక్తి చూపిస్తున్నాయని, నిధుల సమీకరణ కోసం క్యాపిటల్ మార్కెట్లలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. దీంతో దేశ వృద్ధి లక్ష్యాల సాధన కోసం పెద్ద ఎత్తున వచ్చే పెట్టుబడులకు దన్నుగా నిలవడానికి బ్యాంకులు చూస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే బ్యాంకులపైనున్న కొన్ని రకాల ఆంక్షలు తొలగిపోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అయితే ఇందుకు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సానుకూలంగా స్పందించారు.

**ఎఐతో బ్యాంకింగ్‌కు కొత్త రూపు**

భారతీయ బ్యాంకింగ్ రంగం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లేదా ఎఐ)తో కొత్తరూపును సంతరించుకోగలదని ఓ నివేదిక అభిప్రాయపడింది. ఉద్యోగాలపై ఏఐ ప్రభావంపట్ల ఆందోళనలు కనిపిస్తున్న వేళ ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని దక్కించుకుంటున్నది. కాగా, బ్యాంకులు ఏఐని అందిపుచ్చుకుంటే ఎన్నో లాభాలను పొందగలవని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బిసిజి) ఈ రిపోర్టులో పేర్కొన్నది. గడిచిన దశాబ్ద కాలంలో బ్యాంకులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై చేసే ఖర్చులు ఐదింతలు పెరిగాయని, ఉత్పత్తిలో అందుకు ఒనగూరిన లాభం మాత్రం 1 శాతమేనని గుర్తుచేసింది. అయితే ఎఐతో ఈ తరహా నష్టాలను అధిగమించవచ్చని చెప్పింది. నిజానికి ఇప్పటికే అనేక బ్యాంకులు ఏఐ సాధనాలు వినియోగిస్తున్నాయని తెలిపింది.



# ప్రధాని మోడీ, పుతిన్‌కు చైనా అధ్యక్షుని ఆహ్వానం

## ఎస్‌సిఒ సమ్మిట్‌కు రావాలని పిలుపు

**బీజింగ్, ఆగస్టు 26:** ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకారం సదస్సు(ఎస్‌సిఒ)లో పాల్గొనేందుకు భారత ప్రధాని మోడీ చైనా వెళ్తున్నారు. ఈ సదస్సు సందర్భంగా మోడీతోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వయంగా ఆహ్వానించనున్నారట. అమెరికా టారిఫ్‌ల వేళ.. గ్లోబల్ సౌత్ దేశాలకు (వర్థమాన దేశాలు) సంఘీభావంగా శక్తివంతమైన ప్రదర్శనలో భాగంగానే ఈ చర్య ఉండనుందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

మోడీ, పుతిన్‌తోపాటు మధ్య, పశ్చిమ, దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల నేతలకు ఈ ఎస్‌సిఒ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు ఒకటి మధ్య తియాంజిన్ వేదికగా ఈ సదస్సు జరగనుంది. ప్రధాని మోడీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. తర్వాత చైనా అధ్యక్షుడు 2019లో భారత్‌లో పర్యటించారు. ఈ తర్వాత 2020లో లడ్డాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ అయిన సంగతి తెలిసిందే.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో భారత్‌పై విరుచుకుపడుతోన్న వేళ.. మోడీ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సుంకాలను డ్రాగన్ ఖండించింది. వాణిజ్య, సుంకాల యుద్ధాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారంలో భారత్ వెన్నంటి నిలుస్తామని ప్రకటించింది.

మరోపక్క ఢిల్లీలోని రష్యా రాయబారి మాట్లాడుతూ.. భారత్, చైనాతో కలిపి త్వరలో త్రైపాక్షిక చర్చలు జరుగుతాయని భావిస్తున్నట్లు మీడియాతో వెల్లడించారు. ఆ సదస్సు వేళ ఈ ముగ్గురు నేత మధ్య సమావేశం జరగొచ్చని తెలుస్తోంది.

కాగా.. 'చైనా, ఇరాన్, రష్యా.. ఇప్పుడు భారత్‌పై వాషింగ్టన్ తీసుకుంటున్న చర్యలు ఎలాంటి ప్రభావం చూపలేదు. ఈ తరుణంలో అమెరికా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ క్రమం ఎలా ఉండనుందో తెలియజేసేందుకు జిన్‌పింగ్ ఈ సదస్సును ఉపయోగించుకోవాలని అనుకుంటున్నారు' అని చైనాగ్లోబల్‌సౌత్ ప్రాజెక్టు ఎడిటర్ ఇన్ చీఫ్ ఎరిక్ ఒలాండర్ అభిప్రాయపడ్డారు. ఎస్‌సిఒ చరిత్రలో ఇదే భారీ సమావేశంగా నిలుస్తుందని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయమంత్రి ఇప్పటికే వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

# సంక్షిప్తంగా..

### శ్రీలంక మాజీ అధ్యక్షుడు విక్రంసింఘేకు బెయిలు

**కొలంబో, ఆగస్టు 26:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు రణిల్‌విక్రమ్‌సింఘేకు మంగళవారం కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై రణిల్‌విక్రమ్‌సింఘేను ఈ నెల 22న అరెస్టు చేసిన విషయం విదితమే. ఓవైపు రణిల్ మద్దతుదారులు కోర్టు ఆవరణలో గుమిగూడిన సందర్భంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య మంగళవారం మధ్యాహ్నం కోర్టుకు ఆయనకు అనారోగ్య కారణాలరీత్యాత బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 22న విక్రమ్‌సింఘేను కస్టడీలోకి తీసుకోగానే ఆయనను జైలులోని ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కొలంబో నేషనల్ హాస్పిటల్‌లోని ఐసియులో ఉంచి అప్పటి నుంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులు స్థానిక మీడియాతో మాట్లాడుతూ 76 యేళ్ల వయసున్న రణిల్‌కు హైబిపి, మధుమేహానికి సంబంధించి చికిత్స అందిస్తున్నామన్నారు.

### శ్రీదేవి ఆస్తి కబ్జా అయిందని కోర్టును ఆశ్రయంచిన బోనీ కపూర్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఒకప్పటి బాలీవుడ్ అగ్ర హీరోయిన్ దివంగత శ్రీదేవి ఆస్తిని చెన్నై నగరానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్ర మించుకున్నారని ఆరోపిస్తూ ఆమె భర్త బోనీ కపూర్ చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. 1988 ఏప్రిల్‌లో శ్రీదేవి మద్రాసులో సంబంద మొదలియార్ అనే వ్యక్తి దగ్గర ఒక స్థిరాస్తిని కొన్నారు. మొదలియార్‌కు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు వున్నారు. అందరి సంతకాలు చేసిన తరువాత తన భార్య శ్రీదేవి ఈ ఆస్తిని కొన్నదని ఆయన హైకోర్టుకు తెలిపారు. అయితే ఈ ఆస్తిలో తమకూ వాటా వుందని చెబుతూ మొదలియార్ రెండవ భార్య కుమారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అప్పీల్ చేసి చట్టవిరుద్దంగా హక్కులు పొందారని బోనీ కపూర్ తెలిపారు. చట్ట విరుద్దంగా తన భా ర్య ఆస్తిని మరొకరికి రావడంలో అధికారుల పాత్ర వుందని బోనీ కపూర్ ఆవేదన చెందారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి ఆనంద్ ఈ కేసును నాలుగు వారాల్లో తేల్చాలని తాంబరం తహసీల్దార్‌ను ఆదేశించారు.

### పాక్ గూఢచారి మోతీరాంకు భారీ నెట్‌వర్క్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సిఆర్‌పిఎఫ్‌లో ఎఎస్‌ఐగా పనిచేస్తూ పాక్ గూఢ చార సంస్థ ఐఎస్‌ఐతో జతకట్టి అరెస్టయిన మోతీరాంకు అ టు పాక్ ఇటు భారత్‌లో భారీ నెట్‌వర్క్ వున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) గుర్తించింది. మోతీరాం జాట్ భారత సైన్యంతో పాటు పారా మిలటరీ బలగం, ప్రభుత్వ విభాగాల్లో కీలక హోదాలో వున్న పలువురు టచ్‌లో వున్నట్లు ఎన్ఐఎ గుర్తించింది. వీరిలో నలుగురు మిలటరీ అధికారులు, మరో ఇద్దరు పారా మిలటరీ అధికారులు మిగతా వారు ప్రభుత్వ విభాగాలకు చెందిన వారుగా ఎన్ఐఎ గుర్తించింది. మోతీరాం జాట్‌ను గత మే నెల 27వ తేదీన ఎన్ఐఎ అరెస్టు చేయడం తెలిసిందే. జాట్‌ను అరెస్టు చేసిన తరువాత ఈ కేసు విచారణను ఎన్ఐఎ చేబట్టడం విదితమే. దీని తరువాత అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న ఎన్ఐఎ అందులోని నంబర్లను విశ్లేషించగా 15 మందితో అతను తరచూ మాట్లాడుతున్నట్లు తేలింది. ఇందులో అనేక కాల్స్ ఇంటర్నెట్‌విగా వున్నాయి. జాట్ పాకిస్తాన్‌లోని లాహోర్‌కు చెందిన సలీం అనే ఆపరేటర్‌తో తరచూ సంభాషించేవాడని ఎన్ఐఎ తేల్చింది.

### భారీ వరదలతో మనాలిలో కొట్టుకుపోయిన రోడ్లు, హోటళ్లు



**మనాలీ, ఆగస్టు 26:** హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదలు వల్ల కిరాట్పూర్, మనాలీ జాతీయ రహదారిపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయింది. మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్ ఆ వరదలో కొట్టుకు పోయింది. మండి, కులు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటలపాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరి స్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు.

27-08pg6exHMNWJQE 10_27-08pg6exHMNWJQE.qxd 8/27/2025 12:09 AM Page 1





# రాష్ట్రం అంతటా వినాయకచవితి ఉత్సవాల సందడి

**విజయవాడ,ఆగస్టు26,ప్రభాతవార్తప్రతినిధి:** వినాయక చవితి బుధవారం జరుగుతుంది..దీంతో పల్లె నుంచి నగరాల వరకు ఉత్సవ సందడి నెలకొంది.పాలవెల్లు,పత్రి కోసం భక్తులు అప్పుడే మార్కెట్లల్లో హడావిడి చేస్తున్నారు.భాద్రపద మాసం వచ్చిందంటే చాలు. వినాయక చవితి పండగ సందడి మొదలవుతుంది. పిల్లలు, పెద్దలు కలిసి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కొన్ని చోట్ల 11,21 రోజుల వరకు ఉత్సవ పందిళ్లలో స్వామిని వెంచేయింపచేసారు.నిజానికి భారతీ సంస్కారానికి ఈ వర్షదినం ఓ మచ్చుతునక,ప్రకృతి పండే ఎన్నో సదుపాయాలను స్వామి పేరిట భక్తులు అన్వేషించి భద్రపర్చుకుంటారు.వినాయకుని పండుగను ఊరువాడ అంతా ఎంతో ఉత్సాహంగా విగ్రహాలను ప్రతిష్టించి పూజలు చేస్తారు. చాలామంది తమ ఇళ్ళు, అపార్ట్ మెంట్ ప్రాంగణాల్లో వినాయకుడి విగ్రహాలను పెట్టి పూజలు చేస్తుంటారు. ఇవి మతాలకతీతంగా జరుగడం ఓ విశేషం..ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పండుగ శోభ సంతరించుకుంది. స్వీట్ షాపులు, మార్కెట్ ప్రాంతాలు కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. మట్టి వినాయకుని పూజించాలనే భావన ప్రజల్లో ప్రతి ఏటా పెరుగుతోంది. పర్యావరణ హితమైన గణనాథుల వైపు జనం మొగ్గు చూపుతున్నారు. నీటి కాలుష్యం గాలి కాలుష్యం తగ్గించాలని ఎకో ఫ్రెండ్లీ వినాయకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో ప్రత్యేకంగా మట్టి గణనాథులను తయారు చేసి వితరణ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో వినాయక చవితికి మంచి క్రేజ్ ఉంది. పిల్లలు, పెద్దలు కలిసి ఈ పండుగ జరుపుకుంటారు. ఆంధ్రప్రదేశ్ లో విజయవాడలో అద్భుతంగా ఈ గణనాథుడి ఉత్సవాలు జరుగుతాయి. గత శతాబ్దపు తొలినాళ్ళ ఇక్కడ ఆరంభమైన వినాయక చవితి ఉత్సవాలు తెలంగాణాకు విస్తరించాయి.గణేషుడికి ఇష్టమైన స్వీట్స్, వంటలు చేసి నైవేద్యంగా పెడతారు. ఇందుకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్లకు, నగరాలకు క్యూ కట్టారు. విజయవాడలోని ప్రధాన మార్కెట్టు, ముఖ్యమైన రహదారుల కూడళ్లలో గరిక, వెలక్కాయలు, సీతాఫలాలు, అరటి పిలకలు సహా పూజకు అవసరమైన వస్తువులన్నీ విక్రయిస్తున్నారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వీటిని ఆటోలు, ద్విచక్రవాహనాల్లో తెచ్చి అమ్ముతున్నారు. పండుగల్లో ఇది మొదటిది కావటే ధరలను చేసుకుంటామని ప్రజలు చెబుతున్నారు. మండపాల్లోని ఇప్పటికే ఆకర్షణీయమైన వినాయకులను కొలువుదీరారని, స్నేహితులు కుటుంబ సభ్యులతో కలిసి దర్శనం చేసుకుంటామని అంటున్నారు. అటు పండుగ వేళ ధరలు మండుతున్నాయని పలువురు అంటున్నారు. మల్లెపూలు మూర 60 రూపాయలు చెబుతున్నారని, ఒక్కో కొబ్బరి కాయ రూ.50 అని తెలిపారు. ఎట్లుగా 10 రకాలు వస్తువులు: పండుగలు వస్తే ధరలు పెంచేస్తారని అన్నారు. సామాన్యులకు ధరలు అందుబాటులో లేవని, ఇలా అయితే పండుగ ఎలా చేసుకోవాలని నగర వాసులు అడుగుతున్నారు. వినాయక చవితికి బాగా వ్యాపారాలు ఉన్నాయని విక్రయదారులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే స్వీట్లు, పూజ సామాగ్రి కొనుగోలుకు జనం వస్తున్నారని తెలిపారు. 10 రకాలు పూజా వస్తువులు సెట్ లుగా విభజించి ఒక్కొక్కటి రూ.100కి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు.

### సీమలో విద్యుత్ రైలు మార్గాలను తనిఖీ చేసిన ఇఐజి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 26,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంటూరు-గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలో పూర్తయిన రైల్వే విద్యుదీకరణ మార్గాలను విద్యుత్ తనిఖీల(ఇఐజి) అధికార బృందం విస్తృత తనిఖీలు నిర్వహించింది. నిర్ణీత కార్యక్రమం మేరకు ప్రత్యేక ఇఐజి, స్పిక్,టవర్ కార్‌లలో పాణ్యం-నంద్యాల, ఎర్రగుంట్ల-నంద్యాల మధ్య తాజాగా పూర్తయిన రెండో రైలు మార్గం విద్యుదీకరణ ప్రాజెక్టులను అందుబాటులోకి తెచ్చే క్రమంలో రైల్వే విద్యుత్,ఇంజనీరింగ్,సిగ్నల్,టెలికాం విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నెంబర్ 181లెవెల్ క్రాసింగ్ గేట్‌ను, పాణ్యం-నంద్యాల మధ్య 14.53కి.మీల డబ్లింగ్ విద్యుత్ రైలు మార్గానికి,నంద్యాల-ఎర్రగుంట్ల మధ్యన పూర్తైన విద్యుత్ రైలు మార్గాలను,నంద్యాల యార్డును, విస్తృత తనిఖీలు నిర్వహించారు. ట్రైల్ రన్, వేగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కె.దౌర్యా,సిహెచ్ఎస్ రెడ్డి,సుధాకర్,సుదర్శన్ రెడ్డి,అనిల్ కుమార్,శ్రావణ్ కుమార్,చంద్రశేఖర్‌తో పాటు విద్యుత్,ఇంజనీరింగ్,సిగ్నల్ విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు,విజయవాడ, గుంటూరు,గుంతకల్లు డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# వైద్యాధికారులు దృక్పథాన్ని మార్చుకోవాలి

## సృజనాత్మకతతో పనిచేయాలి - ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ హితవు

**విజయవాడ,ఆగస్టు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో నూతన శకాన్ని ఆవిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం తపిస్తున్నారని,వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. వైద్య శాఖ ఉద్యోగులు వైఖరిని మార్చుకుని ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆధునికత, వేగానికనుగుణంగా పనిచేయాలని హితవు పలికారు. మంగళవారంనాడు వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి పలు విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక విజ్ఞాన అవలంబన, ఆవిష్కరణల ఆధారంగా ప్రజారోగ్యాన్ని కొత్తపుంతలు తొక్కించడానికి అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. ఆయన బాటలో నడవడానికి ప్రభుత్వ వైద్యులు, ఇతర సహాయక సిబ్బంది కంకణబద్ధులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకోవాలి.. తాము విధులు నిర్వహిస్తున్న తీరు ముఖ్యమంత్రి ఆశయాల సాధనకు తోడ్పడుతుందా లేదా అనే వైద్యులు, ఇతర సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకుసాగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో అన్నారు. బండి నడుస్తోందిలే అన్న రీతిలో కాకుండా యావత్తు సిబ్బంది వినూత్నంగా ఆలోచించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, సామాన్యులు పలు ప్రజాసమస్యల్ని తన దృష్టికి తెచ్చినప్పుడు వాటిని సంబంధిత అధికారులు శీఘ్రమే పరిశీలించి తగు సమాచారాన్ని అందజేయాలని, ఈ విషయంలో ఆలస్యం జరగడంపై మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోకపోతే అది ప్రజాస్వామ్య ఉల్లంఘనకిందకు వస్తుందని, ఈ విషయంపై వైద్యులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఈ ఏడాది జూన్‌లో వైద్యారోగ్య శాఖ చేపట్టిన సాధారణ బదిలీల తీరు, ఫలితాలపై మంత్రి విభాగాధిపతులతో చర్చించారు. 7,200కు పైగా వైద్యులు, పాలనా సిబ్బందిని బదిలీ చేయగా వారిలో నిర్ణీత గడువులో 99 శాతం మంది కొత్త పోస్టింగ్ ల్లో చేరినట్లు ఉన్నతాధికారులు వివరించారు. నియమాల మేరకు వివాద రహితంగా భారీ స్థాయిలో సాధారణ బదిలీల ప్రక్రియను విజయవంతంగా ముగించినందుకు విభాగాధిపతులను, అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. గతానికి భిన్నంగా వివాద రహితంగా బదిలీలు జరిగాయనడానికి 99 శాతం మంది ఉద్యోగులు బదిలీ ఆదేశాలను ఆమోదించడం నిదర్శనమని మంత్రి అన్నారు. విభాగాల వారీగా వివిధ స్థాయిల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలను మంత్రి సమీక్షించారు. గతేడాది జూన్ నుండి వివిధ విభాగాలు చేపట్టిన నియామకాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ఖాళీలను ప్రణాళికాబద్ధంగా భర్తీ చేయాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఆయుష్, మందుల నియంత్రణ విభాగం,

ఆహార పదార్థాల కల్తీ నిరోధక విభాగాల్లో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఈ విభాగాలు సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# కొలిక్కిరాని తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్ష ఎన్నిక




**తిరుపతి,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశంపార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మంగళవారం తిరుపతి పార్లమెంట్ కమిటీ అధ్యక్ష అనుబంధ కమిటీల ఎన్నికలకు సంబంధించి మంత్రి సమక్షంలో పార్టీ నాయకులు ఒక అవగాహనకు రాలేకపోయారు. ఈ కమిటీ సమావేశం ఆద్యంతం ప్రశాంతంగా ముగిసినా అధ్యక్ష పదవికి పలువరు సీనియర్ నేతలు పోటీపడటంతో ఎవరినీ నియమించాలనే అంశాన్ని అధిష్టానానికి అప్పగించారు. మంగళవారం రేణిగుంటలోని వై కన్వెక్షన్‌లో తిరుపతి పార్లమెంటరీ సమావేశం జరిగింది. రాష్ట్రమంత్రి సవిత అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్,పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, ఎమ్మెల్యేలు పాశంసునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మి, పార్టీరాష్ట్రకమిటీ ప్రతినిధి మల్యాద్రి, రాష్ట్రపార్టీ కార్యదర్శులు వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్, తుడ ఛైర్మన్ దివాకర్‌రెడ్డి,పార్టీ నాయకులు హేమలత, పరసారత్నం, నెలవలసుబ్రమణ్యం, శ్రీదర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యమని, పార్టీకోసం కష్టపడిపనిచేసేవారికి పదవులు వస్తాయని మంత్రి సవిత తెలిపారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రజల్లో మరింత విస్తృతంగా ఓటుబ్యాంకు సంపాదించుకుంటుందన్నారు.పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యతనిచ్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ఉన్నారన్నారు. అందరినీ కలుపుకుని వెళ్ళే నాయకులకు పదవులు తప్పవన్నారు.

# మట్టి వినాయకుల విగ్రహాలు దేదీప్యమానంగా అలంకారాలు

**శ్రీకాళహస్తి,ఆగస్టు 26 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగలంటే యువకుల్లో కొత్త జోష్. ఇక్కడ నిర్వహించే ప్రతి పండగకు శ్రీకాళహస్తీశ్వరాయంతో సంబంధాలు ముడిబడి ఉంటాయి.ఈ నేపధ్యంలో వినాయక చవితి అంటే నవసంధి వినాయకులు గుర్తుకు వస్తారు.ఈ ఆలయాలకు దేవస్థానం సారె అందించే సంప్రదాయం ఉంది.ఈ సారె అందించే కార్యక్రమాలను ఓ పండగలా నిర్వహిస్తారు. ఈ నేపధ్యంలో ఈ ఏడాది బుధవారం సారెను శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ తెలుగుదేశం నాయకులుఅ ందిస్తారని ప్రకటించారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో 400 చోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసారు. పది రోజుల నుంచి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి,నాగార్జున్‌రెడ్డి,తిమ్మయ్యలు పీస్ కమిటి సమావేశాలు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచనలు చేసారు. మంగళవారం ఉదయం నుంచి విక్రయ కేంద్రాల నుంచి వినాయక విగ్రహాలు తరలి పోతున్నాయి. యువకులు జైబోలో వినాయక మహారాజ్ అ ంటూ నినాదాలుచేస్తూ ట్రాక్టర్లలో తమ స్థావరాలకు విగ్రహాలను తరలిస్తున్నారు. ఇక శ్రీకాళహస్తిలోని బేరివారి మండపం వద్ద 9 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ సారధ్యంలో నిర్వహిస్తున్నారు. బెంగుళూరు నుంచి రూ.75వేల విలువ చేసే విగ్రహాన్ని తరలించుటకు రూ.20వేలు వెచ్చించి రప్పించారు. హంసవాహనంపై వినాయకుని కన్నుల పండువగా తీర్చి దిద్దారు.ఇక ఎపెండ్లి మండపం వద్ద వినాయకుని పంచముఖ వినాయకుని తీర్చి దిద్దారు. ఈ ఏడాది వినాయక చవితి నిర్వాహాకులకు సామాజిక బాధ్యతగా ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారు.దాంతో నిర్వాహాకులైన యువకుల్లో ఇంకా జోష్ చోటు చేసుకుంది.శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 200 మండపాల వద్ద కిలోమీటర్ల దూరంలో విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేసారు. వివిధ రకాల విద్యుత్ దేవుళ్లను ఏర్పాటు చేసారు.ఎటు చూసినా విద్యుత్ దీపాల వెలుగులతో శ్రీకాళహస్తి



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

కాంతులీనుతుంది. విఘ్నాలకు అధిపతి వినాయకునికి పూజాది కార్యక్రమాలు నిర్వహించిన తర్వాతే ఏకార్యక్రమమైన ప్రారంభించడం మన సాంప్రదాయం. అందుకే ప్రతి ఒక్కరు చేపట్టే శుభకార్యాలు శుభప్రదంగా జరగాలని మొదటి పండుగ వినాయకుని చవితి ఉత్సవాన్ని దేశావ్యాప్తంగా కాకుండా ప్రపంచ వ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటున్నారు. అయితే రూపాన్ని వివిధ ఆకృతుల్లో వైవిద్యంగా తయారుచేసి అనేక చోట్ల యువకులు చలువ పందిళ్లు వేసి ప్రతిష్టించి పూజలు జరుపుతున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కూడా యువకులు పోటీలు పడి వినాయచవితి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈఏడాది శ్రీకాళహస్తి పట్టణంలో వివిధ రూపాల్లో గణపతి కొలువుదీరనున్నాడు. పర్యావరణానికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన బొమ్మలు వద్దు 'మట్టివినాయకులే ముద్దు' అని కొన్ని సంస్థలు ర్యాలీలు కూడా నిర్వహించారు.

శ్రీకాళహస్తి పట్టణంలోని బాబుఅగ్రహారం పురపాలక సంఘం ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పోలస్వామి.స్వర్ణమూర్తి రిటైర్డ్ అయిన తరువాత కూడా ధార్మిక కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం నిర్వహిస్తున్నారు. మిధున రాశి గణపతిగా రూపొందించారు. దీన్ని ముత్యాలమ్మ గుడివీధిలోని చక్రేశ్వరస్వామి దేవాలయం ఎదురుగా వున్న పోలస్వామి లేన్‌లో ప్రతిష్టించి మూడు రోజుల పాటు ఉంచి నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

# సెప్టెంబర్ 7న శ్రీవారి ఆలయం మూసివేత

## - చంద్రగ్రహణం కారణంగా 12గంటలు దర్శనాలు రద్దు

**తిరుమల,ఆగస్టు 26ప్రభాతవార్తప్రతినిధి:** సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7వతేదీ ఆదివారం 12గంటలు పాటు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నారు. 7వతేదీ సాయంత్రం 3.30గంటల నుండి 8వతేదీ వేకువజామున 3గంటల వరకు ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సెప్టెంబర్ 7వతేదీ రాత్రి 9.50గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 8వతేదీ వేకువజామున 1.31గంటల వరకు పూర్తవుతుంది. సాధారణంగా గ్రహణ సమయానికి 6గంటల ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. సెప్టెంబర్ 8న తెల్లవారుజామున 3గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం, అర్చన సేవలను ఏకాంతంగా జరుపుతారు. ఆరోజు ఉదయం 6గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7వతేదీ ఆదివారం ఆలయంలో ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. అన్నప్రసాద భవనం, వితరణ కేంద్రాలు కూడా మూసివేస్తారు. శ్రీవారి భక్తులు ఈ విషయాన్ని తెలుసుకుని తమ తిరుమలయాత్ర చేయాలని కోరారు.

# బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగింపు

**విజయవాడ,ఆగస్ట26,ప్రభాతవార్తప్రతినిధి:** బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు ఆగస్టు 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగించినట్లు ఎక్సైజ్ కమీషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు.ఇందుకు సంబంధించిన లాటరీ డ్రా ఆగస్టు 30 ఉదయం 8 గంటలకు నిర్వహిస్తామని నిశాంత్ కుమార్ తెలిపారు. వినాయక చవితి, బ్యాంకు సెలవుల దృష్ట్యా గడువు పొడిగించినట్లు కమీషనర్ తెలిపారు. నిరంతర వర్షాలు, వరదల కారణంగా దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపారు.ఇందుకు సంబంధించి సవరణ షెడ్యూల్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ శాఖ కమీషనర్ వివరించారు. కొత్త గడువులపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలను నిషాంత్‌కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ అనుమతులతోనే క్వారీ నడుపుతున్నా

## - మనీ స్కామ్ కేసులో దోషిని పట్టుకున్న ఘనత మాది - పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి పలు అక్రమాలకు పాల్పడ్డాడు - ప్రశాంత కావలిలో చిచ్చు పెడితే సహించేది లేదని కాకాణికి హెచ్చరించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



**నెల్లూరు, ఆగస్టు 26, ప్రభాతవార్త-వైద్యం :** ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు తీసుకొని బ్లూ మెటల్ క్వారీని నడుపుతున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నెల్లూరులోని ఆయన నివాసంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2007లోనే ప్రభుత్వ అనుమతులతోనే నేను క్వారీ ఏర్పాటు చేశాను, ఎన్నో ప్రభుత్వాలు మారినా ఎవరు అభ్యంతరం చెప్పలేదు. కానీ 2023లో నేను టీడీపీ అభ్యర్థిని అవుతానని తెలిసిన రోజునే, ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో క్వారీపై దాడులు జరిగాయి. చట్టవిరుద్ధంగా 143 కోట్లు పెనాల్టీ విధించారు. నేను హైకోర్టు తలుపులు తట్టగానే ప్రభుత్వం తలదించుకుందని, క్లీన్ చిట్ ఇచ్చింది కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రతిపక్షం నిర్మాణాత్మకంగా విమర్శలు చేయకుండా వ్యక్తిగత స్థాయికి దిగజారిందని మండిపడ్డారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి గత కొన్ని రోజులుగా కావలిలో అవాస్తవ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రజాసేవకంటే వ్యాపారాలకు, వ్యక్తిగత లాభాలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఆయన కళ్యాణ మండపం, ఇల్లు, ఇంజనీరింగ్ కాలేజీ, స్కూల్, అన్ని ఆక్రమణలతో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నారన్నారు. డ్రోన్‌ల సహాయంతో క్వారీలో నా ఆచూకీ కనిపెట్టాలని చూశారని, రౌడీ షీటర్లతో నిరంతరం బెంగుళూరు నుండి మాజీ ఎమ్మెల్యే పర్యవేక్షిస్తూ ఉన్నాడని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న ప్రతాప్ రెడ్డి కావలిని గంజాయికి కేంద్రంగా మార్చారని తన అనుచరులు చందు, చైతన్య, ప్రసన్నల ద్వారా గంజాయిని అమ్మించారని తెలిపారు. 83 రోజులు జైల్లో ఉన్న కాకాని కావలికి వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నారని అన్నారు. కాకాణి నిజాయితీ గల నాయకుడివైతే ముందుగా రామిరెడ్డి భూములు, కళాశాలలు, ఆక్రమణలను ప్రజల ముందుంచాలని, ఆ తర్వాత నా క్వారీకి రావాలని, నేను రికార్డులు చూపించడానికి సిద్ధంగా ఉన్నానని, నేను తప్పు చేస్తే ప్రజల కాళ్లకు తలవంచి క్షమాపణలు అడుగుతానని అన్నారు.


మీరు చేసిన అక్రమాల జాబితా కావలి ప్రజలందరికి తెలుసునని, కావాలిలో శాంతిని భంగం చేసే హక్కు ఎవరికి లేదని హెచ్చరించారు. కావలిలో 70 కోట్ల మనీ స్కామ్ జరిగిందని, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డికి దీంతో సంబంధముందన్నారు. మూడు కోట్ల రూపాయల ఎన్నికల నిధులు సుభాని నుండి మాజీ ఎమ్మెల్యే తీసుకోవడం జరిగిందన్నారు.

సుభాని బ్యాంక్ అకౌంట్లు, ఆస్తులు సీజ్ చేయడం జరిగిందని, త్వరలోనే అందరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. కావలి ప్రజల అభ్యున్నతి కోసం నేను త్రికరణ శుద్ధిగా శ్రమిస్తున్నానని, ఒక వైపు సంక్షేమపథకాలు, మరో వైపు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కావలి నియోజకవర్గం అభివృద్ధి సాధన దిశగా అడుగులు వేస్తుందన్నారు.

ప్రతిపక్షాలు కావలిలో కక్షలు, వర్గాలు రేపడానికి ప్రయత్నిస్తున్నా, ప్రజలు నమ్మడం లేదని ఎమ్మెల్యే తెలిపారు. నన్ను నమ్మి గెలిపించిన కావలి ఓటర్లందరికి కృతజ్ఞతలన్నారు.

# కురుబ,కురుమ,కురువ జాతి అభివృద్ధేలక్ష్యం

## - రాష్ట్ర కురుబ,కురుమ,కురువ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు



**తిరుపతి హెల్త్, ఆగస్టు 26 ప్రభాతవార్త :** ఏపీ రాష్ట్రంలోని 12 కోట్ల మంది కురుబ,కురుమ, కురువ జాతి సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధే లక్ష్యం ఏపీ కురుబ, కురుమ, కురవ సంఘం పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు తెలియజేశారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జబ్బల శ్రీనివాసులు మాట్లాడారు. రాష్ట్రంలో 12 కోట్ల మంది మా జాతి బిడ్డలు ఉన్నారని,గత వైసీపీ ప్రభుత్వం, నేటి కూటమి ప్రభుత్వం మా జాతిని గుర్తించిన విషయాన్ని గుర్తు చేశారు. సంఘ బలోపేతంలో భాగంగా అన్ని జిల్లాల్లో సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతోందన్నారు. దీనిలో భాగంగా ఆగష్టు 28న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం అజయ్ పంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో పాటు అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతోందన్నారు. సంఘాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అవుతోందని, అక్టోబరు 12న విజయవాడలో సంఘం 10వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామన్నారు. ముందుగా అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని, ఆ జిల్లా నూతన కార్యవర్గాన్ని అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజక వర్గాలైన కోడూరు, రాజంపేట, రాయచోటి,తంబళ్ళపల్లి, మదనపల్లి, పీలేరు ప్రాంతాలు, రాష్ట్రంలోని కురుబ కుల బంధువుల పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు రెడ్డికుమార్, రాజన్న, రామాంజనేయులు, సంఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

# గణపయ్య బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

**కాణిపాకం, ఆగస్టు 26 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం సర్వం సన్నద్ధమైంది. కాణిపాకం దేవస్థానంలో బుధవారం నుండి సెప్టెంబర్ 16 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఉత్సవాలను గతంలో వలె సంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఆన్వేటి మండపం, సుపథమండపంలలో రంగవల్లికలను అందంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి త్వరితగతిన దర్శనం కల్పించేందుకు వీలుగా సామాన్య భక్తులతో పాటు విఐపీలకు, చంటిబిడ్డల తల్లులకు, వికలాంగులకు, ఉభయదారులకు ఆలయం వద్ద వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులందరికి స్వామివారి ప్రసాదాలు అందించేందుకు వీలుగా సుమారు 70 వేల లడ్డూ, ప్రసాదాలను సిద్ధం చేసి వుంచారు. వినాయక చవితి సందర్భంగా ఉభయదారులచే బుధవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకం అనంతరం 3గంటల నుండి భక్తులకు ఆలయంలో స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నేటినుండి వినాయకచవితి వేడుకలు

**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 26, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం వినాయకచవితి ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తామని ఇఓ వికె శీనానాయక్ తెలిపారు. శ్రీ నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వున్న శ్రీ గణపతి స్వామి వారి ఆలయం నందు, కొండపైన చిన్న రాజగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ మహాగణపతి స్వామివారికి (మృత్తికా గణపతిని ఇక్కడ ఏర్పాటు), చేసి ఉత్సవాలు చేస్తామన్నారు. 27న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, శ్రీ గణపతి హోమం, కథా శ్రవణం కార్యక్రమాలను చిన్నరాజగోపురం వద్ద నిర్వహిస్తామని సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 28 ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి హోమం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయన్నారు. 29 ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్తిగా గణపతి స్వామివార్లను నిమజ్జనం నిర్వహిస్తామని భక్తులు పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు. దుర్గమ్మవారిని దర్శించుకునే భక్తులు తమ పోన్లను మొబైల్ కౌంటర్లలో భద్రపరుచుకోవాలని ఆలయంలోకి తీసుకురాకూడదని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

మొబైల్స్‌ను దర్శనంలోకి తీసుకొస్తే అక్కడ దేవస్థానంలోని భద్రతా సిబ్బంది వద్ద వున్న భాక్స్‌లో వేస్తారన్నారు. అలాగే సంప్రదాయబద్ధమైన వస్త్రధారణతోనే దుర్గమ్మ దర్శనానికి రావాలన్నారు. అసభ్యకర దుస్తులతో దర్శనానికి రాకూడదని తెలిపారు.

# జనవరి నాటికి అందుబాటులోకి విజయవాడ పశ్చిమ బైపాస్ !

**విజయవాడ,ఆగస్ట26,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరానికి సునాయాసంగా చేరుకోవడానికి వీలుగా నిర్మిస్తున్న పశ్చిమ బైపాస్‌పై రోడ్డుపై వచ్చే ఏడాది జనవరి నాటిరి పూర్తిస్థాయిలో వాహనాలను అనుమతించనున్నారు. ఇప్పటికే ఈ రహదారిపై కొంత మేరకు అవసర సమయాల్లో వాహనాలను అనుమతిస్తున్నారు.ఈ రహదారిని పూర్తిగా వినియోగంలోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా మిగిలిన చిన్న పాటి పనులు ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. మొత్తంగా విజయవాడ పశ్చిమ బైపాస్ లో ప్యాకేజీ1లో భాగంగా గుండుగొలను కలపర్రు, ప్యాకేజీ2లో కలపర్రుచినఆవుటపల్లి వరకూ బైపా నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. ప్యాకేజీ3లో చినఆవుటపల్లి గొల్లపూడి, ప్యాకేజీ4లో గొల్లపూడికాజ వరకు జరగాల్సిన నిర్మాణ పనులకు సంబంధించిన అడ్డంకులు దాదాపు పూర్తి చేశారు. దీంతో జనవరి నాటికి విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డుపై ప్రయాణం మొదలవుతుందనే దీమాతో అధికార యంత్రాంగం ఉంది.ప్యాకేజీ3లో హైటెన్షన్ టవర్ల మార్పిడి అంశంపై వారం రోజుల్లో స్పష్టత వస్తుందంటున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌హెచ్16పై కాజ దగ్గర వెస్ట్ బైపాస్ ల్యాండింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.కీలకంగా ప్యాకేజీ ల్యాండింగ్ పనులు సాగుతున్నాయి. విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే వారు అనుసంధాన ప్రాంతానికి రాకుండా నేరుగా సర్వీస్ రోడ్డు నుంచి మళ్లించి 100 మీటర్ల దూరం తర్వాత హైవే ఎక్కించారు. ఈ పనులు పూర్తి చేసిన తర్వాత గుంటూరు నుంచి విజయవాడ వెళ్లే వాహనాలను కూడా ఇదే విధంగా డైవర్ట్ చేయనున్నారు. అనుసంధానం చేస్తున్న ప్రాంతంలో సర్వీస్ రోడ్డులను వేరు చేస్తుంది.

27-8P g7exHMNWJQE 11_27-8P g7exHMNWJQE.qxd 8/27/2025 12:07 AM Page 1



# ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు భారీగా కోత!

## త్వరలో కొత్త మార్గదర్శకాలు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ విదార్థులకు అమలు చేస్తున్న ఫీ రియింబర్స్ మెంట్‌కు భారీగా కోత పడనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలను మరింత కఠిన తరం చేయాలని సంక్షేమ శాఖలు నిర్ణయించాయి. రాష్ట్రం మొత్తం మీద ప్రతీ ఏటా 12.51 లక్షల మంది ఫీజు రీయింబర్స్ మెంట్‌ను పొందుతున్నారు.

ఇందులో 5 లక్షల మంది కొత్త వారు ఉండగా, అన్ని కోర్సులకు కలిపి సంవత్సరానికి 2,350 కోట్ల రూపాయలు చొప్పున ప్రభుత్వానికి ఖర్చవుతోంది. ఇప్పటి వరకూ సాంఘిక, గిరిజన సంక్షేమ విద్యార్థులకు ఎంత ర్యాంకు వచ్చినా పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్ చేస్తున్నారు. వెనుకబడిన తరగతులకు మాత్రం 10 వేల లోపు ర్యాంకు వస్తేనే ఇంజనీరింగ్‌లో మొత్తం చెల్లిస్తు, ఆపై ర్యాంకులకు 35 వేల రూపాయలను మాత్రమే ఇస్తున్నారు.

మరోపక్క రాష్ట్ర వ్యాప్తంగా ఫీ రియింబర్స్ మెంట్ భారం భారీగా పెరిగి వాటి నిమిత్తం బకాయిలు ఇప్పటికే దాదాపు 8.10 కోట్ల రూపాయల మేరకు పెరుగు పోయాయి. ఈ నేపథ్యంలో ఫీజు రీయింబర్స్ మెంట్ అర్హతల్లో మార్పులు చేసేందుకు సర్కార్ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

కొత్త మార్గదర్శకాల ప్రకారం దాదాపు 35 శాతం మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్‌కు అర్హత కోల్పోయే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రధానంగా డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర సాధారణ, సాంకేతిక కోర్సులకు గాను ఫీజు రీయింబర్స్ మెంట్ అర్హత విషయంలో కొత్తగా మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు ఉన్నారు.

ముఖ్యంగా ఒక సంవత్సరంలో 50 శాతం సబ్జెక్టులు పాస్ కావడంతో పాటు, 75 శాతం హాజరు ఉండాలనే నిబంధనలను కొత్తగా అమలు చేయనున్నట్లు సమాచారం. అంతేకాకుండా వివిధ సబ్జెక్టుల్లో నిర్దిష్ట మార్కులను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. డిగ్రీ కోర్సుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ లోపం ఎక్కువగా ఉన్న దృష్ట్యా అటువంటి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ అమలు చేయకుండా అనర్హులుగా చేసే ఆలోచన చేస్తున్నారు. సాంకేతిక కోర్సులకు సంబంధించిన ప్రధాన సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు తెచ్చుకున్న వారికే ఈ పథకాని వర్తింప చేయనున్నారు.



ఆచార్య రాంరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య సంజీవ్ సోనావాణే, ఆచార్య వర్సిటీ విసి ఘంటా చక్రపాణి తదితరులు.

## విశ్వవిద్యాలయాల్లో డిజిటల్ ఆవిష్కరణలదే భవిష్యత్తు

### ఘనంగా అంబేద్కర్ వర్సిటీ 44వ వ్యవస్థాపక వేడుకలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అగస్టు 26, ప్రభాతవార్త:** మారుతున్న ఆధునిక సవాళ్లను అధిగమిస్తూ సరికొత్త డిజిటల్ ఆవిష్కరణలతో దూరవిద్యావిధానం అభివృద్ధిలో పయనిస్తుందని యశ్వంతరావు చవాన్ మహారాష్ట్ర విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య సంజీవ్ సోనావాణే అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ 44వ వ్యవస్థాపక వేడుకలను మంగళ వారం విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. 'సార్వత్రిక దూర విద్యలో కృత్రిమ మేధ ఆధారిత పరివర్తన పేరుతో నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక దూరవిద్య విధానం ఒక కొత్త యుగంలోకి ప్రవేశించిందని, దీనిలో ఆర్టిఫిషియల్ ఇంటి లిజెన్స్ ఎంతో ఆవశ్యకత సంతరించుకొందన్నారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇం టికి దూరవిద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. త్వరలో విశ్వవిద్యాలయంలో డిజిటల్ రిసోర్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ మైక్రో క్రెడెన్షియల్ కోర్సులను ప్రారంభించారు. జాతీయ సెమినార్ పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. ఘంటా చక్రపాణి సేకరించిన 1,100ల పుస్తకాలను వర్సిటీ లైబ్రరీకి అందించారు. కేంద్ర ప్రభు త్వం ఆధీనంలో పనిచేసే అనువాదిని సంస్థతో జరిగిన అవగాహన ఒప్పం దం మేరకు ఆయా ఒప్పందపత్రాలను సంస్థ సిఇఒ చంద్రశేఖర్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విజయకృష్ణారెడ్డి మార్చుకున్నారు. కార్య క్రమంలో పలువురు అధ్యాపకులు, డీన్లు, బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఆచార్య జి.రాంరెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## రాష్ట్రంలో పాలన పక్కకుపెట్టి ఢిల్లీ టూర్లు, విదేశాలకు వెళ్లిన ఘనత రేవంత్‌రెడ్డిదే

### బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత 20 నెలల పాలనలో ప్రజాసమస్యలను పట్టించుకోకుండా 50సార్లు ఢిల్లీతోపాటు బీహార్, కలకత్తా, విదేశాల టూర్లకు వెళ్లిన ఘనత కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని బిజెపి అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1978-83 మధ్య ఐదు సంవత్సరాల్లో నలుగురు ముఖ్యమంత్రులు మారినా, ఒక ముఖ్యమంత్రి మాత్రమే 75 సార్లు ఢిల్లీకి వెళ్లాడు. కానీ రేవంత్ రెడ్డి కేవలం 20 నెలల్లోనే దాదాపు ఆ రికార్డుకు దగ్గరయ్యారన్నారు. ప్రజలు అడుగుతున్నారు... మేము ఎన్నుకున్న ముఖ్యమంత్రి ఎక్కడ? ఎప్పుడూ ఢిల్లీలోనా, బీహార్‌లోనా, లేదంటే విదేశాల్లోనా? అంటూ ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఎప్పుడైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవాలనుకుంటే - వారు హైదరాబాద్‌లో ఉండరు, సెక్రటేరియట్‌కి రావడం లేదు, ప్రజలకు అసలు అందుబాటులో ఉండడం లేదు,

ఎప్పుడూ ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి తిరుగుతూనే ఉన్నారు అన్నారు. అందుకే ఆయనకు సరిపోయే బిరుదు ఒకటే -ది బెస్ట్ హాపింగ్ చీఫ్ మినిస్టర్ ఆఫ్ ది కంట్రీ, ఇటీవల సోనియా గాంధీ రేవంత్ రెడ్డికి బాస్కర్ అవార్డు ఇచ్చినట్లే, ఇకపై ఈ హాపింగ్ చీఫ్ మినిస్టర్ అవార్డు కూడా ఆయనకే దక్కుతుందన్నారు. గ్యారెంటీలు అని చెప్పి, హామీలు అని చెప్పి, కొత్త కొత్త స్కీమ్స్ తెస్తామని పదే పదే చెబుతూ ప్రజలను మోసం చేశారన్నారు. ఇటీవల మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వివిధ జిల్లాల పర్యటనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన వద్దకు వచ్చి పిటిషన్లు, మెమోరాండాలు ఇచ్చారని, ముఖ్యమంత్రికి కనీసం ఒకసారి చెప్పండి.. మా సమస్యలు విని పరిష్కరించేలా హితవు పలకండి అని ప్రజలు వేడుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హోం మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, గత 20 నెలల్లో తెలంగాణ రాష్ట్రంలో అనేక ఘోరాలు జరిగాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు పెరిగాయని, మహిళలపై అత్యాచారాలు భయంకరంగా పెరిగాయన్నారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను సక్రమంగా వినియోగించి ఉంటే, తెలంగాణ రాష్ట్రం ఈ రోజుకి మరింత అభివృద్ధి చెంది ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలతో పోటీపడే స్థాయిలో నిలిచేది. కానీ ఆ అవకాశాన్ని వినియోగించుకోలేక, ప్రజలను మోసం చేశారన్నారు.

## 29 నుంచి ఎడ్‌సెట్ సెకండ్‌ఫేజ్ కౌన్సెలింగ్

### సెప్టెంబరు 11న సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి అవకాశం కల్పించినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థుల లిస్టును సెప్టెంబర్ 4న ప్రకటించనున్నారు. అర్హులైన వారు సెప్టెంబర్ 5, 6 తేదిల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 7న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యం కల్పించారు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి సెప్టెంబర్ 11న సీట్ల కేటాయింపు చేస్తారు. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 12 నుంచి 16 వరకు ఆయా కాలేజీల్లో చేరాలని కన్వీనర్ సూచించారు. రాష్ట్రంలో 14,295 కన్వీనర్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి కోసం మొదటి విడతలో 17,151 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 9955 మందికి సీట్ల కేటాయింపు చేశారు.

## పెండింగ్‌లోని ఎస్టీ ప్రత్యేక నిధుల వినియోగానికి చర్యలు

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** గత ప్రభు త్వం హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధులు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. హైద రాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖలో మంగళవారం జరిగిన సమా వేశంలో మాట్లాడుతూ ఎస్టీల సంక్షేమం కోసం ఆయా సంవత్సరాలలోనే ఖర్చు కాకుండా మిగిలిపోతు న్నాయని చెప్పారు. వాటిని అదే యేడాది సకాలంలో ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామ న్నారు. అలాగే ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగాలలో ప్రమోషన్లు సకాలంలో వచ్చేలా రోస్టర్ విధానాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వ ఆశించిన విధంగా జరిగేలా చూడాలన్నారు. విద్యార్థుల డైట్,కాస్మెటిక్ ఛార్జీలు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ దేశంలో అన్ని కార్పొరేషన్లూకొంత నిర్వీర్యమైనాయని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఆయా కార్పొరేషన్లకు అవసరమన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చించిఇప్పటికే కొన్ని విధాన పరమైన నిర్ణయాలను తీసుకోగలి గామన్నారు. ఇక మీదట ఎస్సీ ఎస్టీ కమీషన్ ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబు నాయక్, లక్ష్మినారాయణ, శంకర్, రేణికుంట్ల ప్రవీణ్‌తో పాటు, గిరిజన సంక్షేమ కార్యదర్శి వర్షిణి, అదనపు సంచాలకులు విట్టా సర్వే శ్వర్‌రెడ్డి, ఎస్టీ గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాలి

### ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేదని, రైతులు ఎటు వంటి ఆందోళన చెందవద్దని ఎక్సైజ్ పర్యా టక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యూరియా విక్రయించే పి. ఏ.సి.ఎస్., ప్రైవేట్ ఎరువుల డీలర్ షాపుల వద్ద ప్రభుత్వ అధికారిని నియమించి పర్యవేక్షణ చేసేలా బాధ్యతలు అప్ప గించాలని ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎం.ఎల్.సి.లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు, ఎస్.పి.లు, వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులతో యూ రియా సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. వ్యవసాయ సీజన్ పూర్తి అయ్యే వరకు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

యూరియా సరఫరాపై జిల్లా కలెక్టర్ లు,ఎస్.పి .లు ప్రత్యేక దృష్టి సారించి నిశితంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ యూరియా సరఫరాలో ఎటువంటి అవకతవకలు జరిగినా,దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించిన అటువంటి ఎరువుల డీలర్ లపై,నకిలీ విత్తనాలు విక్రయించిన, అధిక రేటుకు విక్రయించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్‌లు, ఎస్.పి.లను ఆయన ఆదేశించారు. యూరియా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నా యని వాస్తవంగా కేంద్రం నుండి రావాల్సిన 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా ఇప్పటివరకు 5.72 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా వచ్చిందని ఇంకా సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉందని తెలిపారు. పూర్తిగా యూరియా వస్తే రైతులకు ఎటువంటి ఇబ్బంది రాదని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్రంతో,కేంద్ర మంత్రులతో మాట్లాడి వెంటనే యూరియా రాష్ట్రానికి వచ్చేలా అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో ఎం.ఎల్.సి కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి,శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, చిక్కుడు వంశీ కృష్ణ, కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి,బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, చిట్టెం పర్ణికా రెడ్డి,తూడి మేఘా రెడ్డి,డి.సి.సి. బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## సాంకేతిక సమస్యల్లో రామగుండం ఎరువుల ప్లాంట్

### యూరియా ఉత్పత్తికి బ్రేక్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రానికి అత్యధికంగా యూరియాను సరఫరా చేసే రామ గుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీ ఎల్) ప్లాంట్ సాంకేతిక సమస్యల్లో కొట్టుమిట్టాడుతోంది. తరచూ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడి యూరియా ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి, దీని ఫలితంగా రాష్ట్రానికి సకాలంలో, వాటా ప్రకారం రావాల్సిన యూరియా రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్లాంట్ 2021 మార్చి 22న యూరియా ఉత్పత్తిని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 20 సార్లు సాంకేతిక సమస్యలు ఏర్పడి నిలిచిపోయింది. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు రెండు సార్లు ప్లాంట్ షట్డౌన్ కాగా, తాజాగా హెచ్టీఆర్ మెషినరీలో సాంకేతిక లోపం కారణంగా ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. దీని ప్రభావం యూరియా ఉత్పత్తిపై చూపుతోంది. రామగుండం యూరియా ప్లాంట్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన సందర్భం లో పైప్లైన్లలో అమోనియా లీక్ అవుతోంది. దీంతో ప్లాంట్ మొత్తాన్ని రోజుల తరబడి షట్ డౌన్ చేయాల్సి వస్తోంది. మే 8న ప్లాంట్లో ఏర్పడిన లీకేజీ సమస్య కారణంగా జూన్ 15 వరకు 39 రోజులు ప్లాంట్ను షట్డౌన్ చేశారు. మళ్లీ జులై 16న సమస్య ఏర్పడడంతో ఆ రోజు నుంచి ఆగస్ట్ 4 వరకు 20 రోజులు ప్లాంట్ షట్డౌన్ అయింది. అలాగే హీట్ ట్రాన్స్ఫర్మింగ్ రీఫార్మర్ (హెచ్టీఆర్) లో ఈ నెల 14న టెక్నికల్ ఇష్యూతో లీకేజీ ఏర్ప డడంతో ప్లాంట్ మరోసారి షట్ డౌన్ అయింది. ఈ మెషీన్లో సాంకేతిక లోపం ఏర్పడితే దానికదే ఆటోమేటిక్గా ట్రిప్ అవుతుంది. ఈ సమస్య ప్లాం ట్‌లో నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుత 2025-26 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 4 లక్షల టన్నుల యూరియా ఉత్ప త్తిని లక్ష్యంగా పెట్టుకోగా, 2.71 లక్షల టన్నుల ఉ త్పత్తి మా త్రమే చేయగలిగారు. ఈ నెలలో 65 వేల టన్ను ల యూరియా ఉత్పత్తిచేసి రవాణా చే యాలని నిర్ణయించుకున్నా, కేవలం 24వేల టన్నుల యూరియాను మాత్రమే సరఫరా చేసింది.

## పెన్షనర్లను మోసం చేసిన ముఖ్యమంత్రి

### ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లు పెంచాలి

### 9న హైదరాబాద్‌లో పెన్షన్‌దారుల మహాగర్జన

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవ్వకుండా మోసం చేశాడని ఎంఆర్‌పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపిం చారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు, వృద్ధు లు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, చేయూత పెన్షన్‌దారుల ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు నిర్వ హించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. ఈ నెల ఓటు వేయండి,వచ్చే నెల నుండే పెన్షన్ తీసుకోండని మాట్లాడిన రేవంత్ రెడ్డి ఓటు వేశాక ముఖ్యమంత్రి అయి పెన్షన్ దారులం దర్నీ ఘోరంగా మోసం చేశాడని విమర్శించాడు.



మంగళవారం జడ్చర్లలో నియోజకవర్గ సన్నాహక సదస్సు మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

రేవంత్‌రెడ్డి చేసిన మోసం గురించి ప్రతిపక్షాలు కూడా మాట్లాడకుండా చేయూత పెన్షన్‌దారు లకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 50లక్షల మంది పెన్షన్ దారుల పక్షాన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మాదిగ రిజర్వే షన్ పోరాట సమితి పోరాటం చేస్తుందన్నారు. పెన్షన్లు పెంచకపోతే చలో హైదరాబాద్ సెప్టెంబర్ 9న పెరేడ్‌గ్రౌండ్‌లో లక్ష లాది మందితో మహాగర్జన నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమం లో వికలాంగ హక్కుల పోరాట సమితి జాతీయ ఉపాధ్యక్షులు బి.కె నరసింహం, ప్రధాన కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.

## మిగిలిపోయిన భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

### ఎస్‌ఎలుగా పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మిగిలిపోయిన భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్‌గా పదోన్నతులు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ ఉపా ధ్యాయ పండిత పరిషత్ తెలం గాణ (ఆర్‌యుపిపి టిజి) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భాషా పండితులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) లాంగ్వేజెస్‌గా పదోన్న తులు కల్పించిన ప్రజాప్రభుత్వానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహ్మద్ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల కాంతికృష్ణ కృతజ్ఞ తలు తెలిపారు. తమ సంఘం చేసిన ప్రాతినిధ్యం మేరకు అనతి కాలం లోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు, హిందీ, ఉర్దూ తదితర భాషాపండి తులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్న తులు కల్పించి నందుకు..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నా మన్నారు. రాష్ట్రంలో ఉన్నతీకరించవలసిన 1000 భాషా పండితుల పోస్టులను కూడా ఉన్నతీ కరించి.. పదోన్నతులు లభించని భాషాపండి తులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ముఖ్య మంత్రిని కోరుతున్నామన్నారు. పదోన్న తుల ప్రక్రియలో సహాయసహకారాలు అందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులందరికీ పండిత పరిషత్ పక్షాన ధన్యవాదములు తెలియజేస్తున్నా మన్నారు. స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు పొందిన

వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. తెలంగాణ రాష్ట్రంలో భాషల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గతంలో భాషా పండితులను స్కూల్ అసిస్టెంట్స్‌గా అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు కల్పించగా.. ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతు ల్లోనూ భాషా పండితులకు 500 మందికిపైగా పదో న్నతులు లభించినట్టు వారు తెలిపారు.

## ఈర్లపల్లి తండా రవినాయక్ మృతిపై విచారణ జరిపి నివేదికను ఇవ్వాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ఈర్లపల్లి తం డాకు చెందిన రవినాయక్ మృతిపై విచారణకు ఆదేశించారు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ. రవి నాయక్‌కి సకాలంలో చికిత్స అందకపోవడం వల్లనే మరణించారని పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో మంత్రి విచారణకు ఆదేశించారు.ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, విచారణ జరిపించాలని అధికారులను మంత్రి మంగళవారం ఆదేశించారు. మృతికి కారణాలు ఏమిటో తేల్చి, ఎవరిదైనా నిరక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లు.. డాక్టర్ రాజారావు, డాక్టర్ నాగేందర్‌లతో కమిటీ ఏర్పాటు చేస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా నిర్లక్ష్యం జరిగి ఉంటే వైద్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని జీర్ణించుకోలేని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

### సిపిఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** సెప్టెంబర్‌లో జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలో భాగంగా ఇండియా కూటమి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉండడం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా జీర్ణించుకోలేకపోతున్నారని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి విమర్శించారు. అమిత్ షా గుజరాత్ రాష్ట్ర హోమ్ మంత్రిగా ఉన్నప్పుడు సొరబ్ ఎన్‌కౌంటర్‌కి సంబంధించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తీర్పుతో .. అమిత్‌షా రెండు సంవత్సరాల పాటు గుజరాత్ రాష్ట్రం వెలుపల ఉండవలసి వచ్చిందని గుర్తు చేశారు. అప్పటి తీర్పుపై అమిత్‌షా ఇప్పుడు తన అక్కసు వెళ్లగక్కుతున్నాడని చాడా మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉండి న్యాయ వ్యవస్థ మీద మచ్చ తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలిస్తే మావో యిస్టులు 20 సంవత్సరాలు ముందుకెళ్తారని అమిత్ షా అనడం పట్ల ఆవే దన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ, అమిత్‌షా మావోయిస్టుల అవ శేషాలు లేకుండా చేయాలని చూస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య మూల సూ త్రాలకు విరుద్ధమన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కుతు న్నారని, 100 శాతం వికలాంగుడైన ప్రొఫెసర్ సాయిబాబాపై నిందారోపణలు చేసి 9 సంవత్సరాలు జైలులో పెట్టడంతో చనిపోయారని, చివరికి సుప్రీంకోర్టు కూడా సాయిబాబా నిర్దోషి అని తీర్పు ఇవ్వడం పట్ల అమిత్‌షాకు చెంపపెట్టు లాంటిన్నారు చాడ వెంకట్‌రెడ్డి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వం పట్ల దేశంలోని జడ్జీలు స్పందిస్తున్నారని.. ఎన్డీఎ కూటంలో కొనసాగుతున్న ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆలోచించి మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య రక్షణ వైపు ఉండాలని చాడ వెంకట్‌రెడ్డి సూచించారు.

## రూ.2 వేల కోట్ల రుణం తీసుకున్న సర్కార్

**హైదరాబాద్, ఆగస్టు 26, ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన బహిరంగ వేలంలో తెలంగాణ రాష్ట్ర సర్కారు రూ.2 వేల కోట్లు రుణం సేకరించింది. అందుకు గాను ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను మంగళవారం ఈ వేలం వేయడం ద్వారా సమీకరించింది. ఈ రూ.2 వేల కోట్ల మొత్తానికి గాను మూడు భాగాలుగా సెక్యూరిటీ బాండ్లను సమర్పించింది. ఇందులో 26 ఏండ్ల కాలానికి రూ.500 కోట్లు, 28 ఏండ్ల కాలానికి రూ.1,000 కోట్లు, 30 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.500 కోట్లు చొప్పున రుణాన్ని సమీక రించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.54,009 కోట్లు సమీకరించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం 2025-26 వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతిపాదించింది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రూ. 33,900 కోట్లు మేర రుణం తీసుకుంది. దీంతో వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రతి పాదిం చిన రుణ సమీకరణలో 60 శాతం దాటింది.

## యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్,ఆగస్టు 26, ప్రభాతవార్త:** యూరియా కొరతపై బిజెపి తప్పుడు ప్రచారం తగదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నప్పటికీ, రైతు లకు కావాల్సిన యూరియాను అందించడంలో కేంద్రప్రభుత్వం నిరక్ష్యధోరణితో వ్యవహరిస్తుందన్నారు. రైతులు యూరియా కొరకు నెల రోజులుగా రోడ్లపైకి వస్తున్నప్పటికీ బిజెపి నాయకులు కుంటి సాకులు చెబుతూ "కృత్రిమ కొరత" సృష్టించారనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్రం నుండి రాష్ట్రానికి కావాల్సి నంత యూరియాను తెప్పించడానికి రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నులు యూరియా కావాల్సి ఉండగా.. 1.5 లక్షల టన్నులను కేంద్రం తగ్గించిందన్నారు. ఇవ్వాల్సిన కోటాను కూడా ఇంత వరకు సకాలంలో సరఫరా చేయకపోవడంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. రైతులంతా సహకార సంఘాలు, షాపుల ముందు పడిగాపులు కాస్తున్నారని..ప్రభుత్వ కార్యాలయాల ముందు, రహదారుల మీద నిరసనలు తెలియజేస్తున్నారని చెప్పారు. నిరసనలు జరుగుతున్న చాలా చోట్ల తొక్కిసలాటలు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుండైనా రాష్ట్ర అవసరాలకు యూరియాను సరఫరా చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేకసార్లు కోరినప్పటికీ.. ఉద్దేశ్యపూర్వకంగానే కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం యూరియా కొరతను తీర్చడానికి, బ్లాక్ మార్కెట్‌ను నిరోధించడానికి ప్రభుత్వ సంస్థలైన హాకా, సహకార సంఘాల ద్వారా సరిపడా ఎరువులను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రానికి అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వం నుండి తెప్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డ్యూయల్ డిగ్రీ కోర్సులకు కౌన్సెలింగ్

**హైదరాబాద్ (అత్తాపూర్), ఆగస్టు 26, ప్రభాతవార్త:** ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బి.ఎస్సీ. (ఆనర్స్) అగ్రికల్చర్, బిఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్స్, బి.టెక్ (ఫుడ్ టెక్నాలజీ), బి.టెక్( అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) కోర్సులలో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ. సీహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు. అదేరోజు అనగా 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సు బి.ఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరగ నుందని రిజిస్ట్రార్ తెలిపారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ విభాగంలో ఈ రెండు కౌన్సెలింగ్‌లు నిర్వహించనున్నట్లు వివ రించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్‌లో సూచించిన రుసుమును తీసుకొని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు.



రిజిస్ట్రార్ డా.విద్యాసాగర్



# సింక్‌ఫీల్డ్ కప్‌లో గుకేష్ ఓటమి

## ఫిరోజ్జాను ఓడించి ఆధిక్యంలో ప్రజ్ఞా

**న్యూఢిల్లీ:** సింక్‌ఫీల్డ్ కప్-2025లో ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ వెస్లీ సో చేతిలో ఓడిపోయాడు. మరో టోర్నీలో ఫిరోజ్జాను ఓడించి ప్రజ్ఞానంద ఆధిక్యంలో ఉన్నాడు. సింక్‌ఫీల్డ్ కప్‌లో భాగంగా మంగళవారం జరిగిన టోర్నీలో గుకేష్ రూయ్ లోపెజ్‌లో అమెరికన్ చేతిలో పరాభవం చెందాడు. గుకేష్ బ్లాక్ పావులతో ఆడి వెస్లీ సో చేతిలో సంచలన ఓటమితో టోర్నమెంట్‌లో అతని కష్టాలు మరింత పెరిగాయి. మ్యాచ్‌లో 39 ఎత్తుగడల తర్వాత చివరికి రాజీనామా చేశాడు. గుకేష్ ఇప్పుడు ఏడు రౌండ్లలో కేవలం 3 పాయింట్లతో స్టాండింగ్స్‌లో ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. అతను టోర్నమెంట్‌లో 4 డ్రాలు, ఒక విజయం, 2 ఓటములతో ఉన్నాడు. ఇక మరో మ్యాచ్‌లో భారత ఆటగాడు ప్రజ్ఞానంద రమేష్‌బాబు అలిరేజా ఫిరోజ్జాను ఓడించాడు. ఏడో రౌండ్‌లో ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్‌పై, నల్లటి పావులతో ఆడుతున్న ప్రజ్ఞానంద సిసిలియన్ రక్షణను ఉపయోగించాడు. ప్రజ్ఞానంద ఓపెనింగ్ నుంచే కొంచెం మెరుగైన స్థానాన్ని పొందాడు. తదుపరి 19వ ఎత్తుగడతో డిఫైల్‌పై ఫిరోజ్జా నుండి అకాల పాన్ పుష్ అవకాశాన్ని 20 ఏళ్ల ప్రజ్ఞానంద అందిపుచ్చుకున్నాడు. చివరకు 12 ఎత్తుగడల తర్వాత ఫిరోజ్జా రాజీనామా చేయవలసి వచ్చింది. ఈ విజయంతో 2025 సింక్‌ఫీల్డ్ కప్‌లో అజేయంగా నిలిచిన ప్రజ్ఞా 7 పాయింట్లలో 4.5 పాయింట్లు సాధించాడు. రెండు రౌండ్ల ఆట మిగిలి ఉండగా, అతను ఇప్పుడు ఫాబియానో కరువానాతో కలిసి సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు.

# కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లు.. కోయెల్ వరల్డ్ రికార్డ్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో కోయెల్ బార్ యూత్ వరల్డ్ రికార్డ్ సృష్టించింది. అహ్మదాబాద్‌లో మంగళవారం జరిగిన యూత్ ఈవెంట్‌లో పోటీ పడుతున్న కోయెల్ మొత్తం 192 కిలోల బరువును ఎత్తి ప్రపంచ రికార్డు సృష్టించి బంగారు పతకాన్ని గెలుచుకుంది. మహిళల 53 కిలోల యువతకు ప్రపంచ ప్రమాణం 188 కిలోలు కాగా, ఈ మార్కును కోయెల్ సులభంగా అధిగమించింది. కోయెల్ క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కిలోలు విజయవంతంగా ఎత్తి ప్రపంచ రికార్డును కూడా సృష్టించాడు. దీనికి ప్రపంచ ప్రమాణం 105 కిలోలుగా నిర్ణయించబడింది.







# టి20 క్రికెట్ కెరీర్‌లో నో సెంచరీ

## పరుగుల్లో మాత్రం హీరోస్.. టాప్ 5లో ధోనీ, గంభీర్



**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్ 2003 లో ప్రారంభమై తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందింది. ప్రస్తుతం, ఈ లీగ్‌లు ప్రపంచవ్యాప్తంగా ఆడుతున్నారు. ఒక ఆటగాడు అనేక లీగ్‌లలో ఆడవచ్చు. అందుకే వారికి పరుగులు సాధించడానికి మరియు వికెట్లు తీయడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ, టీ20 లో చాలా మంది గొప్ప ఆటగాళ్ళు తమ మొత్తం కెరీర్‌లో సెంచరీ మాత్రం సాధించలేకపోయారు. అలాంటి టాప్ 5 మంది గొప్ప ఆటగాళ్లలో భారత్ నుండి ఎంఎస్ ధోనీ, గౌతమ్ గంభీర్ ఉన్నారు. పాకిస్తాన్ స్టార్ ఆల్ రౌండర్ షోయబ్ మాలిక్ టీ20 క్రికెట్‌లో గొప్ప ఆటగాళ్లలో ఒకరిగా పరిగణించబడ్డాడు. అతను 557 మ్యాచ్‌ల్లో దాదాపు 36 సగటుతో 13571 పరుగులు చేశాడు. ఇందులో 83 అర్ధ సెంచరీలు ఉన్నాయి కానీ అతను ఒక్క సెంచరీ కూడా చేయలేకపోయాడు. అతని అతిపెద్ద ఇన్నింగ్స్ 95 పరుగులు. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ విధ్వంసక బ్యాటింగ్‌కు పేరుగాంచాడు. వన్డే మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డును అతను కలిగి ఉన్నాడు. అయినప్పటికీ, మోర్గాన్ టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. అతను 371 మ్యాచ్‌ల్లో 7780 పరుగులు చేశాడు. ఇక భారత జట్టు మాజీ కెప్టెన్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ మహేంద్ర సింగ్ ధోని కూడా టీ20లో సెంచరీ చేయలేకపోయాడు. 405 మ్యాచ్‌లు ఆడిన ధోని దాదాపు 38 సగటుతో 7628 పరుగులు చేశాడు. ధోని అతిపెద్ద ఇన్నింగ్స్ 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

శ్రీలంక దిగ్గజ బ్యాట్స్‌మన్ కుమార్ సంగక్కర కూడా టీ20 క్రికెట్‌లో సెంచరీ చేయలేకపోయాడు. 2004 మరియు 2020 మధ్య ఈ ఫార్మాట్‌లో అతను 267 మ్యాచ్‌లు ఆడాడు. 43 అర్ధ సెంచరీలతో 6937 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 94 పరుగులు. చివరిగా ప్రస్తుత టీమిండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన కెరీర్‌లో ఎప్పుడూ టాప్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేశాడు. అతను తన టీ20 కెరీర్‌లో 251 మ్యాచ్‌లు ఆడి 6402 పరుగులు చేశాడు. అతను 53 హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్‌లు చేశాడు కానీ ఒక్క మూడంకెల స్కోరు కూడా చేరుకోలేకపోయాడు.



# యూఎస్ ఓపెన్‌లో.. అల్కరాజ్ శుభారంభం..

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ 2025లో రెండో సీడ్, స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో అల్కరాజ్ 6-4, 7-5, 6-4 తేడాతో అమెరికా ప్లేయర్ రీల్లీ ఓపెల్కాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లాడు. రెండు గంటల ఐదు నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. 14 ఏస్‌లు కొట్టడంతో పాటు 6 డబుల్ ఫాల్ట్స్ చేశాడు. 32 అనవసర తప్పిదాలు చేసినప్పటికీ తను అనుభవాన్ని ఉపయోగించి అల్కరాజ్ విజయం సాధించాడు. బుధవారం జరిగే రెండో రౌండ్‌లో అల్కరాజ్.. ఇటాలియన్ టెన్నిస్ ప్లేయర్ మట్టియా బెల్లుసితో తలపడనున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో బ్రిటన్‌కు చెందిన ఐదో సీడ్ జాక్ డ్రేపర్ 6-4, 7-5, 6-7(7), 6-2తో అర్జెంటీనా క్వాలిఫైయర్ ఫెడెరికో అగస్టిన్ గోమెజ్‌పై విజయం సాధించాడు. నార్వేకు చెందిన 12వ సీడ్ కాస్పర్ రూడ్ 6-1, 6-2, 7-6(5) తేడాతో ఆస్ట్రియాకు చెందిన సెబాస్టియన్ ఆఫ్నర్‌ను ఓడించాడు. ఇక మహిళ సింగిల్స్‌లో సంచలన ఫలితం నమోదైంది. స్టార్ ప్లేయర్ వీనస్ విలియమ్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవా చేతిలో 6-3, 2-6, 6-1 తేడాతో ఓటమిపాలైంది. కజకిస్తాన్‌కు చెందిన తొమ్మిదో సీడ్ ఎలెనా రిబాకినా 6-3, 6-0 తేడాతో అమెరికా ప్లేయర్ జులియెటా పరేజాను ఓడించి రెండో రౌండ్‌లోకి సులువుగా ప్రవేశించింది. రెండుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ బార్బోరా క్రెజిసికోవా 6-3, 6-2 తేడాతో కెనడియన్ ఓపెన్ విజేత విక్టోరియా ఎంబోకోను ఓడించింది.

# గ్లోబల్ ఇవి గేమ్‌లోకి భారత్ ఎంట్రీ

## మోడీ చేతుల మీదుగా మారుతీ సుజుకీ ఇవి ప్రారంభం




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో రెండు కీలక ప్రాజెక్టులకు అంకురార్పణ చేశారు. మారుతీ సుజుకీ మోటార్ ప్లాంట్‌లో మొట్టమొదటి గ్లోబల్ స్ట్రాటజిక్ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం (బిఈవి) ఇ-విటారాతో పాటు కొత్త హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్ ఉత్పత్తి చేసే ప్లాంటును ప్రధాని జెండా ఊపి ఆరంభించారు. ఇవిటారా భారతదేశంలో పూర్తి స్థాయిలో తయారుచేసిన తొలి ఎలక్ట్రిక్ కారు. 100 కంటే ఎక్కువ దేశాలకు రవాణా చేయాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్ మొదలైంది. క్లీన్ ఎనర్జీ తయారీ, గ్రీన్ మొబిలిటీకి ప్రపంచ కేంద్రంగా మారాలనే భారతదేశం ఆశయంలో ఇదొక కీలక ముందడుగు. ఈ కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, జపాన్ రాయబారి కీచీ ఒనో కూడా హాజరయ్యారు. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో సుజుకీ మోటార్ ప్లాంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుజుకీ తయారుచేసిన మొట్టమొదటి బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనం అయిన(బిఈవి) అయిన ఇ-విటారాజును ప్రారంభించారు. భారతదేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ఇవిటారాను ప్రదర్శించింది. పూర్తి స్థాయిలో ఇండియాలో తయారైన ఈ ఈవీ కారును జపాన్, యూరోపియన్ మార్కెట్లతో సహా 100 కంటే ఎక్కువ దేశాలకు ఎగుమతి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతి ప్రారంభంతో పాటు డెన్సో, తోషిబా, సుజుకీల జాయింట్ వెంచర్ అయిన టిడిఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని ప్రధాని మోదీ ఆరంభించారు. ఇందువల్ల 80 శాతం హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్స్ భాగాలు స్వదేశంలోనే ఉత్పత్తి అవుతాయి. ఇది దేశంలో నిజు బ్యాటరీ ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతుంది. తద్వారా భారత్ దిగుమతి కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. మారుతీ సుజుకీ తన తొలి ఎలక్ట్రిక్ కారును 2025 జనవరిలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఈ కారు రెండు బ్యాటరీ వేరియంట్లలో లభ్యం అవుతుంది. 49 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 144 హెచ్‌పి శక్తిని,189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అలాగే 61 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీ 174బిహెచ్‌పి శక్తిని, 189 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ భారీ బ్యాటరీ వేరియంట్ సుమారు 500 కి.మీ. పైగా రేంజ్ కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది. మారుతీ సుజుకీ ఇ-విటారా ఉత్పత్తికి రూ. 2,100 కోట్లు ఖర్చు చేసింది. ఈ కారును 100 దేశాలకు ఎగుమతి చేయడం ద్వారా భారతదేశాన్ని గ్లోబల్ ప్రొడక్షన్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని సుజుకీ మోటార్ కార్పొరేషన్ అధ్యక్షుడు తోషిహిరో సుజుకీ గతంలో పేర్కొన్నారు.

ఈవీ వినియోగాన్ని మెరుగుపరిచే దిశగా, మారుతీ సుజుకీ మొదటి దశలో 100 నగరాల్లో ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా, ఈ కార్లు కొనుగోలు చేసే వినియోగదారులకు స్మార్ట్ హోమ్ ఛార్జర్, ఇన్‌స్టాలేషన్ సపోర్ట్ కూడా అందించనున్నారు. ప్రతి 5-10 కిలోమీటర్లకు ఛార్జింగ్ స్టేషన్ ఉండేలా మారుతీ సుజుకీ ప్రణాళికలు సిద్ధం చేసింది

# ట్రంప్ టారిఫ్ ఆందోళనలు.. భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. భారత్ ఎగుమతి చేసే వస్తువులపై అమెరికా అదనపు సుంకాలు బుధవారం నుంచి అమలు కానున్నాయి. ఇప్పటికే 25శాతం సుంకాలు అమలులోకి వచ్చిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25శాతం సుంకాలు విధించగా.. బుధవారం (ఆగస్టు 27 నుంచి ) 50శాతానికి చేరనున్నాయి. ఈ క్రమంలో సుంకాల ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లు ఒక శాతానికిపైగా పడిపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 81,377.39 వద్ద నష్టాల్లో మొదలైంది. సుంకాల ఆందోళన నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇంట్రాడేలో 81,450.28 పాయింట్ల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,685.98 పాయింట్లకు పడిపోయింది. చివరకు 849.37 పాయింట్ల నష్టంతో 80,786.54 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 255.70 పాయింట్లు తగ్గి 24,712.05 వద్ద స్థిరపడింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి 13 పైసలు తగ్గి 87.69 వద్ద ముగిసింది. మార్కెట్లు దాదాపు 1,167 షేర్లు లాభపడగా.. 2,751 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్ నష్టపోగా.. ఐషర్ మోటార్స్, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి, నెస్లే ఇండియా, ఐటీసీ లాభాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ మినహా మిగతా అన్నిరంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, ఫార్మా, ఆయిల్ అండ్ గ్యాస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియాల్టీ, టెలికాం ఒకటి నుంచి రెండుశాతం వరకు తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 1.3శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.7 శాతం తగ్గాయి.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14